

# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర:- సంపుటి:1 సంచిక: 196: సోమవారం 16 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు30:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్



# సీఎం సీరియస్

**ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై డ్రగ్స్ కేసుపై ఆగ్రహం**

అమరావతి, మార్చి 15 (మనసులో మాట) : మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్‌పై ఆరోపణలను చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. కాగా, డ్రగ్స్ కేసులో అరెస్టైన పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించడంతో విడుదలయ్యారు.



కావూరి మృతి రాజకీయ రంగానికి

## తీరని లోటు

ఏపీ ముఖ్యమంత్రి
చంద్రబాబు నాయకుడు

02

---

తిరుమల కొండలను

## కమ్మేసిన పొగమంచు

అనూహ్య వాతావరణంతో
భక్తుల పులకింత
వేసవి ఎండల్లోనూ
శ్రీవారి సన్నిధిలో చల్లదనం..
మంచు దుప్పటితో కనువిందు
చేస్తున్న శేషాచలం
ఘాట్ రోడ్డులో దట్టంగా కురిసిన
మంచు.. వాహనాల రాకపోకలకు
స్వల్ప అంతరాయం




ఆస్కార్ అవార్డులకు

## వేళాయె!

ప్రదానోత్సవానికి సర్వం సిద్ధం
నేడే లాస్ ఏంజెలెస్‌లో వేడుక
డాల్బీ థియేటర్‌లో తారల సందడి..
వరుసగా రెండో ఏడాది హోస్ట్‌గా
కోనన్ ఓబ్రీన్
భారత కాలమానం ప్రకారం
తెల్లవారుజామున
4.30 నుంచి ప్రత్యక్ష ప్రసారం

03

---

# వదంతులు నమ్మవద్దు..

## వంట గ్యాస్ కొరత లేదు

3.82 రోజులకు
సరిపడా నిల్వలు సిద్ధం
గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యం
నిరంతర పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు
పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్





**అమరావతి, మార్చి 15 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం వంట గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్ స్పష్టం చేశారు. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయని ఆయన వెల్లడించారు. ఆదివారం అమరావతిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న నిరాధారమైన వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని గ్యాస్ కనెక్షన్ల వివరా

మిగితా 2వ పేజీలో

---



నేను ఏ తప్పూ చేయలేదు

# దుష్ప్రచారాలు నమ్మవద్దు..

స్నేహితుడిని కలవడానికే వెళ్లాను..
విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తా
నిజం త్వరలోనే వెలుగులోకి వస్తుంది..
ఎంపీ పుట్టా మహేష్ కుమార్
ఏలూరు ప్రజలకు, అనుచరులకు ఎంపీ విజ్ఞప్తి

**అమరావతి, మార్చి 15 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం వంట గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్ స్పష్టం చేశారు. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాయని ఆయన వెల్లడించారు. ఆదివారం అమరావతిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో

మిగితా 2వ పేజీలో

---

# ఇరాక్‌లో డ్రోన్ల బీభత్సం

రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం..
అమెరికా ఎంబసీపై దాడులు
ఎర్బిల్‌లో చమురు ఉత్పత్తి నిలిపివేత..
బాగ్దాద్ గ్రీన్ జోన్‌లోకి దూసుకెళ్లిన సూసైడ్ డ్రోన్లు
అమెరికా ఎంబసీలో రాడార్ వ్యవస్థ ధ్వంసం..
పౌరులు తక్షణమే దేశం
విడిచి వెళ్లాలని యూఎస్ హెచ్చరిక

04



### సరదాకి కూడా దాడులు చేస్తాం

- ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఖర్గ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలు పూర్తి ధ్వంసం
- అవసరమైతే మరిన్ని దాడులకు వెనుకాడబోం
- హార్ముజ్ జలసంధిలో కవ్వింపు చర్యలకు దిగితే ఆయిల్ కేంద్రాలే లక్ష్యం..
- టెహ్రాన్‌కు వైట్ హౌస్ స్ట్రాంగ్ వార్నింగ్



థ్యాంక్యూ...

## మనమిత్ర

- వాట్సాప్ గవర్నెన్స్‌కు పదో తరగతి విద్యార్థుల జేజేలు
- హాయ్ అనగానే మొబైల్‌లోకి హాల్ టికెట్లు..
- 2.38 లక్షల మందికి చేరిన ప్రవేశ పత్రాలు
- డిజిటల్ విప్లవానికి నాంది..

02

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో

## భారత్ హవా

మూడో స్థానంలో 229 మంది బిలియనీర్లు
అగ్రస్థానంలో అమెరికా, చైనా..
సగటున రోజుకు ఒకరు కుబేరుడిగా అవతరణ
యువత జోరు.. పిన్న వయస్కుడిగా
భారత సంతతి యువకుడు సూర్య మిధా రికార్డు

04

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు

## మోగిన నగారా!

- కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు షెడ్యూల్‌విడుదల
- ఏప్రిల్ 9న పోలింగ్, మే 4న ఫలితాలు

04



# వదంతులు నమ్మవద్దు..

( మొదటి పేజీ తరువాయి )

లను వెల్లడిస్తూ ప్రస్తుతం మొత్తం 161.19 లక్షల కనెక్షన్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇందులో ఐఓసీఎల్ (IOCL) పరిధిలో 56.86 లక్షలు, హెచ్‌పీసీఎల్ పరిధిలో 74.11 లక్షలు మరియు బీపీసీఎల్ పరిధిలో 30.22 లక్షల కనెక్షన్లు ఉన్నాయన్నారు. నిల్వల విషయానికొస్తే ఈ నెల 15వ తేదీ నాటికి మొత్తం 15,699 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ స్టాక్ అందుబాటులో ఉందని, ఇది సుమారు 3.82 రోజులకు సరిపోతుందని వివరించారు. కంపెనీల వారీగా చూస్తే ఐఓసీఎల్ వద్ద 5.3 రోజులు, హెచ్‌పీసీఎల్ వద్ద 3 రోజులు మరియు బీపీసీఎల్ వద్ద 3.2 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయనీ ఆయన పేర్కొన్నారు. గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగా పరిశ్రమలకు బల్క్ ఎల్‌పీజీ సరఫరాను ప్రభుత్వం నిలిపివేసిందని, వాణిజ్య సరఫరాను కూడా పరిమితం చేసినట్లు కమిషనర్ తెలిపారు. అయితే ఆసుపత్రులు, హాస్టళ్లు మరియు ఇతర ప్రభుత్వ సేవలకు మాత్రం వాణిజ్య సరఫరాలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు



స్పష్టం చేశారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఓటీపీ ఆధారిత డెలివరీ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని, డిస్ట్రిబ్యూటర్ వారీగా పెండింగ్ బుకింగ్స్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీతో పాటు మంత్రుల బృందం కూడా తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ఆయన వివరించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు ప్రతి ఆరు గంటలకు ఒకసారి స్టాక్ పాయింట్లను తనిఖీ చేసేలా ఆదేశాలు జారీ చేశామని, రాష్ట్రంలో గ్యాస్ సరఫరా వ్యవస్థ పూర్తిగా నియంత్రణలో ఉందని సౌరవ్ గౌర్ పునరుద్ఘాటించారు.



# తిరుమల కొండలను కమ్మేసిన పొగమంచు

- అనూహ్య వాతావరణంతో భక్తుల పులకింత
- వేసవి ఎండల్లోనూ శ్రీవారి సన్నిధిలో చల్లదనం..
- మంచు దుప్పటితో కనువిందు చేస్తున్న శేషాచలం
- ఘాట్ రోడ్డులో దట్టంగా కురిసిన మంచు.. వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం

**తిరుమల, మార్చి 15 (మనసులో మాట):** వేసవికాలంలో ఎండ వేడిమితో అల్లాడిపోతున్న భక్తులకు తిరుమల శ్రీవారి సన్నిధిలో అనూహ్యంగా మారిన వాతావరణం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు తిరుమల కొండలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. శ్రీవారి ఆలయ పరిసరాల నుంచి మొదలుకొని కొండపైకి వచ్చే ఘాట్ రోడ్డు మార్గం వరకు అంతా మంచుమయంగా మారిపోయింది. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మాత్రమే కనిపించే ఈ అరుదైన దృశ్యాలు, ఇప్పుడు మార్చి నెలలో వేసవి ప్రారంభంలో కనిపించడం విశేషం. దట్టమైన మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో, ఘాట్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైవర్లు వాహనాల హెడ్ లైట్లు వేసుకుని అతి తక్కువ వేగంతో ప్రయాణించాల్సి వచ్చింది. మరోవైపు, ఎండ వేడి నుంచి ఒక్కసారిగా చల్లని వాతావరణం నెలకొనడంతో శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొండపై మంచు కురుస్తున్న దృశ్యాలను భక్తులు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తూ కనువిందు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల ప్రభావం లేదా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్లే ఈ స్థాయిలో పొగమంచు కురిసి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా, ఎండల ధాటి నుంచి ఉపశమనం లభించడంతో తిరుమల గిరులు ఇప్పుడు కాశ్మీర్‌ను తలపిస్తున్నాయి.

## కావూరి మృతి రాజకీయ రంగానికి తీరని లోటు

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు**

**హైదరాబాద్, మార్చి 15 (మనసులో మాట):** కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ దిగ్గజం కావూరి సాంబశివరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేంద్ర మంత్రిగా, ఐదుసార్లు పార్లమెంట్ సభ్యునిగా కావూరి సాంబశివరావు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. "కావూరి గారు నిఖార్సైన రాజకీయ నేత మాత్రమే కాదు, విజయవంతమైన పారిశ్రామికవేత్త కూడా. ఆయన చిత్తశుద్ధి, విలువలతో కూడిన రాజకీయం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు" అని చంద్రబాబు పేర్కొన్నారు. మచిలీపట్నం, ఏలూరు నియోజకవర్గాల అభివృద్ధిలో కావూరి ముద్ర చెరగనిదని, ప్రజా సమస్యలపై పార్లమెంటులో ఆయన వినిపించిన గళం ఎప్పటికీ గుర్తుండిపోతుందని కొనియాడారు. అనంతరం కావూరి కుమారుడు భాస్కర్, కుమార్తెలు మరియు ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కావూరి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, సీనియర్ నేతలు కూడా కావూరి నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.



# మానసిక ప్రశాంతతతో అత్యుత్తమ ఫలితాలు సాధించండి

**బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులకు మంత్రి సవిత పిలుపు**

**అమరావతి, మార్చి 15 (మనసులో మాట):** నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కాబోయే పదో తరగతి పరీక్షలకు మొత్తం 13,604 మంది బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో బీసీ హాస్టళ్ల నుంచి 8,068 మంది, మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) స్కూళ్ల నుంచి 5,536 మంది విద్యార్థులు ఉన్నారు. వెనుకబడిన తరగతుల బిడ్డలు విద్యాపరంగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ, మెటీరియల్స్ అందజేశామని, ముఖ్యంగా చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైన మలుపు అని, తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తూ ఉపాధ్యాయుల దిశానిర్దేశంలో అత్యుత్తమ మార్కులు సాధించాలని మంత్రి సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, హాల్ టికెట్లతో పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని కోరారు. బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో మెరుగైన మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని, విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్యను అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గతేడాది ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను ఈ ఏడాది కూడా పునరావృతం చేయాలని, బీసీ హాస్టల్ విద్యార్థులు కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. అలాగే, డీబీసీడబ్ల్యూవోలు మరియు ఇతర సిబ్బంది నిరంతరం విద్యార్థుల వెంటే ఉండి, పరీక్షలు ముగిసిన తర్వాత వారిని క్షేమంగా తిరిగి హాస్టళ్లకు చేర్చాలని ఆమె ఆదేశించారు.

# బి.ప్రత్తిపాడులో డ్రైనేజీ వివాదం

**– కత్తులు, రాడ్లతో ఇరువర్గాల పరస్పర దాడి..**
**– ఆరుగురికి గాయాలు!**

పిఠాపురం, మార్చి 15 (మనసులో మాట): పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ విషయంలో తలెత్తిన చిన్న వివాదం చినికి చినికి గాలివానలా మారి, రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఆదివారం ఊటా శ్రీను, ఊటా రాంబాబు వర్గీయులు కత్తులు, రాడ్లతో పరస్పరం దాడులు చేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ పనుల విషయంలో గత పది రోజులుగా ఊటా శ్రీను, ఊటా రాంబాబు వర్గాల మధ్య విభేదాలు నడుస్తున్నాయి. రాంబాబు తన ఇంటి వద్ద డ్రైనేజీ వద్దని అడ్డుకోవడంతో మొదలైన ఈ వివాదం, గతంలోనే ఇద్దరి మధ్య వాగ్వాదానికి దారితీసింది. అప్పట్లో గ్రామ పెద్దలు సర్దిచెప్పినప్పటికీ, ఆదివారం మరోసారి అదే విషయంపై ఇరువర్గాలు రోడ్డుపైకి వచ్చి భీకరంగా తలపడ్డాయి. ఈ పరస్పర దాడుల్లో ఇరువర్గాలకు చెందిన ఆరుగురు గాయపడగా, వారిని వెంటనే పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రి ప్రాంగణంలో కూడా ఇరువర్గాలు మరోసారి గొడవకు దిగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వీరిలో ఊటా రాంబాబుకు గాయాలు ఎక్కువగా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం ఆయనను కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది



# ఏపీలో విభిన్న వాతావరణం

- రానున్న మూడు రోజులు ఎండలతో పాటు వర్షాలకు అవకాశం
- ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి




అమరావతి, మార్చి 15 (మనసులో **మాట)**: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో వాతావరణం విభిన్నంగా ఉండనుందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఒకవైపు ఎండల తీవ్రత కొనసాగుతూనే, మరోవైపు ఆకాశం మేఘావృతమై కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ద్రోణి ప్రభావంతో పాటు నైరుతి దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. అలాగే అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి జల్లులు పడవచ్చని తెలిపింది. ఆకస్మికంగా కురిసే వర్షాల సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పిడుగులు పడే సమయంలో పొలాల్లో పనులు చేసేవారు, పశువుల కాపరులు చెట్ల కింద గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఉండరాదని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది.

## నేను ఏ తప్పూ చేయలేదు

# దుష్ప్రచారాలు నమ్మవద్దు..

హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన డిన్నర్ పార్టీ ఉదంతంపై ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి తనపై వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగిసిన అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్న ఎంపీ, ఒక వీడియో ప్రకటన ద్వారా తన వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి వ్యక్తినో గత రెండేళ్లుగా ఏలూరు నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు మరియు కార్యకర్తలకు బాగా తెలుసని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తనకు ఎటువంటి దురలవాట్లు లేవని, జీవితంలో ఏ తప్పు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే తాను మొయినాబాద్ వెళ్లానని, అక్కడ నుంచి తిరిగి వస్తున్న సమయంలో జరిగిన కొన్ని పరిణామాలను మీడియాలో తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చానని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఎంపీ వెల్లడించారు. "నిజం ఎప్పుడూ గెలుస్తుంది, పూర్తి వివరాలతో త్వరలోనే ప్రజల ముందుకు వస్తాను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనపై వస్తున్న నిరాధారమైన కథనాలను ఎవరూ నమ్మవద్దని, అభిమానులు మరియు ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ఆ వీడియోలో విజ్ఞప్తి చేశారు. రాజకీయంగా తన ప్రతిష్టను దెబ్బతీయడానికే ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.





# శ్రీశైలానికి పోటెత్తిన భక్త జనం

పెద్దదోర్నాల, మార్చి 15 (మనసులో మాట) : ఉగాది బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తజనం శ్రీశైలానికి ఆదివారం భారీగా తరలివెళ్లారు. ఈ క్రమంలో దోర్నాలలో వాహనాల రద్దీ ఏర్పడింది. ప్రధానంగా స్థానిక ఫారెస్టు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు బారులుదీరాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండాపోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. నల్లమల శిగలో కొలువైన ఆది దంపతులు శ్రీభ్రమరాంబికా మల్లికార్జునుల దర్శనార్థం ఆంధ్ర, తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచిభక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ముఖ్యంగా కన్నడిగులు భ్రమరాంబికాదేవిని తమ ఆడపడుచుగా భావిస్తారు. ఈ క్రమంలో శివరాత్రి మహోత్సవాలలో గౌరీశంకరుల కల్యాణం జరిగిందని, తమఆడబిడ్డకు చీర, సారె తీసుకు వెళ్లాలని కర్ణాటక రాష్ట్రం నుంచి సుమారు 1200 కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన అడవిలో రాళ్లు, రప్పల మధ్య తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయక మొక్కులు తీర్చుకునేందుకు ప్రయాణిస్తున్నారు. దీంతో నల్లమలలో ఓం నమఃశివాయఅంటూ తమ భక్తిని చాటుతూ హోరెత్తిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు అటవీ ప్రాంతంలో తాగునీరు, భోజన వసతిని కల్పించారు.




# ఆస్కార్ అవార్డులకు వేళాయె!

**లాస్ ఏంజెలెస్**: ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ (అకాడమీ) అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధమైంది. అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఉన్న డాల్బీ థియేటర్ ఈ మెగా ఈవెంట్‌కు వేదిక కానుంది. 98వ ఆస్కార్ వేడుకలకు హాలీవుడ్ ప్రముఖ నటుడు, కమెడియన్ కోనన్ ఓబ్రీన్ వరుసగా రెండో ఏడాది వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం **(మార్చి 16) తెల్లవారుజామున 4**:30 గంటల నుంచి ఈ వేడుక ప్రారంభం కానుంది. ఈ ఏడాది మొత్తం 24 విభాగాల్లో పురస్కారాలను అందజేయనున్నారు. ప్రధానంగా 'సిన్నర్స్' చిత్రం రికార్డు స్థాయిలో 16 నామినేషన్లతో రేసులో ముందంజలో ఉంది. అలాగే 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్', 'ఫ్రాంకెన్‌స్టెన్', 'హ్యామ్నెట్', 'మార్టీ సుప్రీమ్' వంటి చిత్రాలు ఉత్తమ చిత్రం కేటగిరీలో గట్టి పోటీనిస్తున్నాయి. ఈసారి కొత్తగా 'బెస్ట్ కాస్టింగ్' విభాగంలో కూడా అవార్డును పరిచయం చేయడం విశేషం. భారతీయ భక్తులు మరియు సినీ అభిమానుల కోసం ఈ వేడుకను జియో హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. అలాగే స్టార్ మూవీస్, స్టార్ మూవీస్ సెలెక్ట్ ఛానళ్లలో కూడా లైవ్ ప్రసారం కానుంది. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ ఈ వేడుకలో ఒక అవార్డు ప్రజెంటర్‌గా వ్యవహరిస్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఈ ఏడాది ఆస్కార్ విజేతలు ఎవరనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.



# థ్యాంక్యూ... మనమిత్ర

**మరావతి, మార్చి 15 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవలకు పదో తరగతి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. టెన్త్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్ల కోసం విద్యార్థులు పాఠశాలల చుట్టూ తిరిగే పనిలేకుండా, నేరుగా తమ ఫోన్ ద్వారా పొందేలా ప్రభుత్వం కల్పించిన ఈ వెసులుబాటు అద్భుత ఫలితాలను ఇచ్చింది. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం డిజిటల్ గవర్నెన్స్‌లో కొత్త ఒరవడికి నాంది పలికింది. విద్యాశాఖ గణాంకాల ప్రకారం, మనమిత్ర వాట్సాప్ నంబర్ (9552300009)





# నిందితులు చెప్పిందే వేదమా?

- జగన్, భారతిని విచారించాల్సిందే..
- అదనపు ఆధారాలు ఇచ్చినా దర్యాప్తు సంస్థల్లో చలనం లేదు
- న్యాయం కోసం చివరి వరకు పోరాడతా..
- సీబీఐ విచారణపై వైఎస్ సునీత అసంతృప్తి:

**కడప, మార్చి 15 (మనసులో మాట)**: తన తండ్రి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థ సీబీఐ తీరుపై ఆయన కుమార్తె వైఎస్ సునీత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఐ బాధ్యతాయుతంగా విచారణ జరపడం లేదని ఆమె ఆవేదన చెందారు. ఆదివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దర్యాప్తు సంస్థల పనితీరును ఎండగట్టారు. ఈ హత్య కేసులో కీలక నిందితులు చెప్పిన మాటలను వినడమే తప్ప, వారిని లోతుగా విచారించే ప్రయత్నం సీబీఐ చేయలేదని ఆమె ఆరోపించారు. హత్య జరిగిన తర్వాత నిందితుల మధ్య భారీగా ఫోన్ సంభాషణలు, సందేశాలు మారాయని.. వాటిని సీబీఐ సీరియస్‌గా తీసుకోవడం లేదని సునీత పెదవి విరిచారు. "ఇంకా ఏమైనా ఆధారాలు ఉంటే ఇవ్వాలని కోరితే, నా వద్ద ఉన్న అదనపు ఆధారాలను కోర్టుతో పాటు సీబీఐకి కూడా సమర్పించాను. కానీ వాటిపై కనీస విచారణ జరపలేదు" అని ఆమె పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఉన్న

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# ఇరాక్‌లో డ్రోన్ల బీభత్సం

- రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం..
- అమెరికా ఎంబసీపై దాడులు
- ఎర్బిల్‌లో చమురు ఉత్పత్తి నిలిపివేత..
- బాగ్దాద్ గ్రీన్ జోన్‌లోకి దూసుకెళ్లిన సూసైడ్ డ్రోన్లు
- – అమెరికా ఎంబసీలో రాడార్ వ్యవస్థ ధ్వంసం..
- – పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లాలని యూఎస్ హెచ్చరిక








**బాగ్దాద్/ఎర్బిల్**: ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్ నగరం డ్రోన్ దాడులతో వణికిపోయింది. శనివారం రాత్రి లానాజ్ ఆయిల్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని జరిగిన డ్రోన్ దాడిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆకాశమంత ఎత్తున ఎగిసిపడిన మంటలు, దట్టమైన నల్లటి పొగతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఈ ప్రమాదం కారణంగా రిఫైనరీలో చమురు ఉత్పత్తిని అధికారులు తక్షణమే నిలిపివేశారు. ఆదివారం ఉదయం నాటికి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, నష్టాన్ని అంచనా వేసే వరకు కార్యకలాపాలు పునరుద్ధరించే ప్రసక్తే లేదని కుర్దిస్థాన్ ఇంధన వనరుల శాఖ వెల్లడించింది. మరోవైపు, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అత్యంత కట్టుదిట్టమైన 'గ్రీన్ జోన్'లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంపై కూడా డ్రోన్ల వర్షం కురిసింది. ఎంబసీ ప్రాంగణంలోని హెలిప్యాడ్ మరియు కీలకమైన రాడార్ వ్యవస్థ లక్ష్యంగా సూసైడ్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ దాడిలో ఎంబసీలోని శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ, రాడార్ పరికరాలు పూర్తిగా ధ్వంసమైనట్లు సమాచారం. అమెరికా మరియు ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత, బాగ్దాద్‌లోని రాయబార కార్యాలయంపై దాడి జరగడం ఇది రెండోసారి. ఈ దాడులకు ఇరాన్ మద్దతు గల 'ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్' గ్రూపు బాధ్యత వహించింది. ఇరాన్ మద్దతు గల కతైబ్ హిజ్బుల్లా కమాండర్ అబూ అలీ అల్–అమిరీ సహా ముగ్గురు సభ్యులు అమెరికా దాడుల్లో మరణించిన కొద్ది గంటల్లోనే ఈ ప్రతీకార దాడులు జరగడం గమనార్హం. ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరడంతో, అమెరికా ప్రభుత్వం తన పౌరులకు కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాక్‌లో ఉన్న అమెరికన్లు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంబసీ లేదా కన్సలేట్ కార్యాలయాలకు రావద్దని సూచించింది.

# సరదాకి కూడా దాడులు చేస్తాం

- ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఖర్గ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలు పూర్తి ధ్వంసం
- అవసరమైతే మరిన్ని దాడులకు వెనుకాడబోం
- హార్ముజ్ జలసంధిలో కవ్వింపు చర్యలకు దిగితే ఆయిల్ కేంద్రాలే లక్ష్యం..
- టెహ్రాన్‌కు వైట్ హౌస్ స్ట్రాంగ్ వార్నింగ్



**వాషింగ్టన్**: ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు చెందిన అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంపై "సరదాకి కూడా మరికొన్ని దాడులు చేయొచ్చు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఖర్గ్ ద్వీపంలోని సైనిక స్థావరాలు చాలావరకు "పూర్తిగా ధ్వంసమయ్యాయి" అని ఆయన స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూతో పాటు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాలు, క్షిపణి ముప్పులకు ప్రతిస్పందనగా ఇటీవల అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే మార్చి 13న ఖర్గ్ ద్వీపంపై అమెరికా వైమానిక దళం విరుచుకుపడింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ ఖర్గ్ ద్వీపం నుంచే జరుగుతుంటాయి. అయితే, అమెరికా దాడుల్లో తమ చమురు శుద్ధి కేంద్రాలకు ఎటువంటి నష్టం జరగలేదని, కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నారని ఇరాన్ మీడియా వెల్లడించింది. దీనిపై స్పందించిన ట్రంప్, హార్ముజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛా రవాణాకు ఇరాన్ గనుక ఆటంకం కలిగిస్తే, అక్కడి ఆయిల్ మౌలిక సదుపాయాలను కూడా ధ్వంసం చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తాజా పరిణామాలతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింతగా కమ్ముకుంటున్నాయి

# పుట్టా చిట్టా ఎలా విప్పుతారో!?

## టీడీపీని పట్టుకున్న డ్రగ్స్ భూతం!




ఏం చేయబోతున్నారు చంద్రబాబు నాయుడు.. పాలనలో.. అభివృద్ధిలో ఢిల్లీ నుంచి గల్లీ వరకు హుషారుగా ముందుకు పోతున్న చంద్రబాబు నాయుడిని ఆయన సొంత పార్టీకి చెందిన నాయకులు తమ చేష్టలతో చొక్కా పట్టుకుని మరీ వెనక్కి లాగుతున్నారు.. మొన్నటికి మొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వివాదం.. ఒక మహిళతో ఆయన సన్నిహితంగా ప్రవర్తిస్తున్న వీడియో రేపిన కలకలం అంతా ఇంతా కాదు. అది మార్ఫింగ్ వీడియో అని.. తెలిసిన వారితో ఆ మాత్రం సన్నిహితంగా ఉంటే తప్పేంటని.. ఇందులో బీఆర్ నాయుడు చేసిన నేరం ఏమీ లేదని తెలుగుదేశం వర్గాలు..ఆ పార్టీకి చెందిన సోషల్ మీడియా బ్యాచీలు ఎంతగా తాపత్రయ పడినా గాని.. ఆ ఉదంతంలో తెలుగుదేశం పార్టీ..ప్రభుత్వంపై పెద్ద పిడుగే పడింది.

ఆ కలకలం ఇంకా సద్దుమణగక ముందే ఇదిగో మరో బాంబు ఏలూరు ఎంపీ రూపంలో బాబు ముంగిట మళ్ళీ పడింది.
డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పాల్గొన్నట్టు.. ఆరోపణలే కాదు..సోషల్ మీడియాలో చర్చలే కాదు..
ఆ దశలు దాటి ఆధారాలతో సహా బయటపడినట్టు చెబుతున్నారు.ఈ వ్యవహారం ఇప్పటికే పెను దుమారం రేపింది.ఇప్పటికైతే తెలుగుదేశం పార్టీ మహేష్ కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ వ్యవహారంపై నలభై ఎనిమిది గంటల్లో వివరణ ఇవ్వాలన్నది ఆ నోటీస్ సారాంశం.. ఏలూరు ఎంపీ పార్టీ..ప్రభుత్వ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కూడా అందులో పేర్కొన్నారు.ఈ నోటీస్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుని పేర జారీ అయింది.మరి మహేష్ ఎలా స్పందిస్తారో.. ఏం చెబుతారో చూడాలి.

మహేష్ ఏలూరు ఎంపీ మాత్రమే కాదు.. గతంలో టీటీడీ చైర్మన్ గా పనిచేసిన సుధాకర్ యాదవ్ కొడుకు కూడా.. అంతేకాదు.. యనమల రామకృష్ణుడు అల్లుడిని కూడా అంటున్నారు. ఈ కారణాల వల్లనే ఆయనకు ఏలూరు ఎంపీ టికెట్ దక్కింది. వాస్తవానికి పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఎంపీ ఎక్కడ ఉండాలి.. ఏం చేస్తూ ఉండాలి.. ఢిల్లీలో..సభలో కూర్చుని నియోజకవర్గం సమస్యలు.. రాష్ట్ర సమస్యలపై అంశాలు లేవనెత్తుతూ ఎంపీగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండాలి.. కానీ, పుట్టా మహేష్ ఎక్కడున్నారు. పార్టీలో.. ఏం చేస్తూ ఉన్నారు.. డ్రగ్స్ సేవిస్తూ.. ఏం జరిగింది.. ఏమీ జరిగి ఉండకపోతే
ఈ వ్యవహారం ఎవరికీ తెలిసి ఉండేది కాదు కదా.. ఆ సమయంలో జరిగిన రైడ్‌లో మహేష్ పట్టుబడ్డారు.. ఇక బుకాయించడానికి లేకుండా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడినట్టే.. కథ అక్కడితో ఆగిపోలేదు.. అనంతరం జరిగిన పరీక్షల్లో
సదరు మహేష్ సార్ పాజిటివ్ గా నిర్ధారణ అయిందని సమాచారం. దాంతో ప్రతిపక్షానికి పెద్ద అస్త్రమే దొరికింది..
వైసీపీ కంటే ముందుగా కాంగ్రెస్ పార్టీ యుద్ధం ప్రారంభించింది.మహేష్ ను బర్తరఫ్ చెయ్యాలని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేస్తున్నారు. ఇంకా.. ఇంకా అనేక వైపుల నుంచి అనేక మంది ఈ వ్యవహారంపై పెద్దగా గళం విప్పుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాగే అంబటి రాంబాబు ఆడియో..టిటిడి సభ్యుడు పృథ్వీ లీక్స్ విషయంలో.. అలాగే ఎంపిగారి న్యూడ్ వీడియో కాల్స్ వివాదంలో రచ్చరచ్చ చేసిన టిడిపి ఇప్పుడు సొంత పార్టీ ఎంపీ డ్రగ్స్ వ్యవహారంలో ఏం చేయబోతోంది.!?
నిజానికి ఇది టిడిపికి మాత్రమే పరిమితమైన వ్యవహారం కాదు..కూటమి ఉమ్మడి ప్రతిష్ఠకు సంబంధించిన ఉదంతం. ఇలాంటి విషయాలను అస్సలు సహించని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందన ఎలా ఉంటుందనే అంశంపై కూడా ఇప్పుడు చర్చ మొదలైంది. అంతేనా.. మహేష్ తెలుగుదేశం ఎంపీ మాత్రమే కాదు..వాస్తవంగా కూటమికి చెందిన కీలక ప్రజాప్రతినిధి.
ఆయన వ్యవహారం కూటమికి కూడా మచ్చ తెచ్చేదే.. అటు బీజేపీ.. ఇటు జనసేన.. మధ్యలో నిర్ణయం తీసుకోవాల్సిన తెలుగుదేశం.. ఆ పార్టీ అధినేత..ముఖ్యమంత్ర నారా చంద్రబాబునాయుడు ఇరకాటంలో పడ్డారు. అందునా బాబు ప్రధాన నినాదాల్లో డ్రగ్స్ నిర్మూలన ఒకటి..ఇప్పుడు ఆయన ఆస్థానంలోని ఎంపీనే నిందితుడు..

ఏం చేస్తారు చంద్రబాబు.. మిలియన్ డాలర్ల ప్రశ్న అయితే కాదు. ఖచ్చితంగా చంద్రబాబు మాత్రమే జవాబు
చెప్పగలిగే.. చెప్పవలసిన క్లిష్ట ప్రశ్న..!




## ఐదు రాష్ట్రాల ఎన్నికలకు

# మోగిన నగారా!

**కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు షెడ్యూల్‌విడుదల**
**ఏప్రిల్ 9న పోలింగ్, మే 4న ఫలితాలు**


**ఢిల్లీ, మార్చి 15 (మనసులో మాట)**: ఈ ఏడాదిలో దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల (ఒక కేంద్ర పాలిత ప్రాంతం) అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ వెలువడింది. ఇవాళ సీఈసీ జ్ఞానేష్‌కుమార్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వివరాలను వివరించారు. కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి ఎన్నికల షెడ్యూల్‌ను సీఈసీ వెల్లడించారు. బెంగాల్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన రాష్ట్రాల్లో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించేలా సీఈసీ నిర్ణయించారు. అస్సాం, కేరళ, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న ఎన్నికలు జరుగుతాయి. పశ్చిమబెంగాల్‌లో మాత్రం ఏప్రిల్ 23, 29న రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయని జ్ఞానేష్‌కుమార్ తెలిపారు. అయితే అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మాత్రం మే 4న వెలువడనున్నాయి. అలాగే ఆరు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా వుండగా పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి, మమతా సర్కార్‌కు మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు తలెత్తాయి. చివరికి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్‌పై కూడా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. దీంతో జ్యుడిషియరీ సిబ్బందితో కార్యక్రమాన్ని నిర్వహించేలా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ చివర్లో రెండు దశల్లో ఎన్నికల నిర్వహణపై మమతా బెనర్జీ ఎలా స్పందిస్తారో చూడాలి.

## ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో

# భారత్ హవా

- మూడో స్థానంలో 229 మంది బిలియనీర్లు
- అగ్రస్థానంలో అమెరికా, చైనా..
- సగటున రోజుకు ఒకరు కుబేరుడిగా అవతరణ
- యువత జోరు.. పిన్న వయస్కుడిగా భారత సంతతి యువకుడు సూర్య మిధా రికార్డు

**న్యూఢిల్లీ, మార్చి 15 (మనసులో మాట)**: ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ 2026 సంవత్సరానికి గాను విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్ తన సత్తా చాటింది. మొత్తం 229 మంది బిలియనీర్లతో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 989 మంది కుబేరులతో అమెరికా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకోగా, 610 మందితో చైనా రెండో స్థానంలో కొనసాగుతోంది. గతేడాదితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. ఈ ఏడాది కొత్తగా 390 మంది ఈ క్లబ్‌లో చేరడంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం కుబేరుల సంఖ్య 3,400 మార్కును దాటింది. అంటే ఏడాది కాలంలో సగటున రోజుకు ఒకరు బిలియనీర్‌గా ఎదిగారు. భారత్ తర్వాత జర్మనీ (212), రష్యా (147) దేశాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కాగా, ఈసారి తొలిసారిగా ఆఫ్ఘనిస్థాన్ మరియు పాకిస్థాన్ దేశాల నుంచి కూడా బిలియనీర్లు ఈ జాబితాలో చోటు దక్కించుకోవడం విశేషం. ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో యువత హవా స్పష్టంగా కనిపిస్తోంది. భారత సంతతికి చెందిన 22 ఏళ్ల సూర్య మిధా స్వశక్తితో ఎదిగిన అత్యంత పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా రికార్డు సృష్టించారు. తన స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'మెర్కార్' అనే ఏఐ రిక్రూటింగ్ స్టార్టప్ అతడిని ఈ స్థాయికి చేర్చింది. మరోవైపు, బ్రెజిల్‌కు చెందిన 20 ఏళ్ల అమెలీ వోయిగ్ట్ ట్రెజెస్ వారసత్వ సంపదతో ప్రపంచంలోనే అత్యంత చిన్న వయస్సు గల బిలియనీర్‌గా నిలిచారు. వ్యాపారవేత్తలతో పాటు పలువురు అంతర్జాతీయ సెలబ్రిటీలు కూడా ఈసారి బిలియనీర్ల క్లబ్‌లో అడుగుపెట్టారు. అమెరికన్ పాప్ సింగర్ బెయాన్సే, టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్ మరియు డాక్టర్ డ్రే వంటి వారు ఈ జాబితాలో చేరిన ప్రముఖులలో ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, సాంకేతిక రంగంలో వృద్ధి కొత్త కుబేరుల ఆవిర్భావానికి ప్రధాన కారణాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణకు పటిష్ట చర్యలు

- కేంద్రాల వద్ద భద్రతా
ఏర్పాట్లను ఇప్పటికే పరిశీలించిన పోలీసు అధికారులు
- కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు ఉండకూడదు
- అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు డ్రోన్‌లతో, పెట్రోలింగ్ బృందాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు
- విద్యార్థులందరూ ఒత్తిడికి లోనుకాకుండా - పరీక్షలు ప్రశాంతంగా రాయాలని శుభాకాంక్షలు తెలిపిన..
జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్




**శ్రీకాకుళం, మార్చి 15 (మనసులో మాట) :** జిల్లాలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 01 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలోని సుమారు 145 పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేయాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు సెక్షన్ 144 అమలు చేస్తున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేలా పోలీసు శాఖ, విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.పరీక్షా కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఐప్యాడ్‌లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని, పరీక్షలకు హాజరయ్యే ప్రతి ఒక్కరిపై క్షుణ్ణంగా తనిఖీలు (ఫ్రిస్కింగ్) నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలకు సంబంధించిన సిబ్బంది తప్ప ఇతరులు ఉండకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు పూర్తయ్యే వరకు మూసివేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి అక్రమాలకు అవకాశం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

పరీక్షల సందర్భంగా విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ విద్యార్థులందరికీ విజయవంతంగా పరీక్షలు రాయాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ పటిష్టమైన బందోబస్తు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## కోపరేటివ్ సొసైటీ ద్వారా
## బంకును ఏర్పాటు చేయడం శుభపరిణామం

**కె కోటపాడు , మార్చి 15 (మనసులో మాట) :** పెట్రోల్ బంక్ వ్యాపారం ద్వారా కో-ఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి దోహదపడుతుందని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు . ఆదివారం ఉదయం కోపరేటివ్ సొసైటీ చైర్మన్ చీపురుపల్లి రామారావు ఆధ్వర్యంలో మండలంలో ఏ. కోడూరు గ్రామంలో కోటపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మరియు హెచ్పీసీఎల్ సౌజన్యంతో నిర్మించిన పెట్రోల్ బంకును ప్రారంభించారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్య నారాయణమూర్తి, డి. సి. ఎం.ఎస్, డిసిసిబి చైర్మన్లు కోట్ని బాలాజీ, కోన తాతారావు, మాడుగుల మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైల ప్రసాదరావు, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ జనరల్ మేనేజర్ బి. శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరావు, మేనేజర్ లావణ్య కోటపాడు సొసైటీ చైర్మన్ చీపురుపల్లి రామారావు తదితరులు పెట్రోల్ బంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు బండారు మాట్లాడుతూ స్వచ్ఛత నాణ్యతతో కూడిన, లాభా పేక్ష లేకుండా ఇటు రైతులకు అటు ప్రజలకు మేలు చూపించే విధంగా పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామం అన్నారు. రైతులకు సంబంధించిన బ్యాంకు కోపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కోపరేటివ్ బ్యాంకు, సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే అన్నారు. కోడూరు బొడ్డు అక్కునాయుడు అభ్యర్థన మేరకు బంకు చుట్టూ ఉన్న స్థలంలో వ్యాపార సముదాయాలు నిర్మించినట్లయితే సొసైటీకి ఎంతో లాభదాయకంగా ఉంటుందని అనడంతో సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారుల ద్వారా నిర్మాణం సాగిస్తామని అన్నారు. సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ సొసైటీ పరంగా లాభదాయకంగా ఉండే అనేక కార్యక్రమాలు సొసైటీ ద్వారా చేపడుతామని, రైతుల రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. కోట్ని బాలాజీ మాట్లాడుతూ ఇదివరకు సొసైటీ ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ జరిగేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొనివెళ్లి యధాతథంగా సొసైటీలు వారే పంపిణీ జరిగేందుకు చొరవ చూపాలని ఎంఎల్ఏ అని అభ్యర్థించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు కోపరేటివ్ బ్యాంక్ సిబ్బంది సొసైటీ ఉద్యోగులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించండి
### పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత : ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం , మార్చి 15 (మనసులో మాట) :** శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని 80 అడుగుల రోడ్డులో పీడియాట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "సిక్కోలు సంత" కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై సంతను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు, వైద్యులు మరియు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో మొదటిసారిగా ఈ విధంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు నేరుగా అందించే వారపు సంతను ప్రారంభించడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. తూర్పు కనుమల ప్రాంతాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పండించిన వరి, పండ్లు, పప్పు ధాన్యాలు, తృణధాన్యా లు, కూరగాయలు, అలాగే విలువ ఆధారిత ఉత్పత్తులు, గానుగ నూనెలు వంటి సహజ మరియు సేంద్రియ ఉత్పత్తులను ఈ సంత ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారని చెప్పారు.ఇలాంటి సంతల ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తుందని, దీంతో రైతులకు మంచి ఆదాయం కూడా కలుగుతుందని ఆయన అన్నారు. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా ప్రజలకు ఉత్పత్తులను అందించడం ద్వారా రైతులకు లాభం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో రసాయనాలు లేని సహజ ఆహార పదార్థాల వినియోగం చాలా అవసరమని ఎమ్మెల్యే చెప్పారు. "ఆహారమే ఆరోగ్యం" అనే సిద్ధాంతంతో ఈ సిక్కోలు సంత కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సహజ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలు మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని చెప్పారు.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చని, భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరింతగా ముందుకు రావాలని, ప్రజలు కూడా సేంద్రియ ఉత్పత్తులను వినియో గించి రైతులకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు. ఇలాంటి సంతలు జిల్లాలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల ఆరోగ్యం కోసం చేపట్టిన ఈ కార్య క్రమం జిల్లాలో ఒక మంచి ఆరంభమని తెలిపారు.




## రెవెన్యూ సమస్యల కోసం ప్రత్యేకంగా 'రెవెన్యూ క్లినిక్ '
### 1100 కాల్ సెంటర్ ద్వారా కూడా ఫిర్యాదులు : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట) :** జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని నేరుగా ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు గమనించాల్సిన ముఖ్య అంశాలు:- పూర్తి వివరాలు: దరఖాస్తులో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ స్పష్టంగా ఉండాలి. సమస్యకు సంబంధించిన పూర్తి ఆధారాలను జతపరచాలి. పాత రశీదు: గతంలో ఫిర్యాదు చేసిన వారైతే, దానికి సంబంధించిన పాత అర్జీ రశీదును తప్పనిసరిగా తీసుకురావాలి. డిజిటల్ అప్‌డేట్స్: అర్జీ స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రభుత్వం మీ సౌకర్యం కల్పించింది. పరిష్కారం తర్వాత నోటీసులు/ఎండార్స్‌మెంట్లు వాట్సాప్ మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపబడతాయి. రాకుండానే ఫిర్యాదు చేయండి (డిజిటల్ సేవలు): కలెక్టరేట్‌కు రాలేని వారు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే సమీపంలోని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చు. భూ సమస్యల కోసం ప్రత్యేకంగా 'రెవెన్యూ క్లినిక్ 'ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో 'రెవెన్యూ క్లినిక్ 'నిర్వహించబడుతుంది. ముగ్గురు ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు మరియు వీఆర్వోలు తమ వద్ద ఉన్న రికార్డులతో ఈ క్లినిక్‌కు హాజరవుతారు. వేగవంతమైన పరిష్కారం: రైతులు తమ భూ వివాదాలు, మ్యుటేషన్లు లేదా ఇతర రెవెన్యూ సమస్యల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## పదవ తరగతి పరీక్షల నిమిత్తం ఏర్పాటు చేసిన
## స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్


**అనకాపల్లి టౌన్ , మార్చి 15 (మనసులో మాట) :** 16 సోమవారం నుండి జరగబోవు పదవ తరగతి పరీక్షలు నిమిత్తం ఏర్పాటుచేసిన పాఠశాలల్లోని స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. ముందుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జీ వి ఎమ్ సి ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కంట్రోల్ రూమ్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.





అనంతరం కశింకోట లో గల జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల ను సందర్శించి పదవతరగతి చదువు చున్న విద్యార్థుల తో మాట్లాడి పరీక్షలు పై ఎవ్వరు ఆందోళన చెందకుండా నిర్భయం పరీక్షలు వ్రాయమని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులును అడిగిన ప్రశ్నలు కు విద్యార్థుల ఇచ్చిన సమాధానము లకు సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యా శాఖధికారి గిడ్డి అప్పారావు నాయుడు, డి ఎల్ డి ఓ మంజుల వాణి మేడం, ఎమ్ డి ఓ, ఎమ్ ఆర్ ఓ ప్రధానోపాధ్యాయులు స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఇందేశమ్మ ఘాట్ రోడ్డును పరిశీలించిన హోం మంత్రి



**కోటవురట్ల , మార్చి 15 (మనసులో మాట) :** కోటవురట్ల మండలంలో ఇందేశమ్మ ఘాట్ రోడ్డును హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం పరిశీలించారు. నక్కపల్లి నుంచి నర్సీపట్నం వెళుతూ మధ్యలో గల ఇందేశమ్మ ఘాట్ రోడ్డు వద్ద ఆగి ఇందేశమ్మ తల్లిని దర్శించుకుని విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రహదారి విస్తరణలో భాగంగా ఘాట్ రోడ్డును తొలిచి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 16 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.ఇక్కడ రహదారి విస్తరణ జరిగితే నర్సీపట్నం రేవు పోలవరం రోడ్డులో రహదారి సౌకర్యం మెరుగవుతుందన్నారు.ఘాట్ రోడ్డులో రహదారి ఇరుకుగా ఉండడంతో తరచు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఘాట్ రోడ్డును విస్తరిస్తున్నట్లు తెలిపారు.ఈ పనులను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా ఇదేశమ్మ తల్లిని దర్శించుకున్నారు. మంత్రి వెంట పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఉన్నారు

## ఆర్థికేతర ప్రయోజనాల సాధనకు కృషి చేస్తా
### ఏపీ ఔట్ సోర్సింగ్ జేఏసీతో మంత్రి కొండపల్లి



**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట) :** మెప్మా, సెర్ప్ తరహాలో హెచఆర్ పాలసీ అమలు చేయాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు ఔట్ సోర్సింగ్ జేఏసీ వినతి ఆర్థికేతర ప్రయోజనాల మంజూరుకు కృషి చేస్తా: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయనగరం రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ మెప్మా, సెర్ప్ ఉద్యోగుల తరహాలో ప్రత్యేక హెచఆర్ పాలసీని అమలు చేయాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం విజయనగరంలో ఏపీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , జిల్లా చైర్మన్ గండిపిల్లి మహేంద్ర బాబు ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. జేఏసీ వినతులపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకుని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అయితే, తక్షణమే ఆర్థికేతర అంశాలైన పితృత్వ సెలవులు, చైల్డ్ కేర్ సెలవులు, మెడికల్ లీవ్స్ తదితర ప్రయోజనాల మంజూరు తన వంతుగా పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రాబోయే పీఆర్సీ లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన గళాన్ని వినిపిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు జేఏసీ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ,ఆయన చిత్రపటంతో కూడిన జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా వైస్ చైర్మన్లు ఏ.వి.సి.హెచ్. శేఖర్, ఎం. శివకుమార్, డి. నారాయణరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ కే. జనార్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్ నాయుడు, డివిజన్ చైర్మన్ ఎం. సత్తిబాబు చిన్నారావు, సతీష్ లతో పాటు పలువురు జిల్లా మరియు పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
### - జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

**భోగాపురం , మార్చి 15 (మనసులో మాట) :** భోగాపురం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భోగాపురంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి పార్టీ నాయకులు, జనసైనికులు మరియు వీరమహిళల సమక్షంలో జనసేన జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ ప్రస్థానం మరియు భవిష్యత్ కార్యాచరణపై కీలక ప్రసంగం చేశారు. దశాబ్ద కాలానికి పైగా జనసేనాని పవన్ కళ్యాణ్ ఎదుర్కొన్న ఒడిదుడుకులు, ఆయన పడ్డ శ్రమను కొనియాడారు. అధికారం కోసం కాకుండా ప్రజల కోసం నిలబడిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఆమె పేర్కొన్నారు. జనసేన పార్టీ పునాదులైన 7 ఆశయాలను (కులాలను కలిపే ఆలోచన విధానం, మతాల ప్రస్తావన లేని రాజకీయం, భాషలను



గౌరవించే సంప్రదాయం, సంస్కృతిని కాపాడే బాధ్యత, ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం, అవినీతి లేని పాలన,



పర్యావరణాన్ని కాపాడే ప్రగతి) ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన తర్వాత, తక్కువ కాలంలోనే ప్రజలకు అందించిన మేలును వివరిం చారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జనసేన చూపిస్తున్న చిత్తశుద్ధిని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భారీ సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు పాల్గొని పవన్ కళ్యాణ్ నాయకత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ వందనాల రమణ, పూసపాటిరేగ మండల ప్రెసిడెంట్ జలపాల శివ, డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు, ఎక్స్ జెడ్పిటిసి పడాల శ్రీనివాస్, బొల్లి త్రినాథ్, పల్లంట్ల జగదీష్, ఒరుపుల గిరి, లాయర్ సుధాకర్ మరి కొంతమంది జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## 92 కేంద్రాల్లో అక్షర ఆంధ్ర పరీక్ష



**ఎస్. రాయవరం , మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో ని 92 కేంద్రాల్లో ఆదివారం అక్షర ఆంధ్ర అభ్యాసకులుకు పరీక్షలు నిర్వహించారు. ఈకేంద్రాల్లో 4,000 మంది పరీక్షలు వ్రాసినట్లు వెలుగు ఎపి ఎం తెలిపారు. ఉదయం 10 గంటలుకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం వరుకు నిర్వహించనట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన అభ్యాసకులుకుఅవ సరమైన ఏర్పాట్లు చేసారు. ఉపాధిహామీ ఫథకం ఎపిడి ఎరకయ్య తోపాటు పలువురు మండలంలోని అధికారులు ఈపరీక్షలను పర్యవేక్షించారు.

## పల్స్ పోలియో నిధులు పంపకంలో పక్కదారి

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 15 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో డిసెంబర్ లో జరిగిన జాతీయ పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన పల్స్ పోలియో నిధు లను ఇచ్చిన గైడ్లైన్స్ ప్రకారంగా ఖర్చు పెట్టకుండా మిగిలిన సొమ్మును ఖర్చుపెట్టినట్లు చూపిన్తూ నిధులను విడుదల చేసుకుంటు బొక్కేస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఆశవర్కర్లకు సిహెచ్ డబ్ల్యూ లకు, వాలంటీర్స్ కు దీనిమీద ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయుటకు.. పల్స్ పోలియో కార్యక్రమం గూర్చి ప్రజలకు తెలియజేయుటకు ఆటో ప్రచారం చేయుటకు , బ్యానర్స్ కట్టినందుకు, ఐస్ పాక్స్, ఇలా కొన్ని కార్యక్రమలు చేసినందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. కానీ కొన్ని పీహెచ్ సి ల్లో ఈ కార్యక్రమలు నిర్వహించకుండానే నిధులు డ్రా చేసేసారని ఆరోపణలు ఉన్నాయని అన్నారు. నిధులు డ్రా చేసే విషయంలో కూడా కొన్ని పీహెచ్ సి ల డాక్టర్స్ చేతికి మట్టి అంటుకోకుండా ఏఎన్ఎం ల అకౌంట్స్ లో జమచేసి వాళ్ళ ద్వారా డ్రా చేయించి డాక్టర్స్ డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. ఎన్నడు లేనివిధంగా ఆశా వర్కర్స్, సిహెచ్ డబ్బులు దగ్గర డబ్బులు తీసుకున్నట్లుగా పేపర్ మీద రాయించుకు రమ్మని సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్తలకు కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ఆశా వర్కర్లకు, సిహెచ్డబ్ల్యులకు, అంగన్వాడీలకు , వాలంటీర్స్ కు కొంత పరితోషకంగా ఇవ్వాల్సి ఉందని అన్నారు. ఈ నగదు పంపిణీ విషయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్యకేంద్రాశీ వైద్యాదికారులు ఒక్కొక్క తీరుగా పంపకాలు చేశారు. ఒక పల్స్ పోలియో బూతులో ప్రభుత్వం విడుదల చేసిన నిధులు 1200 రూపాయలు, ఆ బూత్ లో నలుగురు లేదా ఆరుగురు లేదా ఇద్దరు పనిచేసిన ఆ 1200 రూపాయలు సరి సమానంగా పంపిణీ చేసుకోవాల్సి ఉంది. కానీ కొంతమంది వైద్యాధికారులు రూ,,600/-, 900/- లు డబ్బులు తగ్గించి ఇస్తున్నారు. కార్యక్రమం లో పాల్గొన్న అంగన్వాడీ లకు రూపాయి కూడా చెల్లించటం లేదని అన్నారు. తగ్గించిన ఆ డబ్బును ప్రభుత్వానికి జమ చేస్తున్నారో, వారి జేబుల్లో వేసుకుంటున్నారో తెలియడం లేదని అన్నారు. మూడు రోజులపాటు కష్టపడి ఇంటింటికి తిరిగి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసిన కిందిస్థాయి సిబ్బందికి ఇవ్వాల్సిన నగదు ఇవ్వకుండా దాంట్లో కూడా చేతివాటం చూపిస్తూ అన్యాయం చేయడం చాలా దారుణమైన విషయమని దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే పారితోషకాలు ఇచ్చేలాగా చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు ఎల్ సుందర్ రావు పత్రికాముకంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

### అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10వ తరగతి పరీక్షల నిర్వహణకు

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 15 (మనసు లో మాట) :** అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 10వ తరగతి (ఎన్ఎస్సి ) పబ్లిక్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహిం చేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దార్, తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 72 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయ బడినట్లు ఆయన తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంచబడిందని అన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ (ఫోటోకాపీ) దుకాణాలు పరీక్షల సమయంలో మూసివేయా లని ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అనుమతి లేని వ్యక్తు లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమ తించరని అన్నారు. పరీక్షల విధు లకు నియమించబడిన ఇన్విజిలేటర్లు మరియు సిబ్బంది మాత్రమే కేంద్రాలలోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుందని ఎస్పీ తెలి పారు. అలాగే పరీక్షలు రాసే విద్యా ర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పరీక్షా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచిం చారు. ఎవరైనా నిబంధనలు ఉ ల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. 10వ తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రతి రోజూ ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించబడతాయని అన్నారు. పరీక్షలకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపట్టిం దని అన్నారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద



కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే సమయంలో మరియు సమాధాన పత్రాలను సేకరించే సమయంలో పోలీసు ఎస్కార్ట్అందించబడుతుందని అన్నారు. సెక్షన్ 144 అమల్లో ఉండడంతో పరీక్షా కేంద్రాల వద్ద బయటి వ్యక్తులు గుమికూడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు అవకాశం లేకుండా జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల సమయంలో మొబైల్ పట్రోలింగ్ బృందాలు మరియు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహి స్తాయని అన్నారు .పరీక్షల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ముందుగానే పంపించాలని సూచించారు. పరీక్షా విధుల్లో ఉన్న అధికారులు మరియు విద్యార్థులు అందరూ పరీక్షా నియమాలు కచ్చితంగా పాటించాలని అన్నారు. ఇన్విజిలేటర్లు మరియు అధికారిక సిబ్బంది తప్ప ఇతరులు కేంద్రాల్లోకి అనుమతించబడరు. విద్యార్థులు చీట్లు, పుస్తకాలు లేదా ఇతర అనధికారిక వస్తువులు తీసుకురావడం నిషేధం. మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అదనంగా, ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్సి మార్చి 2026 పరీక్షలు కూడా మార్చి 16 నుంచి మార్చి 28 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించబడతాయని అన్నారు. ఈ పరీక్షలలో కూడా అన్ని నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. జిల్లాలోని ఏ పరీక్షా కేంద్రం సమీపంలో అనుమానాస్పద సంఘటనలు జరిగినా వెంటనే 100 లేదా 112 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలను కోరారు.

**ముఖ్య సూచనలు:**

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలు పరీక్షల సమయంలో మూసివేయాలి. ఇన్విజిలేటర్లు మరియు అధికారిక సిబ్బంది మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ..అనుమతి లేని వ్యక్తులు కేంద్రాల వద్ద గుమికూ డరాదు .విద్యార్థులు చీట్లు, పుస్తకాలు లేదా ఇతర నిషేధిత వస్తువులు తీసుకురావద్దు..మాస్ కాపీయింగ్ లేదా ఇతర అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు.. విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.. తల్లిదండ్రులు పిల్లలను ముందుగానే కేంద్రాలకు పంపాలి.. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే 100 లేదా 112 కు సమాచారం ఇవ్వాలి..

## చేసిన సేవలకు గుర్తింపు




**మల్కాపురం , మార్చి 15 (మనసులో మాట) :** ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ భాగస్వాములకు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, గణబాబుహో తండ్రి కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పల నరసింహంహో పేరిట స్థాపించిన పెతకం శెట్టి అప్పల నరసింహం చారిటబుల్ ట్రస్ట్‌హో ద్వారా ప్రతి ఏడాది ఆయన జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల సేవలకు గుర్తించి, అత్యధికంగా రక్త సేకరణ, రక్తదానం చేసినందుకుగాను గణబాబు మరియు సతీమణి మాధవి లత ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరి, అభినందిస్తూ ఆమె చేతుల మీదుగా మెమొంటోతో, పాటు ప్రశంసా పత్రాలను అందుకోవడం జరిగింది.

## 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



**వి మాడుగుల , మార్చి 15 (మనసులో మాట) :** ఈనెల 16న సోమవారం 10వ తరగతి మొదట తెలుగు పరీక్షలు నిర్వహించడానికి సంబంధించి మాడుగుల మండలంలో ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులు వ్రాయటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం విద్యార్థులు గుడులు దేవతలకు ఆరాధనలు దేవాలయాల ను సందర్శించారు. మండలంలో ఐదు కేంద్రాల్లో ఏర్పాటు కాగా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల నుంచి 708 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవు తున్నారని విద్యాధికారులు ఎంఈఓ దేవు దమ్మ,ఈశ్వర రావు తెలియపరిచారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ల ద్వారా పరీక్ష కేంద్రాల వివరాలు (లొకేషన్) ను జియో ట్యాగింగ్ చేశారు. దీని ద్వారా విద్యార్థుల హాల్ టికెట్ ఆధారంగా క్యూఆర్ కోడ్ లను వినియోగించుకొని సెంటర్ల వివరాలు తెలుసుకొనే వెసులుబాటు కల్పించారు. టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు...



## ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

**మల్కాపురం , మార్చి 15 (మనసులో మాట) :** (మనసులో మాట) .ప్రపంచ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా ఆదివారం విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం ములగాడ రైతు బజార్లో రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా జిల్లా వినియోగదారుల సంఘ చైర్మన్ మర్రి సత్యనారాయణ పాల్గొని, ఈ బజార్లో తూనికలను పద్ధతిని పర్యవేక్షించి, వినియోగదారులకు తూనికలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని, వినియోగదారులకు నాణ్యమైన సరుకు ఇవ్వాలని, దీంతో పాటు రైతుల సమస్యలపై పలు సూచనలు ఇస్తూ, విత్తనాలు , ఎరువులు, పురుగుల మందులు, కొనుగోలు చేసే సమయంలో రసీదులు




తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తనాలు మొలకెత్తలేని సమయంలో న్యాయపోరాటమే సరైన మార్గమని అని, రైతుల సమస్యలపై రైతుల వినియోగదారుల సంఘాన్ని ఆశ్రయించవచ్చునని అప్పుడు జరిగే నష్టాన్ని పూడ్చుకునే అవకాశం ఉంటుందని, ఈ సమస్యలపై జిల్లా వినియోగ దారుల సంఘం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని, రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఇంచార్జ్ తో పాటు పలువురురైతులు పాల్గొన్నారు.

## జీడి కి గిట్టుబాటు ధర కల్పించాలి : గోవిందరావు

**శ్రీకాకుళం , మార్చి 15 (మనసులో మాట) :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడి కి గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డ్ ఏర్పాటు చేస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు,సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శి లండ వెంకట్రావు,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఎం పార్టీ నాయకులు ఎన్ గణపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలాసలో ఆదివారం నాడు సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి జీడి బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని ప్రశ్నించారు. గత ఆరు సంవత్సరాలనుండి జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని అనేక ఆందోళనలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం అని అన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిక్కల ధర పాతాళంలో ఉందని పప్పు ధర చూస్తే ఆకాశాన్ని అంటుతుందని ఆవేదన వ్యక్తం



చేశారు. దేశంలోనే జీడి రెండో స్థానంలో ఉందని అన్నారు. మన జిల్లాలో ఉద్దానం తీర ప్రాంతము మరియు గిరిజన ప్రాంతంలో విస్తారంగా జీడిపంటుందని, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వడం వలన జీడి విస్తారంగా పండించి జీడి ఆధారత పరిశ్రమలు వస్తాయని, తద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, వలసలు నివారించబడతాయని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. జీడికి మద్దతు ధర ఇవ్వడమంటే ఈ ప్రాంత అభివృద్ధి అన్నమాటని అన్నారు. జీడి 80 కేజీలు బస్తాకు 16 వేల రూపాయలు ఇవ్వాలని,రాష్ట్ర ప్రభుత్వం జీడి బోర్డును ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు జీడికి గిట్టుబాటు ధర ఇవ్వకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నెల్లిమర్ల కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**- ఆన్లైన్లో మార్చి 12 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు దరఖాస్తుల స్వీకరణ : ప్రిన్సిపాల్ బి. ఉమా వెల్లడి**

**నెల్లిమర్ల , మార్చి 15 (మనసులో మాట) :** నెల్లిమర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. ఉమ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్మీడియట్(ఎంపిసి ) ప్రథమ సంవత్సరంతో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల ప్రవేశాల కోసం ఆన్లైన్లో మార్చ్ 12నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 చొప్పున సీట్లు భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తుతో పాటు విద్యార్థి,




తల్లిదండ్రుల ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాలని సూచించారు. వివరాల కు సెల్ నంబర్ 9490583849 ను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

## కొత్తూరు రామాలయ నిర్మాణానికి 50 వేలు విరాళం

**- కొత్తూరు రామాలయ నిర్మాణానికి 50 వేల రూపాయలు విరాళం అందజేసిన కర్రోతు బంగార్రాజు**

**నెల్లిమర్ల , మార్చి 15 (మనసులో మాట) :** నెల్లిమర్ల మండలం అలుగోలు పంచాయితీ కొత్తూరు గ్రామంలోని నూతనంగా నిర్మాణం చేసిన రామాలయానికి ఆలయ కమిటీ సభ్యులకు రూ. 50,000/- వేల రూపాయలు విరాళంగా అందజేసిన ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ & నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు. ఆలయ ప్రారంభోత్సవానికి హాజరైన బంగార్రాజును,ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సాదరంగా ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేసారు. ఈ





సందర్భంగా బంగార్రాజు ఆలయ ప్రాంగణంలో మిగిలి ఉన్న మరికొన్ని నిర్మాణ కట్టడాలకు గాను రూ 50 వేల రూపాయలు విరాళంగా అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ ఏఎంసీ ప్రతినిధి గేదెల రాజారావు, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీను, టిడిపి నాయకులు ఆల్తి బాబురావు మరియు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు హక్కులు పట్ల అవగాహన అవసరం : నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి దొడ్డి చంద్రశేఖర్



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 15 (మనసులో మాట) :** వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన కల్గి ఉండాలని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి దొడ్డి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు లోని ప్రశాంతి నికేతన్ స్కూల్ సమీపంలో ఉన్న కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ కార్యాలయం లో ఆదివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురష్కరించుకొని కన్స్యూమర్ రైట్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి దొడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కులు పట్ల అవగాహన లేక మోసపోతున్నారన్నారు. భారత ప్రభుత్వం 1989 లో మార్చి 15 న వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మన్నారు. ప్రధానంగా వినియోగదారులు ఆరు హక్కులు కల్గిఉ ఒడడం జరిగిందన్నారు. సేవల నుంచి రక్షణ పొందేహక్కు, సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అలాగే వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకొని సముచిత రేటు లో నాణ్యత, సేవలు పొందవచ్చాన్నారు. వినియోగదారుల సంక్షేమార్ధం ఏర్పాటు చేసిన వివిధ వేదిక లలో ప్రాతినిధ్యం వహించవచ్చాన్నారు. కాగా వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవా లోపాలు, వస్తు లోపాలు నుంచి పరిహారం పోందే హక్కు ఉందన్నారు. వినియోగదారులు మోసానికి గురైనప్పుడు ఫోరంలో కేసు వేసి, తగిన పరిహారం పోందే హక్కు ఉందన్నారు. అలాగే వినియోగదారుల విద్యా హక్కు కూడా కల్గిఉందన్నారు. ఇవేకాకుండా వినియోగదారులు నిరంతరం హక్కులు తెలుసుకుంటూ జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపోందించు కోవడం ఎంతో అవసరమని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో దివిస్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు

**శృంగవరపుకోట , మార్చి 15 (మనసులో మాట) :** శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఔషధ సంస్థ దివిస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు ఈ రోజు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులకు మరియు ఇతర నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యమ్. భాస్కరరావు మాట్లాడుతూ,



విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని సూచించారు. మొత్తం 42 మంది ఇంటరవ్యూస్ కి హాజరు కాగా వారిలో 13 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యారు.. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ సి. హెచ్. ఆర్కే ప్రసాద్అభినందించారు. ఈ కార్యక్రమంలో దివిస్ ప్రతినిధులు, కళాశాల ప్లేసెమెంట్ ఆఫీసర్ మధు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## ఆదివాసీలా ప్రధాన సమస్యలాపై ఉపముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణం

**- జిఓ నెం 3 కి ప్రత్యామ్నాయం జిఓ జారీ చేస్తామన్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ పై స్పష్టత ఇవ్వక పోవడం ప్రభుత్వం చిత్తశుద్ధి ను సంకించవలసిన పరిస్థితి వస్తుంది**

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 15 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, అటవీ పర్యావరణ శాఖ మంత్రిగా పీఠంలో ఉన్న పవన్ కళ్యాణ్ మార్చి 14, 2026న పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) పర్యటన చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని నందిగరువు గ్రామంలో ఆదివాసీ సోదర సోదరీమణులతో జరుపుకున్నారు. ఆదివాసీల సమస్యలపై ఆశలు పెంచుకున్న ప్రజలు ఈ సందర్భంగా ప్రధానమైన అంశాలపై స్పందన ఆశించారు. కానీ, ఆ పర్యటనలో ఆయన ఆ అంశాలపై మాట్లాడకపోవడం ఆదివాసీ ప్రజల్లో నిరాశను కలిగించింది. ఇది హాస్యాస్పదమైనదని, దారుణమైనదని సిపిఐ(ఎం) పార్టీ భావిస్తోందని జిల్లా కార్యదర్శి అప్పలనర్స అన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీల్లో ఆదివాసులకు 100% రిజర్వేషన్ కల్పించడం ఒక ముఖ్యమైన అంశం అని అన్నారు. ఈ హామీ అమలుపై ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు లేవని,ప్రస్తావన కూడ లేదని అన్నారు .అటవీ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఇచ్చిన అటవీ పర్యావరణ అనుమతులను రద్దు చేయాలనే ఆదివాసీల డిమాండ్‌పై కూడా స్పందన లేదని అన్నారు. బాక్సైట్ తవ్వకాలు ఆదివాసీల జీవనోపాధిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయనే ఆందోళనలు బలంగా ఉన్నాయని తెలిపారు. గతంలోనే బాక్సైట్ మైనింగ్‌పై ఆయన వ్యతిరేకత చూపినప్పటికీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న తర్వాత ఈ అంశంపై నిశ్శబ్దం ఆశ్చర్యకరంగా ఉందని తెలిపారు. ప్రధాని జన్మన్ పథకం కింద పార్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ ఆదివాసులకు హౌసింగ్ సౌకర్యాల కోసం చెల్లించాల్సిన బకాయి మొత్తాలు ఇంకా పూర్తిగా చెల్లించబడలేదని అన్నారు. ఇతర ప్రధాన ఆదివాసి సమస్యలు -- వంజంగి పంచాయితీలో ఫారెస్ట్ అధికారులు ఏకో-టూరిజం పేరుతో ఆదివాసుల భూములపై దౌర్జన్యాలు చేస్తున్నారనే ఆరోపణలు - ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు.ఆదివాసీలు కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఎంతో విశ్వాసం, ఆశలు పెంచుకున్నారని అన్నారు. కానీ, ఈ పర్యటనలో ప్రధాన సమస్యలపై మాట్లాడకపోవడం వారి ఆశలపై నీళ్లు జల్లినట్లైందని భావిస్తున్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, హామీలను అమలు చేయాలని సిపిఐ(ఎం) పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలకు సర్వం సిద్ధం



**హుకుంపేట , మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. హుకుంపేట బి సెంటర్ నుంచి 9 పాఠశాలలకు చెందిన 197 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే బాకూరు సి సెంటర్ లో 6 పాఠశాలలకు చెందిన 145 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో ప్రతి తరగతి గదిలో విద్యుత్, ఫర్నిచర్, త్రాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఈ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు లేవని సమాచారం. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయులు వి. బాలాజీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు సజావుగా పూర్తి చేసినట్లు ఆయన మీడియాకు తెలిపారు

## రామతీర్థంలో 'ఉల్లాస్' అక్షరాస్యత పరీక్షల పరిశీలన

**నెల్లిమర్ల , మార్చి 15 (మనసులో మాట) :** వయోజన విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఉల్లాస్' అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన తుది పరీక్షలను కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రదీప్ బి. హెడావు రామతీర్థం ప్రాథమిక పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్షల సరళిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రానికి చేరుకున్న ఆయన, పరీక్ష రాస్తున్న అభ్యాసకులతో నేరుగా మాట్లాడారు. పరీక్ష ఏ విధంగా ఉంది ప్రశ్నలు అర్థమవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అభ్యాసకులు రాసిన సమాధాన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. ఉల్లాస్ తరగతులు క్రమబద్ధంగా జరిగాయా? హాజరు శాతం ఎలా ఉంది అనే విషయాలపై ఆరా తీశారు. పరీక్షల నిర్వహణపై ఆరా ఈ సందర్భంగా జిల్లాలో మరియు మండల పరిధిలోఎన్ని కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి,

# జిల్లాలో 119 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు

**- పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**


**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట) :** పరీక్షా కేంద్రాల వద్ద 144 సి.ఆర్.పి.సి./163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలులో ఉంటుందన్న జిల్లా ఎస్పీ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వారి హాల్ టికెట్స్ మినహా ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకొని రావద్దని మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు నిర్వహించబడుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి పోలీసు శాఖ తరఫున కట్టుదిట్టమైన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసిందని ఆదివారం జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రశ్నాపత్రాలు తరిలించేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా వాటిని భద్రపరిచేటప్పుడు సిసిటీవి కెమెరాల నిఘాలో భద్రపరచాలని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారిచేశారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు, పరీక్షలు సమయంలో విద్యార్థులు కష్టపడి చదివి ఎలాంటి భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో పాస్ అయి తల్లితండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, తమ బంగారు భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని కోరారు. జిల్లాలో మొత్తం 119 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, పరీక్షలు నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలను కాపాడటానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతర పర్యవేక్షణ చేపడతారన్నారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఎలాంటి



అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ పెంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సి.ఆర్.పి.సి./163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల 100 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని, ఈ పరిధిలో అనవసరంగా గుమికూడటం, సమావేశాలు నిర్వహించడం, మైక్‌లు ఉపయోగించడం పూర్తిగా నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌లో సూచించిన సమయానికి ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నాపత్రాల లీక్ వంటి తప్పుడు ప్రచారం చేసి విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100/112కు సమాచారం అందించాలని సూచించారు.

## ఎస్.కోటలో వైభవంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ శంకుస్థాపన

**శృంగవరపుకోట, మార్చి 15 (మనసులో మాట) :** శృంగవరపుకోట మండల కేంద్రంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం అత్యంత వైభవంగా శంకుస్థాపన జరిగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమంలో ఎస్.కోట శాసనసభ్యురాలు శ్రీమతి కోళ్ల లలిత కుమారి మరియు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ, శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి, ఆలయ నిర్మాణానికి పునాది రాయి వేశారు. అనంతరం జరిగిన సభలో బాల స్వామీజీ





భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ, సమాజంలో ధర్మబద్ధమైన జీవనం సాగించాలని, భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రంలో ఇంతటి భవ్యమైన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జన్మన్ గృహాల బిల్లులు చెల్లించాలి

**డుంబ్రిగుడ , మార్చి 15 (మనసులో మాట) :** జన్మన్ గృహాల బిల్లులు తక్షణమే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని అరమ పంచాయితీ జుర్రి పాడు గ్రామంలో ఆదివారం అయిన సందర్శించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన పిఎం జన్మన్ గృహాల బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని చెప్పారు. 2.0 తో సర్వే చేసిన గృహాలకు కూడా వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లించే బిల్లులు గృహ నిర్మాణాలకు ఎటు సరిపోవటం లేదని దీంతో గృహాలు అసంపూర్తిగానే




నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గృహాలబ్దిదారులు గృహాలు నిర్మించక తీవ్రఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణ మే ప్రభుత్వం స్పందించి పెంచిన బిల్లులు చెల్లిం చాలని, బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## "సర్వేంద్రియానం నయనం ప్రధానం'

**- ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వైయస్సార్ సిపి మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ ఓమ్మి గంగు నాయుడు**

**కశింకోట, మార్చి 15 (మనసులో మాట) :** "సర్వేంద్రియానం నయనం ప్రధానం" అని పెద్దలు అంటారని అందుకే ప్రతి ఒక్కరు తమ కంటి రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైఎస్ఆర్సిపి మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఉప సర్పంచ్ ఒమ్మి గంగు నాయుడు తెలిపారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో ఆదివారం, సాయి రాజా వెల్ఫేర్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైయస్ఆర్సీపీ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ ఓమ్మి గంగు నాయుడు ఏర్పాటు చేశారు. కంటి వైద్య శిబిరాన్ని, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు మలసాల కిషోర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కంటి లోపంతో పాటు కంటి వ్యాధులు దూరం అవుతాయి అన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చిన్నప్పటినుంచి కంటిపట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.. అలాగే కంటి లోపాలు రాకుండా పాలు గుడ్డు ఆకుకూర క్యారెట్ పౌష్టికాహారాలు ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఈ కంటి వైద్య శిబిరానికి 98 మంది హాజరయ్యారు. వీరికి సాయి



రాజా వెల్పర్ ట్రస్ట్ కంటి డాక్టర్ అరుణ పరీక్షలు నిర్వహించారు. అందులో 36 మందిని గుర్తించి వారికి ఆపరేషన్ లు అవసరమని, 30 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజా కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించిన వారికి, ఆపరేషన్లు చేయిస్తామని, కంటి అద్దాలు అవసరం ఉన్న వారికి 50% రాయితీతో, అద్దాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగాగున్నయ్య నాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, జమాదుల పాలెం గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, సానబోయిన శ్రీను ఓమ్మి లోవరాజు, బొట్ట నాగ అప్పారావు, ఓమ్మి సూరిబాబు, ఓమ్మి లోవరాజు, కరక పోలినాయుడు, కోన శివ ఆంధ్ర నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు ప్లాంట్ల ద్వారా వెలువడే విషవాయువుల నుంచి మా ప్రాణాలు కాపాడండి

**- పిసినికాడ రెవిన్యూ బిఆర్టి కాలనీ వాసులు నిరసన**

**అనకాపల్లి టౌన్ , మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో అనుమతులతో పని లేకుండా నడుస్తున్న కంపెనీలు పొల్యూషన్ తో మేము వ్యాధులకు గురి కావాలా అంటూ బీఆర్టీ కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. పిసినగాడ గ్రామ రెవెన్యూ పరిధి , బి ఆర్ టి కాలనీ సమీపంలో ఒకే చోట రెండు బొగ్గు ప్లాంట్లు, అనుమతులకి సంబంధం లేకుండా ఏర్పాటు చేశారు. అనహిత రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, జైత్ర స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, సర్వే నెంబర్ 14లో పిసినిగాడ రెవిన్యూ పరిధిలో గల బిఆర్టి కాలనీ సమీపంలో గ్రామ సభతో పని లేకుండానే పరిశ్రమలు ఏర్పాటు చేశారు.వాటిని వెంటనే తొలగించాలని తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని బి ఆర్ టి కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మొల్లేటి హేమ, శివాజీ, ఎల్లపు వెంకటరావు, పెద్దిశెట్టి రమేష్, మేడేపల్లి పాపారావు తదితరులు మాట్లాడుతూ బొగ్గు పరిశ్రమల ద్వారా వెలువడే విషవాయువు లు గ్రామస్తులను ఊపిరిరాడకుండా చేస్తున్నాయని తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు తుడుస్తూ ఉంటే దుమ్మి ధూళీ కన్నా ఈ బొగ్గు పొడి ఎక్కువ ఉంటుందన్నారు. అనారోగ్యంతో



డాక్టర్ వద్దకు వెళ్తే శ్వాసకోశాలలో నల్లటి బొగ్గు చేరినట్లు ఉందని ధూమపానం అలవాటు ఉందా అని ప్రశ్నిస్తున్నారు అని తెలిపారు..ఇక్కడ పొల్యూషన్ తగ్గేందుకు నిబంధనలకు అనుగుణంగా ఎటువంటి చర్యలు చేపట్టలేదని. పరిసర ప్రాంతాల గ్రీనరీ మెయింటెనెన్స్ గానీ, సమీప ప్రకృతిని ఇచ్చే నాటిన మొక్కలపై ఉన్న దుమ్మిధూలి చూస్తేనే తెలుస్తుందని తెలిపారు.. ఇవే కాకుండా ఇక్కడ సమీపంలో మరో తారు ప్లాంట్ ద్వారా వెలువడే కార్బన్ తదితర వాయువుల ద్వారా మరింత తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బిఆర్టి కాలనీవాసులు నిరసన ద్వారా తెలిపారు.సంబంధిత అధికారులు వచ్చి వీటన్నిటిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టకపోతే అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయం వద్ద గ్రామస్తులు అంత కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. అనంతరం బొగ్గు ప్లాంట్ ప్రతినిధులకు తమ వినతి పత్రం అందజేశారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యగా భావించి నిరసన కార్యక్రమంలో మళ్ళ శ్రీనివాసరావు,బుద్ధ నగేష్,సరసా భాస్కర్ రావు పోలమరశెట్టి నూకరాజు, కాంద్రేగుల పరమేష్,బండి రాధిక, నీలకంఠ సంతోషలక్ష్మి, అప్పన్న,రమణమ్మ, గ్రామస్తులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## జీడి రైతులకు ప్రత్యేక నిధులు ఇవ్వాలి..కేజీ జీడి పిక్కలకు 200 ఇవ్వాలి




**వి మాడుగుల , మార్చి 15 (మనసులో మాట) :** మాడుగుల మండలం శంకరం పంచాయతీ లో క్రిష్ణంపాలెం గ్రామం లో కేజీ జీడి పిక్కలకు ప్రభుత్వ మద్దతు ధర 200/ రూ,,ఇవ్వాలని రాష్ట్రంలో జీడి పంటను గుర్తించాలని జీడి పిక్కల ధర నిలకడగా ఉండాలని దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం క్రిష్ణంపాలెం గ్రామం లో జీడి రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు విరిగి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి. ఇరట.నరసింహమూర్తి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కే. భవాని. పల్గోని మాట్లాడారు . జీడి పిక్కలు 80 కేజీల బస్తా 18000 మద్దతు ధర ఇవ్వాలి. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. జీడి పంట విస్తరణకు మరియు నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలి. జీడి తోటలలో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలి. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలి. ఉపాధి హామీ పథకం ద్వారా జీడి తోట అభివృద్ధికి రైతులకు జీడి తోటలలో పనులు కల్పించాలి. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలి. రైతు వారి సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ భీమా అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో గ్రంగి.ఈశ్వరరావు. దూరి. శ్రీను. వంతల. రాజులమ్మ. బేరా. దేవుడమ్మ. బీరసింగి. విష్ణుమూర్తి. కుడుముల. గంగరాజు.అధిక సంఖ్యలో జీడి రైతులు పాల్గొన్నారు

**12 మందికి 10 లక్షల 42 వేల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన**

## అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ

**అనకాపల్లి టౌన్ , మార్చి 15 (మనసులో మాట) :** అనకాపల్లి పట్టణం, జీవీఎంసీ 80వ వార్డు, గవరపాలెంలోని పీలా వారి వీధి గైరమ్మ గుడి వద్ద 80వ వార్డు టీడీపీ ఇంచార్జీ బిఎస్ఎంకే జోగి నాయుడు అధ్యక్షతన జరిగిన సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమం లో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ పాల్గొన్నారు. వ. ఈ సందర్భంగా జీవీఎంసీ 80వ వార్డుకు చెందిన 12మందికి 10లక్షల 42వేల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. వారికీ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

విశాఖపట్నం బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీసేందుకు గూగుల్ సంస్థ రాకుండా ఉండేందుకు జగన్ రెడ్డి అనేక కుట్రలు పన్నారని అయి నప్పటికీ మంత్రి నారా లోకేష్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారని అన్నారు.సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమ



ం, అభివృద్ధి వైపు తీసుకువెళ్తున్న ఘనత నారా చంద్రబాబు , పవన్ కళ్యాణ్ దే అని అన్నారు.విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా శాఖలో మంచి సంస్కరణలు తీసుకువస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలుపారుస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ జనసేన బీజేపీ పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

# ఉగాది ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట) :** శ్రీపరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలు విజయనగరం పట్టణంలో వైభవంగా నిర్వహిస్తున్నామని వాగ్దేవి సమారాధనమ్ వ్యవస్థాపక అధ్యక్షులు కార్యవర్గ సభ్యురాలు డా.పెన్నేటి స్వప్న హైందవి తెలిపారు. గురజాడ గృహంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వేదసంస్కృతి పరిరక్షణ ధ్యేయంగా వాగ్దేవి సమారాధనమ్ శ్రీపైడిమాంబ వేదసంస్కృతాంధ్ర పరిరక్షణసేవాసంఘం ద్వారా పలు కార్యక్రమాలు ప్రతి ఏటానిర్వహిస్తున్నామని తెలిపారు. ఈఏడాది ఉగాది వేడుకలలో భాగంగా ద్వారకా తిరుమల దేవస్థానం ప్రాంతీయ సంయుక్త కమీషనర్



ఎస్.వి.ఎస్.ఎన్ మూర్తిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించి వాగ్ధేవియశోభూషణ బిరుదు ప్రదానం చేస్తామని తెలిపారు. అలాగే పలువురు పండితులను సత్కరిస్తున్నట్లు తెలిపారు.ఈమేరకు ప్రముఖ కవి,రచయితలు డా.పివిఎల్ సుబ్బారావు, డా.జక్కురాకృ ష్ణ, రచయిత్రి మానాప్రగడసాహితి, పైడితల్లిదేవస్థానం ప్రధానపూజారి బంటుపల్లివెంకటరావుతో కలిసి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## ఆధునీకత..వ్యాధినిరోధకత



( నేడు జాతీయ రోగనిరోధక దినోత్సవం సందర్భంగా.....)

**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట)** : భారతదేశంలో ప్రతి సంవత్సరం మార్చి 16న జాతీయ రోగనిరోధక దినోత్సవం జరుపుకుంటారు. రోగనిరోధకత అనేది మీ శరీరానికి శిక్షణా స్థలం, వ్యాధులు రాకముందే వాటిని గుర్తించి ఓడించడానికి మీ రోగనిరోధక వ్యవస్థకు నేర్పుతుంది. భారతదేశంలో ఇటీవలి కాలంలో ఒక పెద్ద పురోగతి ఏమిటంటే, గర్భాశయ క్యాన్సర్ నివారణకు మొట్టమొదటి స్వదేశీ వ్యాక్సిన్ అయిన సెర్వావాక్‌ను ప్రవేశపెట్టడం, దీని వలన రక్షణ గతంలో కంటే మరింత అందుబాటులోకి వస్తుంది. భారతదేశంలో పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం ప్రారంభించిన జ్ఞాపకార్థం జాతీయ ఇమ్యునైజేషన్ దినోత్సవం ప్రారంభమైంది. మార్చి 16, 1995న, ఓరల్ పోలియో వ్యాక్సిన్ యొక్క మొదటి మోతాదును సామూహిక స్థాయిలో అందించారు. భారతదేశంలో, 1995లో మొదటి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించింది. నిబద్ధత కలిగిన దేశం వికలాంగ వ్యాధిని ఎలా నిర్మూలించగలదో ఇది నిదర్శనంగా నిలుస్తుంది. అవగాహన అంతరాన్ని తగ్గించడం: చాలా మంది తల్లిదండ్రులు తమ శిశువుల టీకా చార్టుల గురించి శ్రద్ధ వహిస్తుండగా, పిల్లలు పెద్దయ్యాక అవగాహన తరచుగా తగ్గుతుంది. కౌమారదశ టీకాలు: గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం కొత్తగా ప్రారంభించబడిన సెర్వావాక్ ( టీకా) లాగా. పెద్దలకు టీకాలు వేయడం: పెద్దలు మరియు వృద్ధులలో తరచుగా నిర్లక్ష్యం చేయబడే ఫ్లూ, న్యుమోనియా , హెపటైటిస్ బి మరియు షింగిల్స్ నుండి రక్షణ కల్పించడం.దుర్బలత్వాన్ని (మంద రోగనిరోధక శక్తి) రక్షించడం: టీకాలు వేయడం అనేది కేవలం వ్యక్తిగత ఎంపిక కాదు; ఇది ఒక సామాజిక బాధ్యత. ఒక సమాజంలోని ఎక్కువ మందికి రోగనిరోధక శక్తి ఇచ్చినప్పుడు, అది రోగనిరోధక శక్తి తగ్గిన రోగులు ,నవజాత శిశువులు వంటి వైద్య కారణాల వల్ల టీకాలు వేయలేని వారిని రక్షించే రక్షణ కవచం (మంద రోగనిరోధక శక్తి)ని సృష్టిస్తుంది. లక్ష్యం: లక్ష్యం "పల్స్ పోలియో" – వైరస్ ప్రసార గొలుసును విచ్ఛిన్నం చేయడానికి జనాభాను ఏకకాలంలో వ్యాక్సిన్‌తో నింపే వ్యూహం. "దో బూంద్ జిందగీ కి" (జీవితంలో రెండు చుక్కలు) అనే నినాదం భారతదేశ చరిత్రలో అత్యంత గుర్తించదగిన ప్రజారోగ్య నినాదాలలో ఒకటిగా మారింది. 1995 కి ముందు, ప్రపంచంలోని పోలియో కేసుల్లో 60% భారతదేశంలోనే ఉండేవి. ప్రపంచ ఆరోగ్య సంస్థ , రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో ప్రభుత్వం, సాధారణ రోగనిరోధకత సరిపోదని గ్రహించింది. రాష్ట్ర యంత్రాంగం మొత్తం ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి బిడ్డకు టీకాలు వేయడంపై మాత్రమే దృష్టి సారించే ప్రత్యేక రోజు వారికి అవసరం. ఆ మొదటి ఇమ్యునైజేషన్ దినోత్సవం నాడు ప్రారంభమైన నిరంతర ప్రయత్నం చివరికి ఒక చారిత్రాత్మక మైలురాయికి దారితీసింది. మార్చి 27, 2014న, అధికారికంగా భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించింది. ఈ విజయం జాతీయ ఇమ్యునైజేషన్ దినోత్సవాన్ని "యుద్ధానికి పిలుపు" నుండి "సాధ్యమైన దాని వేడుక"గా మార్చింది. మనం జాతీయ రోగనిరోధక దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సమయంలో, దృష్టి కేవలం "శిశువులను రక్షించడం" నుండి "అందరినీ రక్షించడం" వైపు మళ్లింది. 2026 సంవత్సరం భారతీయ రోగనిరోధకత రంగంలో కొన్ని ఉత్తేజకరమైన నవీకరణలను తెస్తుంది. 1. కొత్త రాక: డెంగ్యూ వ్యాక్సిన్ (క్డెంగా),2026 లో అతిపెద్ద సంచలనం భారతదేశంలో మొట్టమొదటి ఆచరణీయ డెంగ్యూ వ్యాక్సిన్ అయిన క్డెంగా లభ్యతపై అంచనా . టకేడా అభివృద్ధి చేసి, బయోలాజికల్ ఈ ద్వారా స్థానికంగా తయారు చేయబడిన ఇది, డెంగ్యూ వ్యాప్తి వార్షిక భయానకంగా ఉన్న దేశానికి గేమ్-ఛేంజర్. స్థానిక ప్రాంతాలలో నివసించే పిల్లలు మరియు పెద్దలకు (4 నుండి 60 సంవత్సరాల వయస్సు) దీనిని సిఫార్సు చేసే అవకాశం ఉంది. టీనేజర్లకు "తప్పనిసరి": హ్యూమన్ వ్యాక్సిన్ (సెర్వావాక్)భారతదేశంలో మొట్టమొదటి స్వదేశీ హ్యూమన్ వ్యాక్సిన్, సెర్వావాక్ అందుబాటులోకి రావడంతో , గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షణ సరసమైనది మరియు అందుబాటులోకి వచ్చింది. 9--14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు (బహిర్గతమయ్యే ముందు) బాగా సిఫార్సు చేయబడింది. 45 సంవత్సరాల వయస్సు వరకు మహిళలకు క్యాచ్-అప్ టీకా కూడా అందుబాటులో ఉంది. టీకాలు వేయడం కేవలం పిల్లలకు మాత్రమే కాదు. 2026 లో, వైద్యులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు: షింగిల్స్ వ్యాక్సిన్: 50 ఏళ్లు పైబడిన పెద్దలకు, చికెన్ పాక్స్ వైరస్ బాధాకరమైన పునఃసక్రియాన్ని నివారించడానికి . న్యుమోకాకల్ వ్యాక్సిన్: తీవ్రమైన న్యుమోనియాను నివారించడానికి సీనియర్ సిటిజన్లు (65+) లేదా ఆస్తమా / మధుమేహం ఉన్నవారు "తప్పనిసరి"గా తీసుకోవాలి .వార్షిక ఫ్లూ షాట్: కాలానుగుణ ఇన్ఫ్లుఎంజా సమస్యలను నివారించడానికి పిల్లలు, వృద్ధులు మరియు గర్భిణీ స్త్రీలకు ఇది చాలా అవసరం .

( ఎం.విజయ భాస్కర్ )

## సమానత్వం కల్పించడం ద్వారా మహిళలకు సమాజంలో సుస్థిర స్థానం

- సదస్సులో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి



**కంచరపాలెం , మార్చి 15 (మనసులో మాట)** : మహిళలకు పురుషులతో పాటు సమానత్వం కల్పించడం ద్వారా సమాజంలో సుస్థిర స్థానం చేకూరుతుందని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కంచరపాలెంలో లయన్స్ క్లబ్, బిఎన్ఆర్ ఫౌండేషన్, ఐద్వా ఆధ్వర్యంలో "మహిళలకు సముచిత స్థానం సమానత్వ గౌరవం " అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగిస్తూ మహిళలకు ఇంట్లో, సమాజంలో, పనిలో బహిరంగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. "అన్నింటా స్త్రీలను ముందు పీఠిన నిలబెడదాం. స్త్రీలను బ్రతకనిద్దాం - చదవనిద్దాం - ఎదగనిద్దాం - అన్ని విధాల వారిని గౌరవిద్దాం " నినాదంతో మహిళలు అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో సాగుతున్నారని తెలిపారు. వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు భాగస్వాములై విశిష్ట కృషి చేస్తున్నారని, సునీత విలియమ్స్ అంతరిక్షంలో అవరోధాలను అధిగమించి దాదాపు 8 నెలల పాటు ఉండి తిరిగి భూమి పైకి రావడం చారిత్రాత్మకమైన విషయం అని గుర్తు చేశారు. నేడు ఉత్పత్తి రంగంలో పురుషుల భాగస్వామ్యంతో మహిళా సాధికారతను సాధించేందుకు ముందుకు వేస్తున్నారన్నారు. రిజర్వేషన్ ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు తప్ప మహిళలకు తగిన ప్రాతినిధ్య చట్టసభలలో ఇవ్వాలనే ఆలోచన నేటికీ పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. మహిళను సరుకుగా మార్చే కార్పొరేట్ శక్తుల దోపిడీ ఒకవైపు, సనాతన ధర్మం పేరుతో ఇంటికే పరిమితం చేసే కుట్ర మరో వైపు జరుగుతుందన్నారు. కార్పొరేట్, మతతత్వ కూటమి విధానాలకు చరమగీతం పాడేందుకు అందరం కలసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు ఇద్దరు పేద మహిళలకు కుట్టు మిషన్లు బహుకరించారు. అంతేకాక దేవులపల్లి వెంకట రామయ్య, శ్రీదేవి కలిసి ఐద్వాకి పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. వీరికి కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, తేజేశ్వరరావు, క్లబ్ ఆఫీస్ బేరర్స్ పీజీ లక్ష్మీనారాయణ, కుమార్, బి ఎన్ ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, ఫౌండేషన్ నాయకులు టి.లక్ష్మీకాంతం, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 16, 17న విశాఖలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల కన్వెన్షన్



**కంచరపాలెం , మార్చి 15 (మనసులో మాట)** : ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖలో జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్రస్థాయి యూనివర్సిటీల కన్వెన్షన్ ను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అల్లిపురం, నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో యూనివర్సిటీల కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నాసర్ జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ చేస్తూ పూర్తిగా ప్రభుత్వ రంగం నుంచి దూరం చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వ్యాపార సరుకుగా మార్చిందన్నారు. విద్యా సంస్థలన్నీ సర్టిఫికెట్లు అమ్ముకునే కేంద్రాలుగా మారాయని తెలిపారు. ప్రఖ్యాత వర్సిటీల్లోనే, భూతవైద్యం, జోతిష్యం, వాస్తు వంటి మూఢనమ్మకాలే పీజీ కోర్సులుగా ప్రవేశ పెట్టబడు తున్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, తన యువగళం పాదయాత్రలో యూనివర్సిటీలకు కోట్ల రూపాయలు కేటాయించి రాష్ట్రంలోని యూనివర్సిటీలను దేశంలోనే మొదటి స్థానంలో ఉంచుతానని విద్యార్థి వర్గాన్ని నమ్మించి ఓట్లు వేయించుకొని తీరా అధికంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థని గాలికి వదిలేశారని విమర్శించారు. ఫలితంగానే రాష్ట్రంలో ప్రతి యూనివర్సిటీ 85 శాతం ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అన్ని యూనివర్సిటీలకు ఒకే కామన్ ఎంట్రన్స్ టెస్టు వలన వర్సిటీల్లో విద్యార్థుల చేరికలు పూర్తిగా తగ్గిపోయాయని తెలిపారు. కరోనా అనంతరం విద్యార్థులు యూనివర్సిటీల చదువుపై ఆసక్తిని కోల్పోతున్నారన్నారు. ఆచార్యుల పోస్టులు భర్తీ కాకపోవడంతో పరిశోధనా రంగం పూర్తిగా కనుమరుగైపోతున్నదని తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో 3,371 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తానని హామీ ఇచ్చి, నేడు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో మత రాజకీయాలు చేస్తూ విద్యార్థుల మధ్య మత ఘర్షణలు ప్రేరేపిస్తూ, ప్రశ్నించిన విద్యార్థులపై దాడులకు పాల్పడుతున్న ఆర్ఎస్ఎస్ సంఘాలను యూనివర్సిటీలోకి అనుమతించకుండా అధికారిక ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. జరగనున్న రాష్ట్ర యూనివర్సిటీ కన్వెన్షన్ లో ప్రొఫెసర్ హరిగోపాల్ పాల్గొనున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, జిల్లా అధ్యక్షులు పి శేఖర్ , ఉపాధ్యక్షులు అభిషేక్, కిరణ్, సహాయ కార్యదర్శి హేమానంద్, గణేష్ పాల్గొన్నారు.

## ఈ నెల 24న ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో తెలుగు జాతీయ సదస్సు

సమన్వయకర్తగా ఏయూ తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి



**కంచరపాలెం , మార్చి 15 (మనసులో మాట)** : ఈ నెల 24న తెలుగు విభాగం ఆధ్వర్యంలో పాలకొల్లు లోని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో తెలుగు సాహిత్యం -మహిళా చైతన్యం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధులరాజరాజేశ్వరి తెలియజేశారు. ఈ మేరకు కళాశాలలో జాతీయ సదస్సు గోడపత్రికను ఆవిష్కరిస్తూ ఈ విషయాన్ని ఆదివారం వెల్లడించారు. తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి సదస్సు సమన్వయకర్తగా, సహా సమన్వయకర్తగా జువాలజీ శాఖాధిపతి డాక్టర్ ఎం రామకృష్ణ, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీగా కళాశాల వైస్ ప్రిన్సిపల్, సైన్స్ విభాగాధిపతి టి కృష్ణ వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. ఈ సదస్సు కు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగ పూర్వశాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరావు, మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖధ్యక్షులు, మద్రాస్ విశ్వవిద్యాలయ ఓరియంటల్ లాంగ్వేజ్ డైరెక్టర్ ఆచార్య విస్తాలి శంకర్రావు రిసోర్స్ పర్సన్ గా హాజరవుతున్నారని, వీరితోపాటు వివిధ విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె భద్రాచలం, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి యామిని, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ ఉషారాణి, ఆంగ్ల అధ్యాపకులు జీడి శ్రీనివాసరావు ,జె కె సి మెంటార్ శిరీష, సూపరెండెంట్ కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వనరులపై మోడీ ప్రభుత్వానికి ముందస్తు జాగ్రత్తలు లేవు : నవజవాన్ భారత్ సభ సుజన్



**కంచరపాలెం , మార్చి 15 (మనసులో మాట)** : ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడి జరుగుతుందని జనవరి సమయానికే సంకేతాలు అందిన, సమస్య రాకుండా అవసరమైన వనరులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు చేపట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని నవజవాన్ భారత్ సభ కన్వీనర్ సుజన్ అన్నారు. నవజవాన్ భారత్ సభ, శ్రామిక హక్కుల పోరాటాల సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ అందుబాటులో లేకపోవడానికి, పెరుగుతున్న ధరలకి వ్యతిరేకంగా ఆర్కే బీచ్ వద్ద ప్రదర్శన చేపట్టారు. నిరసనలో సుజన్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మోడీ ప్రభుత్వ అసమర్థత వల్ల అనేకమంది రోడ్ల మీద పడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇప్పటికే అనేక హోటళ్ళు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయని, లక్షల మంది కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం తన అలసత్వాన్ని వీడి, గ్యాస్ బ్లాక్ మార్కెట్ ను అరికట్టాలని, వినియోగదారులకు గ్యాస్ ఇబ్బందులను తగ్గించాలని, లేని పక్షంలో గద్దె దిగిపోవాలన్నారు. ధరల పెరుగుదలకి కారణమైన ఇజ్రాయెల్, అమెరికాల యుద్ధోన్మాదాన్ని ఖండించి, ఇరాన్ పై జరుపుతున్న సామ్రాజ్యవాద యుద్ధాన్ని ఆపేందుకు చర్యలు చేపట్టాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కొంతమంది బిజెపి వారు అక్కడికి చేరుకొని మోడీని విమర్శించడం తప్పంటూ, వాదనకి దిగి, సభ్యుల చేతుల్లోని ప్లకార్డులు లాక్కునే ప్రయత్నం చేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో వారంతా వెనక్కి తగ్గారు.

## వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ప్రసాద్ ను సత్కరిస్తున్న పరవాడ నేతలు



**మునగపాక , మార్చి 15 (మనసులో మాట)** : మునగపాక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ నికలిసిన పరవాడ మండలం కలపాక గ్రామ సర్పంచ్ బొండా కనకారావు మరియు గ్రామ శాఖ అధ్యక్షులు,యూత్ అధ్యక్షులు మరియు వైఎస్ఆర్సీపీ పార్టీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు బొడ్డేడ ప్రసాద్కిపుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.దీనికి స్పందించిన బొడ్డేడ ప్రసాద్ తమను కలిసి అభినందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బిఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపీ పరవాడ మండలం కలపాక గ్రామం సర్పంచ్ బొండా కనకారావు గారు మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలు పెంచి పేదలు, చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు : ధర్నాలో ఏఐటియూసీ డిమాండ్




**కంచరపాలెం , మార్చి 15 (మనసులో మాట)** : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్ పి జి కమర్షియల్ గ్యాస్ ధరలు భారీగా పెంచి ప్రజలపై ఆర్థిక భారాలు వేయొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గురుద్వారా జంక్షన్ వద్ద ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ ఏకపక్షంగా దాడులు చేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి అన్నారు. దీంతో దేశంలో ఎల్ పి జి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచి ప్రజల మీద ఆర్థిక భారాలు వేయడం ప్రభు త్వానికి తగదని అన్నారు. నేటితో 16 రోజులకు చేరుకున్న ఇరాన్ పై యుద్ధం మరికొద్ది రోజులు జరిగితే దేశంలో డీజిల్ పెట్రోల్ నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగి ప్రజలు ఆహార భద్రత కోల్పోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకొని గ్యాస్ అక్రమ నిలువ చేసిన వారిపై పీడి యాక్ట్ ప్రయోగించి, ప్రజలకు చిరు వ్యాపారులకు కావలసిన గ్యాస్ ను సరఫరా చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి పాలకులు గురికాక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో చిరు వ్యాపారులు, ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## "వినియోగదారుల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత" : డాక్టర్ డి.వి.జి.శంకర్రావు



**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట)** : ప్రతీఏటా మార్చి 15న నిర్వహించే ఈ దినోత్సవం వినియోగదారుల ప్రాథమిక హక్కులను ప్రోత్సహించడం, వారిని సాధికారత పరచడం మరియు న్యాయమైన, సురక్షితమైన మార్కెట్ల గురించి అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా జరుపుకుంటారని, ఈ సంవత్సరం థీమ్: 'సురక్షితమైన ఉత్పత్తులు, నమ్మకంగా ఉన్న వినియోగ దారులు' ఇది భౌతిక మరియు డిజిటల్ మార్కెట్‌లలో ఉత్పత్తుల భద్రతను, ఇ-కామర్స్‌లో విశ్వసనీయతను నొక్కి చెబుతుందని, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతను తనిఖీ చేసి, ఖచ్చితంగా రసీదు అడగి తీసుకోవాలని, ప్రముఖ సాహితీవేత్త ప్రముఖ వైద్యుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ డివిజి శంకర్రావు తెలిపారు.' ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం' సందర్భంగా అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 42వ డివిజన్ కామాక్షి నగర్, అయ్యన్నపేట మున్సిపల్ వాకింగ్ నడకమైదానంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు సిహెచ్ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.జి. శంకర్రావు అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, తక్కువ బరువులు లేదా కల్తీ గమనిస్తే, 'జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి' వినియోగదారుల ఫోరమ్‌లలో ఫిర్యాదు చేయాలని, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, వినియోగదారుల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యతని, మరింత పారదర్శకమైన, సురక్షితమైన ఆర్థిక వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు), డిప్యూటీ గవర్నర్ తాడ్డి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు పి. అప్పలరాజు, కార్యదర్శి కోట్ల ఈశ్వరరావు, సహకార్యదర్శి ఐ.అప్పలరాజు జాలివాకర్ నలమహారాజు, క్లబ్ పెద్దలు కోట్ల సత్యనారాయణ, పాత్రుడు, గురుమూర్తి, సిహెచ్ సత్యనారాయణ మాస్టారు, నరేష్ తదితర పెద్దలు హాజరయ్యారు.

## ఇంటిపన్ను వసూలు సొమ్మును పంచాయితీ ఖాతాలలో వెంటనే జమచేయాలి




**ఎస్.రాయవరం , మార్చి 15 (మనసులో మాట)** : గ్రామపంచాయితీలలో నూరుశాతం ఇంటిపన్ను వసూలులక్ష్యంగా పంచాయితీ కార్యదర్శి లు పనిచేయాలని, వసూలుచేసిన పన్నుమొత్తాన్ని పంచాయితీ ఖాతాలో వెంటనే జమచేయాలని డిప్యూటీ ఎంపిడిఓ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని గుర్రాజుపేట,కోరు ప్రోలు,తిమ్మాపురం, ఎస్. రాయవరం గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఇంటి పన్నులు వసూలు ప్రక్రియ డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు. ఇంటి పన్నులు వసూలు చేసే క్రమంలో ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని డిప్యూటీ ఎంపిడిఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు ఉపేంద్ర, సత్యనారాయణ,కర్రి శ్రీనివాస రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ వెల్ఫేర్ కౌన్సిల్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా గొంతిన భక్త సాయిరాం



**అచ్యుతాపురం , మార్చి 15 (మనసు లో మాట) :** ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, పంచ భూతాల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించుట కొరకు జాతీయ స్థాయిలో 2025 సంవత్సరంలో స్థాపించబడిన సంస్థే నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ , ఈ సంస్థ పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సంస్థ , ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ-సామాజిక సంస్థల సమన్వయంతో ముందుకు సాగే సంస్థ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ సంస్థాగత విస్తరణలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు అంబటి నవ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల అధ్యక్షులను నియమించడం జరిగింది. ఈ నియామకంలో భాగంగా అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నన్ను గొంతిన భక్త సాయిరామ్ ని నియమించారు. నాకు ఇచ్చిన ఈ బాధ్యత ద్వారా జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచడం మరియు పంచభూతాల సంరక్షణ (గాలి, నీరు, నేల,అగ్ని, ఆకాశం) పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ,మొక్కలు పెంచడం ద్వారా సోషల్ ఫారెస్ట్ పెంపొందించడానికి నా శక్తివంచనలేకుండా కృషి చేస్తానని తెలియజేస్తూ ఈ బాధ్యతకు నన్ను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు అంబటి నవ కుమార్ గార్కి ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను.. గొంతిన భక్త సాయిరామ్ తెలియజేశారు.

## అడివి అగ్రహారం పంచాయతీలో 30 లక్షలతో సీసీ రోడ్డు పనులు



**చీడికాడ ,మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో అడివి అగ్రహారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 30 లక్షలతో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి సిసి రోడ్లకు ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి ఎన్ఆర్ఈజీఎస్ విధులు మంజూరు చేశారని కూటమి నాయకులు తెలిపారు కూటమి ప్రభుత్వ హయంలోనే గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని కూటమి నాయకులు తెలిపారు

## మార్టూరు నూకాలమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



**అచ్యుతాపురం , మార్చి 15 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా.. యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాలు ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ అచ్యుతాపురం మండలంలో మాటూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే అమ్మవారికి విశేష పూజలు చేయించారు.అనంతరం ఆలయ పెద్దలు ఎమ్మెల్యేని సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.... ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పెద్దలు యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## మునగపాక మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభోత్సవం



**మునగపాక , మార్చి 15 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలంలో గణపర్తి,చుచూకొండ, పలు గ్రామాల్లో నూతన ప్రారంభోత్సవం కార్యక్రమాలు కు అనకాపల్లి జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ శ్రీకరం చుట్టారు. చదరం సత్తిబాబు కి నూతన ఎస్ ఎస్ ఎం రిసార్ట్ ప్రారంభోత్సవం మరియు నూకాంభిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో బోరు ప్రారంభోత్సవం, మరియు చుచూకొండ గ్రామ పెద్దలు మరియు రామాలయం వీధి యూత్ ఆధ్వర్యంలో నూతన శ్రీసింహాద్రి అప్పన్న స్వామి (తాడుపెద్దు) వసతి సదుపాయం గృహనిర్మాణం ప్రారంభోత్సవం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయడం జరిగింది.ఈకార్యక్రమంలో గణపర్తి,మెల్లిపాక,చుచూకొండ, రామగిరి, మడకపాలెం, చెర్లోపాలెం, ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ దృష్టికి ఆదివాసి సమస్యలు

**చింతపల్లి , మార్చి 15 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ను ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ ప్రతినిధులు విజయవాడ లో రాజ్ భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి 4 అంశాలతో కూడిన ఆదివాసి సమస్యలు రాష్ట్ర గవర్నర్ గారికి ప్రాతినిధ్యం చేశాము.సుమారుగా అరగంటసేపు ప్రతి అంశాన్ని గవర్నర్ గారితో చర్చలు కొనసాగింది.మొదటి అంశంగా రద్దు చేసిన జీవో నెంబర్.3 మరల పునరుద్ధరించి,చట్టం చేయాలని ఐదో షెడ్యూల్ ఏరియాలో గవర్నర్ కు ఉన్న విశిష్ట అధికారాలు ఉపయోగించి,రాష్ట్రపతి ద్వారా చట్టం చేసే విధంగా బాధ్యత తీసుకోవాలని కోరాము.100% ఉద్యోగాలు స్థానిక అభ్యర్థుల చేతనే భర్తీ చేయాలని కోరాము.గత ప్రభుత్వం జిఓ జారీ చేయడం వల్ల సుప్రీంకోర్టు కొట్టి వేసింది.చట్టం చేసి ఉంటే100లో 94 మంది నిరుద్యోగులు మిగిలేవారు కారు అని గుర్తు చేసాము.ప్రాథమిక విద్య గిరిజన మాతృభాషలోనే విద్య బోధన కొనసాగితేనే విద్యా ప్రమాణాలు పెరుగుతుందని విద్యార్థుల డ్రాప్ అవుట్ తగ్గించవచ్చు అని గవర్నర్ గారితో చర్చించాము.ఆదివాసి ప్రాంతంలో గిరిజనులకు ఒక్కొక్క తెగకు ప్రత్యేకమైన మాతృభాష ఉంటుంది. ఆ మాతృభాష తెలిసిన ఉపాధ్యాయులే నియమిస్తేనే వారికి నాణ్యమైనవిద్యా అందుతుందని గవర్నర్ గారికి వివరించాము .గిరిజన మాతృభాష తెలిసిన ఉపాధ్యాయులతోనే విద్య బోధన జరగాలని జిఓ నంబర్ 275,జిఓ ఎంఎస్ నంబర్ 3 రద్దు చేసిన అప్పటి జిఓల ప్రధాన ఉద్దేశం అని గవర్నర్ గారికి గుర్తు చేశాము. ఐదో షెడ్యూల్ ఏరియాలో గవర్నర్కు ఉన్న అధికారాలను ఉపయోగించి ఆదివాసులకు న్యాయం జరిగేలా చేస్తానని చెప్పారు. ఐదో షెడ్యూల్ అయినా ఆదివాసి ఏరియాలో పర్యటించి మా యొక్క స్థితిగతులు తెలుసుకోవాలని కోరాము .గవర్నర్ గారు తప్పకుండా పరిశీలనకు వస్తానని చెప్పారు. రెండవ అంశంగా పోలవరం ప్రాజెక్టు ముంపు భూ నిర్వాసితులకు నష్టపరిహారంగా భూమికి భూమీ ఇవ్వాలని చర్చించారు. మూడవ అంశంగా





ఆదివాసి గిరిజన ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు చట్టం కచ్చితంగా అమలు చేయాలని బినామీ వ్యవస్థ రద్దు కు చట్టం చేయాలని గవర్నర్ గారిని కోరారు. నాల్గవ అంశంగా ఆంధ్రప్రదేశ్ లోక్ భవనంలో ఆదివాసులకు ప్రత్యేకంగా ఒక ఎస్టీ సెల్ విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. మహారాష్ట్ర ప్రభుత్వము ఆదివాసులకు ఎస్టీ సెల్ ఏర్పాటు చేసి ఉందని గుర్తు చేశాము.చర్చించిన ప్రతి అంశానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గారు సానుకూలంగా స్పందించారు.13/3/26 పై అంశాల్ని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ గారికి పరిశీలన కొరకు పంపిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ భేటీలో పాల్గొన్న ఆదివాసుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ జాతీయ అధ్యక్షులు చందా లింగయ్య దొర (మాజీ ఎమ్మెల్యే), జాతీయ కన్వీనర్ లకే రాజరావు(మాజీ ఎమ్మెల్యే),జాతీయ సలహాదారులు జె.పూర్ణచందర్ రావు(రిటైర్డ్ డిజిపి),పివి రమేష్ (రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ),బి.పరంజ్యోతి (లీగల్ అడ్వైజర్ మరియు అడ్వకేట్ ఫోరం చైర్మన్),రాష్ట్ర చైర్మన్ కోలాక లక్ష్మణమూర్తి (మాజీ ఎమ్మెల్యే),జనరల్ సెక్రెటరీ చల్లంగి ఉమామహేశ్వరరావు (మాజీ ఎంపీపీ),రాష్ట్ర కన్వీనర్ (తెలంగాణ)పాయం సత్యనారాయణ,ఉద్యోగ విభాగం రాష్ట్ర కన్వీనర్ కె నాగేశ్వరరావు,కిలో జలంధర్,కిట్లాంగి ప్రసాద్ పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా శ్రీ హనుమాన్ చాలీసా హవనం..పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం , మార్చి 15 (మనసులో మాట) :** పరమ పూజ్య గురుదేవులు స్వామి చిన్మయానంద దివ్య సంకల్పంతో ప్రారంభించబడిన చిన్మయ మిషన్ ఈ ఏడాదికి 75 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో చిన్మయ అమృత మహోత్సవం పేరుతో చిన్మయ మిషన్ విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహించిన 108 సమష్టి శ్రీ హనుమాన్ చాలీసా హవనం నగరంలోని కొత్తపేట శ్రీ మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో అత్యంత వైభవపతంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ ఆంజనేయస్వామి అనుగ్రహాన్ని కోరుకుంటూ నగరంలో అత్యంత వైభవపేతంగా ఈ క్రతువును నిర్వహించారు. 108 హోమ





కుండములతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 432 మంది దంపతులు పాల్గొని 27 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం తో శశాస్త్రీయంగా సమిష్టి హనుమాన్ చాలీసా హవనం నిర్వహించారు. ఇటువంటి మహత్తర కార్యక్రమం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో విజయనగరం లో నిర్వహించడం, ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోవడం సంతోషకరమని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా నోయిడా చిన్మయ మిషన్ నుండి స్వామి చిదృపానంద సరస్వతి హాజరయ్యారు.

## 86వ వార్డు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సమర శంఖారావం : ఏడుకొండలు


**గాజువాక , మార్చి 15 (మనసులో మాట) :** 86 వార్డు బీసీ కి సీటు కేటాయించాలని చదరం తులసిరామ్ డిమాండ్ చేసారు. 86వ వార్డు కూర్మన్నపాలెం రాజీవ్ నగర్ లో 20 ఉప సంఘాల నాయకులతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు కార్యక్రమాన్ని చదరం తులసిరామ్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ వార్డులో ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల అందరూ కూటమిగా ఏర్పడి వచ్చే స్తానికి ఎలక్షన్లకి ఈసారి బీసీ కి సీట్ ఇవ్వాలని అందరూ ఏకధాటిగా ఉన్నారని, 5000 పైన ఓటింగ్ ఉన్నటువంటి బీసీకి సిటి కేటాయించాలని కోరారు, త్వరలో వార్డు కమిటీలు కూడా వేస్తామని తెలిపారు 15 సంవత్సరాలుగా ఒకె వర్గానికి ఇస్తున్నారు, కానీ అత్యధిక ఓటింగ్ ఉన్న



బీసీ కి ఈసారి కేటాయించాలని కోరుతున్నారు, ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి గత కొన్ని నెలలుగా కృషి చేస్తున్నటువంటి ఏడుకొండల కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, ఏడుకొండలు మాట్లాడుతూ బి సి ఎస్ సి ఎస్ టి యొక్క ప్రత్యేకత పూర్వం నుండి చరిత్రలు తెలియజేస్తూ ప్రస్తుత సమాజంలో మనం ఇంకా దిగజారే పరిస్థితికి వెళ్తున్నామని ఈసారి మనందరం ఏకధాటిగా ముందుకు వెళ్లాలని ఈ సభని ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు, ముఖ్య అతిథులుగా నీల రాంబాబు పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ పార్టీ లకు అతీతంగా మ నందరం ఒక ఐక్యతగా ఉండాలని వచ్చే స్థానిక ఎన్నికలకు మరింత బలపడాలని త్వరలో కమిటీ కూడా వెయ్యాలని కోరారు కార్యక్రమంలో బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు చిట్టి రాజు , నాయుడు , ఐటీ శ్రీను , సిపిఎం సత్యవతి , ఎం రమేష్ , ముత్యాలరావు,రంగలి నాగరాజు , లక్ష్మీ ఎన్టీఆర్ కాలనీ, సుందరం వెన్న అప్పారావు,బొబ్బిలి శ్రీను,మురళి, టీవీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

## నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

**మునగపాక , మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో ఉమ్మలాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలలో భాగంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అభివృద్ధి చెందాలని కర్రి సాయికృష్ణ అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మొల్లేటి గణేష్, మందా రాము,



కాండ్రేగుల గణేష్, మొల్లేటి గోపాల్, రమణ, ఏడిద నాగేశ్వరరావు, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, యువత, గ్రామ పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఒత్తిడి వీడి..ఉత్తీర్ణత సాధించండి : వరప్రసాద్

**చింతపల్లి , మార్చి 15 (మనసులో మాట) :** రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి (సోమవారం) నుంచే ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలని వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ అన్నారు. విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన ఈ ఘట్టాన్ని భయం లేకుండా, ఒక పండుగలా ఎదుర్కోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో పాటించాల్సిన పలు జాగ్రత్తలను, సూచనలను వివరించారు. పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు చివరి నిమిషంలో కంగారు పడకుండా ప్రశాంతంగా ఉండాలని వరప్రసాద్ సూచించారు. సోమవారం ఉదయమే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్లు, పెన్నులు వంటి అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని గుర్తు చేశారు. ప్రశ్నపత్రం అందిన తర్వాత కంగారు పడకుండా, మొదట బాగా వచ్చిన సమాధానాలను గుర్తించి వాటిని స్పష్టంగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. కేవలం చదవడమే కాకుండా, రాసే విధానం (ప్రెజెంటేషన్) పై దృష్టి సారించాలని, ముఖ్యమైన పాయింట్లను అండర్ లైన్ చేయడం వల్ల గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. పరీక్షల సమయంలో మితాహారం తీసుకుంటూ, తగినంత నిద్ర పోవడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందని వివరించారు.



ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పరీక్షలు రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వరప్రసాద్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉన్నత ఫలితాలు సాధించాలని వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం తరఫున ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసిన మండల విద్యాశాఖ అధికారులు : కె. కృష్ణమూర్తి, పుష్ప జోసెఫ్

**పెదబయలు , మార్చి 15 (మనసులో మాట) :** పెదబయలు మండలంలో 14 ఉన్నత పాఠశాలల నుండి పదవ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులు మొత్తం 556 మంది విద్యార్థులు రాస్తున్నారని మండల విద్యాశాఖ అధికారులు కె. కృష్ణమూర్తి, పుష్ప జోసెఫ్ లు స్థానిక విలేకరులు తెలిపారు. బాలురు 299. బాలికలు 257.మందివిద్యార్థులు పరీక్షలు రాస్తున్నాని . 556మంది మంది విద్యార్థులలో. ఇంగ్లీష్ మీడియం లో పరీక్షలు రాసే విద్యార్థులు 188. తెలుగు మీడియం విద్యార్థులు 368 మంది ఉన్నారు.గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల పెదబయలు లో 172 మంది విద్యార్థులు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదబయలు నందు 200 మంది విద్యార్థులు.ఆంధ్రప్రదేశ్ గురుకుల సంక్షేమ ఉన్నత పాఠశాల పెదబయలు నందు 154 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.మొత్తం విద్యార్థులు 556 మంది ఈ విద్యా సంవత్సరం పదవ తరగతిలో పరీక్షలు రాస్తున్నారు. వీరందరూ మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారు.. మండలంలోని ఉన్న 14 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ద్వారా ఇప్పటికే హాల్ టికెట్లు పంపిణీ చేశామన్నారు.ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని జాగ్రత్తలు జిల్లా విద్యాశాఖ అధికారి తీసుకున్నారని. మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో 144



సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఈ పరిక్ష కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు ఫ్లైయింగ్ స్క్వాడ్లు మరియు స్పెషల్ ఆఫీసర్స్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు. మరియు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించుటకు.మూడు కేంద్రాలలో. మౌలిక వసతులు విద్యుత్తు. సౌకర్యం. త్రాగునీటి సౌకర్యం.రూమ్ సిట్టింగ్ అరేంజ్మెంట్. మొదలైన విషయాలపై క్షుణ్ణంగా పరిశీలించి. తగు జాగ్రత్తలు తీసుకున్నమనీ మండల విద్యాశాఖ అధికారులు. కె.కృష్ణమూర్తి మరియు. జి పుష్పా జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో ఏ టి డబ్ల్యూ ఓ. జగత్ రాయి, డి శంకర్రావు, శేషగిరి, నారాయణ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

## మంత్రి గుమ్మడి సంధ్యారాణి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 15 (మనసులో మాట) :** మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జన్మదిన వేడుకలకు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. సాలూరులోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిడారి శ్రావణ్ కుమార్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కి పూల మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి గిరిజనులు, మహిళలు మరియు శిశువుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మంత్రి కి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు సాయిరాం, మాజీ





పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు బుజ్జి బాబు, మాజీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, అనంతగిరి మండల ప్రధాన కార్యదర్శి గాలి నర్సిమూర్తి, బాకూరు సర్పంచ్ వెంకట రమణ రాజు, దారేలా సర్పంచ్ పాండు రంగ స్వామి, మాజీ సర్పంచ్ వంతల పూర్ణ, టీడీపీ నాయకులు రమేష్, అప్పల రాజు, చిరంజీవి, రవీంద్ర ప్రసాద్, గంగులు సుందరరావు, సుశీల, పార్వతీపురం జీసీసీ డీఎం రామారావు, పార్వతీపురం, సాలూరు జీసీసీ మేనేజర్లు, జీసీసీ సిబ్బంది శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## 3.70 కోట్ల తో అనకాపల్లి లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు

**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 15 (మనసులో మాట) :** అనకాపల్లి 81 వ వార్డు పరిధి లో ఆదివారం 3.70 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిధులు మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ముందుగా త్వరలో పునః ప్రారంభం కానున్న రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. అలాగే అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుంచి ఏడి స్కూల్, ఫుల్ బాగ్ రోడ్ వరకు 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, కాలువ నిర్మాణం, ఫుల్ బాగ్ రోడ్డు నుంచి పూడిమడక రోడ్డు వరకు సుమారు 99 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం నకు వారు శంకుస్థాపన చేయడం జరిగింది.



అనకాపల్లి శ్రీ మరిడిమాంబ అమ్మవారి గుడి వద్ద జేఎల్ స్కూల్ నుంచి ఎన్హెచ్16 వరకు రోడ్డు, కాలవలు, కల్వర్టులు సుమారు 1.23 కోట్ల రూపాయలతో నిర్మాణం నకు శంకుస్థాపన చేశారు. కొత్తపేట రామాలయం నుండి ఎన్ హెచ్ 16 రోడ్డు వరకు రోడ్డు, కాలవలు, కల్వర్టులు సుమారు 93 లక్షల రూపాయలతో నిర్మాణం నకు శంకుస్థాపన కార్యక్రమాలకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 81 వ వార్డు కార్పొరేటర్ పీలా సౌజన్య రాంబాబు, ప్రముఖ సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్, దేమునిగుమ్మం వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మెన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, 81 వార్డు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

### మునగపాక ఇందిరమ్మ కాలనీలో రోడ్డు ఏర్పాటుకు సన్నాహాలు

**- పనులు పర్యవేక్షిస్తున్న మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం**



**మునగపాక , మార్చి 15 (మనసులో మాట) :** మండల కేంద్రం మునగపాక ఇందిరమ్మ కాలనీలో సిసి రోడ్ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం జెసిబి తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పరశురాం మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో సుమారు 35 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ కు ఇందిరమ్మ కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని పరశురాం అన్నారు.

## సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోండి

**డిసిసిబి చైర్ పర్సన్ కోన తాతారావు యాదవ్**



**కె కోటపాడు , మార్చి 15 (మనసులో మాట) :** కో ఆపరేటివ్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటికే రైతులకు అతి తక్కువ వడ్డీ రేటుకు రుణాలు ఇస్తున్న తమ సొసైటీ అందు మరిన్ని వ్యాపారాలు చేసుకునేందుకు రాయితీతో కూడిన రుణాలు స్వల్ప వడ్డీతో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని డిసిసిబి చైర్ పర్సన్ కోన తాతారావు యాదవ్ అన్నారు. మండలంలో ఏ. కోడూరు గ్రామంలో కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత తక్కువ వడ్డీ రేటుకు కోపరేటివ్ సొసైటీ నుండి రుణాలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు ఈ సందర్భంగా మండలంలోని యాదవ సంఘం నాయకులు కోన తాతారావు యాదవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు ఎలమంచిలి ధర్మారావు మాడుగుల నియోజకవర్గం యాదవ సంఘం ఉపాధ్యక్షుడు నంబారు అప్పారావు కే కోటపాడు మండలం యాదవ సంఘం అధ్యక్షులు వల్ల అప్పారావు బొడ్డాన రమణ కడపు ట్ల గంగరాజు , సీమునరు వెంకటరమణ తదితర యాదవ సంఘం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నెల్లిమర్లలో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారుల మెరుపు దాడులు

**నెల్లిమర్ల , మార్చి 15 (మనసులో మాట) :** నెల్లిమర్ల మండలం, నగర పంచాయతీ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లపై పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం ఉమ్మడి తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో వాణిజ్య అవసరాలకు అక్రమంగా వాడుతున్న 13 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను అధికారులు గుర్తించి, వాటిని సీజ్ చేశారు.వ్యాపార సంస్థల్లో సబ్సిడీపై వచ్చే డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. మొత్తం 13 సిలిండర్లు వీటిలో 11 హెచ్.పి, 2 ఇండియన్ సిలిండర్లు ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన సదరు హోటల్ యజమానులపై 6ఎ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సీజ్ చేసిన సిలిండర్లను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక గాయత్రి గ్యాస్ ఏజెన్సీ భద్రపరచడం కోసం అప్పగించారు. ?ఈ సందర్భంగా అధికారులు కీలక సూచనలు చేశారు. గృహ అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించిన సబ్సిడీ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వ్యాపార సంస్థల్లో వాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సింహాచలం, సీహెచ్‌డిటీ శంకర రావు, హెచ్.సి కామేశ్వరరావు, వీసీలు పురుషోత్తం రావు, తిరుపతి రావు, మరియు వీఆర్‌ఓ వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా కాన్షీరాం 92వ జయంతి వేడుకలు



**నర్సీపట్నం రూరల్ , మార్చి 15 (మనసులో మాట) :** బహుజన రాజకీయ దురంధరుడు, సామాజిక విప్లవకారుడు మాన్యవర్ కాన్షీరాం 92వ జన్మదిన వేడుకలను ఆదివారం ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బొట్టా నాగరాజు మాట్లాడుతూ, బహుజనుల బానిస సంకెళ్లను తెంచి వారికి రాజకీయ అధికారం దిశగా దిశానిర్దేశం చేసిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. ఎవరి సంఖ్య ఎంత ఉంటే వారి వాటా అంత ఉండాలనే సిద్ధాంతం ద్వారా అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బహుజనులు కేవలం ఓటు బ్యాంకులుగా మిగిలిపోకుండా పాలకులుగా ఎదగాలని, ఆర్థిక సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే బహుజన రాజ్యాధికారం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జై భీమ్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బహుజన నాయకులు ఎస్. అప్పారావు, నెల్లూరి చిరంజీవి, వాడపల్లి సంజీవ్, కిల్లాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం పట్టణంలో పోలీసు జాగిలంతో విస్తృత సోదాలు

**- బస్ కాంప్లెక్స్ పరిసరాలు, పార్సిల్ సర్వీసులు, దుకాణాలలో తనిఖీలు**

**శ్రీకాకుళం , మార్చి 15 (మనసులో మాట) :** శ్రీకాకుళం పట్టణంలో పోలీసు జాగిలంతో విస్తృతంగా తనిఖీలు, సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం గంజాయి, అక్రమ మద్యం వంటి మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాల అక్రమ నిల్వలు మరియు రవాణాను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై రామారావు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో పోలీసు జాగిలంతో అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. బస్ కాంప్లెక్స్






పరిసర ప్రాంతాల్లో ఉన్న పార్సిల్ సర్వీసులు, దుకాణాలు మరియు ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రతి షాప్, దుకాణంలో పోలీసు జాగిలం సహాయంతో తనిఖీలు నిర్వహించి, ప్రయాణికుల లగేజీ బ్యాగులు మరియు పార్సిల్ సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు మరియు నిషేధిత పేలుడు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి తనిఖీలు జిల్లాలో నిరంతరం కొనసాగిస్తూ అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## మునగపాక శ్రీ పరదేశమ్మ పండుగను జయప్రదం చేయాలి

**- నాటకం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్**



**మునగపాక ,మార్చి 15 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మునగపాక పార్టీ కార్యాలయంలో మునగపాక గ్రామంలో వెలసిన ఉన్న శ్రీ పరదేశమ్మతల్లి పండగ మహోత్సవ ఆహ్వానము,సాంఘిక నాటకం పోస్టర్ ను, వైఎస్ఆర్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ.బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక గ్రామ యువరచయితలు నాటకాలను రాయడం, ప్రదర్శన చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో విశాలాంధ్ర తంపరమూల రైతు సంఘం సభ్యులు పెంటకోట శివ గణేష్, ఇల్లూరి చెక్కిరమ్మ నాయుడు, టెక్కలి దేవకి, మూలపేట సర్పంచ్ బి శెట్టి గంగ అప్పలనాయుడు, చూచుకొండ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పెంటకోట హరే రామ, మండల వైయస్సార్సీపి ఎస్సి సెల్ అధ్యక్షులు దిమ్మల శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిపై సర్పంచ్ చొరవ..ట్యాంకర్లతో నీటి సరఫరా

**- చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ పుష్పలత**




**చింతపల్లి , మార్చి 15 (మనసులో మాట) :** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సర్పంచ్ దురియా పుష్పలత ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామంలోని కొన్ని వీధుల్లో గత కొద్ది రోజులుగా మోటార్లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ఆమె, సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్రాక్టరుతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయిస్తున్నారు. నీటి సరఫరా జరుగుతున్న తీరును ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. మోటార్ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఏ ఒక్కరికీ తాగునీటి కష్టం రాకూడదనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల గ్రామస్తులందరూ నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ స్వయంగా వీధుల్లో తిరుగుతూ నీటి సరఫరాను క్రమబద్ధీకరిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నెల్లిమర్లలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



**నెల్లిమర్ల , మార్చి 15 (మనసులో మాట) :** నెల్లిమర్ల నగర పంచాయతీ ప 15వ వార్డులోని ఎస్సీ కాలనీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి విజయనగరం పార్లమెంటరీ ఇన్-ఛార్జ్, నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి ఆదేశానుసారం ఈ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు గంటా సత్యనారాయణ, నాయకులు బంగారు శంకర రావు, నగర పంచాయతీ సీనియర్ నాయకులు. సురకాశి కృష్ణమోహన్, బంగారు భాను సాకేటి రాము, సాకేటి చంటి, సాకేతి కాశి. నక్కన లక్ష్మణ్, తెలుగు సింహాచలం, తెలుగు అప్పారావు. పలికిల రామారావు మరియు ఇతర కుల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ నిర్మాణానికి విరాళాల వెల్లువ



**దేవరావల్లి , మార్చి 15 (మనసులో మాట) :** మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద శ్రీ అభయాంజనేయ స్వామి 32 అడుగుల భారీ విగ్రహ నిర్మాణం కోసం దాతలు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. విరాళాలు ఇచ్చిన వారిలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాలిబాబు దంపతులు 60 వేల రూపాయలు స్వామివారి ముఖద్వారం రెండు వైపులా (స్టీల్ గేట్లు నిమిత్తం ), కొల్లి సురేష్, జ్యోతి దంపతులు 70 వేల రూపాయలు, కంచిమాల రమణమ్మ కుమారుడు కంచిమాల అప్పారావు 10 వేల రూపాయలు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకు అంద జేశారు. భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణంలో భాగంగా దాతలు ముందుకు వచ్చి సహకరించాలని మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ,మాడుగుల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంధం అప్పలరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, వెత్సా రమేష్, వార్డు మెంబర్లు దీవి శంకరావు, కొల్లి ఈశ్వరరావు, అల్లు అబద్ధం, సిమ్మ అప్పన్న, మోరా అప్పలకొండ, గవిరెడ్డి దేముడు నాయుడు, బొడ్డు వెంకట్రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కె,జ్వాలా, తోట అచ్చిబాబు, అనిమిరెడ్డి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రాంతాలలో చెరువులను సంరక్షించడం వలన నీటిమట్టాల విలువలు పెరిగి, వేసవిలో భూగర్భ జలాలు మెరుగుపడతాయి

**- నగర ప్రాంతాల్లో ఉన్న చెరువులను ఆక్రమించిన కబ్జాదారులపై అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**



**గాజువాక , మార్చి 15 (మనసులో మాట) :** మొల్లి పెంటిరాజు ( డైరెక్టర్ - ఏపీ స్టేట్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ) గాజువాక నియోజకవర్గం, జీవీఎంసీ 79, 88వ వార్డ్ పరిధి లో కాపు జగ్గరాజుపేట గ్రామాలలో ఉన్న అయ్యప్ప , బొడ్డయ్య చెరువులను, అగనంపూడి గల్లావానిపాలెం చెరువులను, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు పరిశీలించి, వాటి అభివృద్ధికి త్వరలోనే ప్రణాళికలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు, గ్రామస్తులు ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న చెరువులను కబ్జాలకు గురి కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, కబ్జాదారులను అధికారులు చట్టపరంగా శిక్షించాలని, నగర ప్రాంతాల్లో ఉన్న చెరువులను సంరక్షించుకోవడం వలన భూమిలో ఉన్న నీటి మట్టాలు స్థాయి పెరుగుతాయని, వేసవిలో భూగర్భ జలాలు నిండుగా ఉండడానికి చెరువులు ఎంతో సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడిసా కనకరాజు, సంద్రాన సోమరాజు, మాడిసా హేము, గల్లా రుద్ర, కోసి రెడ్డి రమణ, కర్రి దేముడు, గల్లా కనకరాజు, దాసరి కనకరాజు , గొంతిన సత్యనారాయణ, గల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డ్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- సంతమామిడి తోట శివాలయం ఓపెన్ సేడ్ ప్రారంభోత్సవం**



**గాజువాక , మార్చి 15 (మనసులో మాట) :** గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాధం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కాశి పాలెం మరియు వడ్లపూడి చెట్టుబలిజ వీధిలో ఉన్న సిసి రోడ్ మరియు సీసీ కాలువ శిధిలావస్థకు చేయడం జరిగిందని. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం జీవీఎంసీ నిధులు 19.70 లక్షల ఎఎ రోడ్లు ఎఎ కాలవలు మరియు సొంతమామిడి తోట శివాలయం షడ్డుకు 19 98 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, జనసేన అధ్యక్షులు సిరసపల్లి కనకరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజ్, డీవీ అప్పారావు, కాంద్రేగుల శ్రీనివాస్ నాయుడు, కణితి ఈశ్వరరావు, వై. భాస్కరరావు, జీవీ రమణ, గండిమాన కనకరాజు, శ్రీరామ్ మూర్తి, వెంకటరావు.వేణు, ఆలయ కమిటీ బంటు వరలక్ష్మి.తదితరులు పాల్గొన్నారు.



## ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ



**అచ్యుతాపురం , మార్చి 15 (మనసులో మాట) :** మండలంలో ఎం జగన్నాధపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి ఆవరణలో పాత భవనం కూల్చి కొత్త భవన నిర్మాణ పనులకు ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ సహకారంతో రూ.36 లక్షల నిధులతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు.రోగులకు అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ ఆసుప త్రిలో అందేలా పాత భవనం కూల్చి అధునాతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరెడ్ల సూర్య ప్రకాష్, కూటమి నాయకులు పతివాడ చిన్నయ్య నాయుడు, బుదిరెడ్డి కన్న కుమార్, విసం నానాజీ, కింతాడ శ్రీనివాసరావు, భీముని కిషోర్, భీమిని జోగినాయుడు, పైల రాంబాబు భీమిని నాయుడు, గొర్లి పంతులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సివిల్స్ 22వ ర్యాంక్ సాధించిన గీతిక ఆరోరాను అభినందించిన జాతీయ ఓబీసీ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు

**నర్సీపట్నం , మార్చి 15 (మనసులో మాట) :** ఢిల్లీలోని ఇంద్రప్రస్థ మహిళా కాలేజీ విద్యార్థిని, హర్యానా కు చెందిన గీతిక అరోరా సివిల్ సర్వీసెస్ పరీక్షలో జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా జాతీయ ఓబీసీ (జ్యోతిరావు పూలే) సంఘటన అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, “గీతిక అరోరా సాధించిన ఈ ఘనత విద్యార్థి సమాజానికి గర్వకారణమన్నారు. ఆమె కష్టపడి చదువుకోవడం, లక్ష్యసాధనలో చూపిన తపన యువతకు ఆదర్శమన్నారు. ఇలాంటి పోరాట భావనతో సమాజ యువత మరింత ఉత్తేజంగా పోటీపరీక్షలకు సిద్ధమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గీతిక అరోరా మాట్లాడుతూ, ఓబీసీ జాతీయ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. “సంఘటన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం లేకుండా ఈ విజయం సాధ్యం కాదని, నా ఘనతను గుర్తించినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.




# సమరానికి సై...

## ■ ఏప్రిల్ 9న పోలింగ్.. ■ మే 4న ఫలితాలు..

**యానాం (మనసులో మాట) మార్చి 15:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికల షెడ్యూల్ ను సెంట్రల్ ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న ఎన్నికల నిర్వహిస్తామని, మే 4వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానం నియోజకవర్గంలో 37,664 మంది ఓటర్లు ఉండగా అందులో 18,319 పురుష ఓటర్లు, 19,345 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. యానాం నియోజకవర్గం లో 42 పోలింగ్ బూత్ లలో పోలింగ్ నిర్వహించనున్నారు. పుదుచ్చేరిలో బిజెపి, ఎన్ ఆర్ కాంగ్రెస్, అన్నాడిఎంకె కూటమిగా, కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, సిపిఐ కుటమిగా పార్టీలు 2021లో పోటీ చేశాయి. 2026 ఎన్నికల్లో బిజెపి, ఎన్ ఆర్ కాంగ్రెస్, అన్నా డీఎంకే, ఎల్ జె కే పార్టీలు కూటమిగా, కాంగ్రెస్, డిఎంకె, వి సి కే కూటమిగా పోటీ చేయనున్నాయి. ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడినగాని ఇప్పటివరకు రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించలేదు. కేవలం 23 రోజుల వ్యవధిలోనే పుదుచ్చేరి ఎన్నికల పోలింగ్ ముగియనుంది. ఇంత తక్కువ సమయంలో ఎన్నికల నిర్వహించడం ఇదే మొదటిసారి. 2021 ఎన్నికలలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా యానాం నియోజకవర్గం నుంచి రంగస్వామి పోటీ చేయగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బరిలో దిగారు. ఆ ఎన్నికలలో గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రంగస్వామి పై 600 పైగా ఓట్లతో గెలుపొంది సంచలనం సృష్టించారు.



## ఎమ్మెల్యే గోరంట్లకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని బుచ్చయ్య చౌదరి నివాసానికి వెళ్ళిన మంత్రి దుర్గేష్ ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు కాసేపు ఉత్సాహంగా ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వారు భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలందించాలని, ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉంటూ అందరికీ మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నాను," అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏలూరు ఎంపీ చేత సీఎం చంద్రబాబు రాజీనామా చేయించాలి

**- మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** నైతక బాధ్యత వహించి ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ చేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజీనామా చేయించాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ డిమాండు చేశారు. స్థానిక వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మార్గాని భరత్ రామ్ మాట్లాడారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉంటూ హైదరాబాదులో జరిగిన రేవ్ పార్టీలో ఈగల్ టీం కు రెడ్ హ్యాండెడ్ గా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పట్టుబడటం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే సిగ్గుమాలిన చర్య అని భరత్ ఘాటుగా విమర్శించారు. చట్ట సభలలో కూర్చుని చట్టాలు చేయాల్సిన వారే డ్రగ్స్, కొకైన్ వంటి అనైతిక చర్యలకు పాల్పడటం.. ఆ పైన అరెస్టు కావటం ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠకే మాయని మచ్చ అని వ్యాఖ్యానించారు. తెలుగు దేశం పార్టీ ఇటువంటి ప్రజా ప్రతినిధులను అందలం ఎక్కించడం ఆ పార్టీ సిద్ధాంతాలు, నీతి, నిబద్ధత ఎటువంటివో అర్థమవుతోందన్నారు. ఈగల్ టీం నిర్వహించిన పరీక్షలలో తెలంగాణ ప్రతినిధులతో పాటు మహేష్ కుమార్ యాదవ్ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లుగా స్పష్టమైశదన్నారు. ఈ విషయంలో ఈగల్ టీం, ఇతర పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి రాజకీయ పరమైన ఒత్తిళ్లకు లొంగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండు చేశారు. ఉమ్మడి రాష్ట్రాలలో కలకలం రేకెత్తించిన ఈ సంఘటన విషయంలో కూటమి ప్రభుత్వం ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కనీసం మాత్రంగా అయినా స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం సన్నగిల్లినట్లు అర్థమవుతోందన్నారు. వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ ను టీడీపీ నుంచి తొలగించాలని, అలాగే ఎంపీ పదవికి రాజీనామా చేయించాలని భరత్ డిమాండు చేశారు.

### ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలకు మంచి వైద్యసేవలతో పాటు

## ఫ్రీ డెలివరీలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి

- ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్యసేవలుపై ప్రజలకు సంతృప్తిస్థాయి పెరగాలి
- ప్రభుత్వ హాస్పటల్ నుండి ఏ ఒక్క ఫిర్యాదు వచ్చినా శాఖాపరమైన చర్యలు తప్పవు.
- జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు, బాలింతలు వార్డులను ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి





**ఏలూరు, మార్చి 15(మనసులో మాట)..** స్థానిక జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం హై-డిపెండెన్సీ యూనిట్, డెలివరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, గైనకాలజీ వార్డు, పోస్టు ఆపరేటివ్ వార్డు, బాలింతలు వార్డు, తదితర వార్డులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు చేశారు. గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టరు మాట్లాడారు. హాస్పటల్లో వైద్యసేవలు ఏలాగ ఉన్నాయని, డాక్టర్లు, వైద్య సిబ్బంది బాగా చూస్తున్నారా, సమయానికి మందులు ఇస్తున్నారా, టైమ్ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని అడగగా మాకు వైద్యసేవలు బాగానే అందుతున్నాయని, మాకు ఏటువంటి ఇబ్బందులు లేవని వారు చెప్పడంతో జిల్లా కలెక్టరు సంతృప్తిని వ్యక్తం చేశారు. డాక్టరు ఎన్టీఆర్ వైద్య సేవ హెల్ప్ డెస్క్ కంప్యూటరు డేటాను పరిశీలించి, వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలకు మంచి వైద్యసేవలతో పాటు ఫ్రీడెలివరీలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవలుపై ప్రజలకు సంతృప్తి స్థాయి పెరగాలని, వచ్చిన ప్రతి పేషెంటును చిరునవ్వుతో పలకరించి వైద్యసేవలు అందించాలని అన్నారు. ఏ ఒక్క ఫిర్యాదు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలు ప్రసవాలు పెరిగే విధంగా గైనకాలజిస్టు, వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఏటువంటి డేటా, వివరాలు కోసం సమయం వృధా చేయకుండా తక్షణమే వైద్యులు వైద్యసహాయం అందించాలని అన్నారు. సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రుల లో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని, సిజేరియన్ల శాతం తగ్గే విధంగా డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులుపట్ల మర్యాదగా వ్యవహరించాలని, పరిశుభ్రమైన వాతావరణ ఉండాలని, వార్డులలో బెడ్ షీట్స్ ఎప్పటికప్పుడు మార్చే విధంగా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

## ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

**-బకర్ కసబ్ తబ్లీగీ మర్కస్ మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** ముస్లింలు అత్యంత పవిత్రంగా కొలిచే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే వారికి ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు పుణ్యకార్యం అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ముస్లిం మైనారిటీల ప్రముఖ నాయకులు మహ్మద్ అబ్దుల్లా ఆధ్వర్యంలో జెండా పంజా రోడ్డులోని బకర్ కసబ్ తబ్లీగీ మర్కస్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అబ్దుల్లా, ముస్లింలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పండ్లు, ఫలాలు ఇచ్చి ఉపవాసాన్ని విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రంజాన్ మాసంలో అబ్దుల్లా ఇక్కడ ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో తన సోదరులు ముస్లిం మైనారిటీలతో కలసి పాల్గొనడం తనకు సంతోషంగా ఉంటుందని... అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని, ఇఫ్తార్ విందు పుణ్యకార్యంగా భావిస్తున్నామన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనల్ని ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ముస్లింల షాధి ఖానా కోసం స్థలం కేటాయించి దాని నిర్మాణానికి సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా అబ్దుల్లా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ను కోరారు. మైనార్టీల సంక్షేమానికి ఆదిరెడ్డి వాసు ఎల్లవేళలా అండగా ఉంటున్నారని... రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ ఆదుకుంటోందన్నారు. నగరంలోని మసీదులు, షాధి ఖానాలకు, ముస్లిం బరియల్కు ఎమ్మెల్యే వాసు ఇప్పటికే సమర్ధవంతమైన కమిటీలు నియమించినట్టు తెలిపారు. అన్ని విషయాల్లోనూ ముస్లింలతో కలిసి ముందుకు నడుస్తామని అన్నారు. కాగా ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే మున్సిపల్ కార్మికుల మహా ప్రదర్శన- బహిరంగసభ

- ఎర్ర తోరణాలతో ముస్తాబుయిన రాజమహేంద్రవరం
- సీపీఐ , ఏఐటీయూసీ రాష్ట్ర అధినేతలు రాక - పారిశుధ్య మహిళలకు రెడ్ సెల్యూట్






**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 6 వ రాష్ట్ర మహా సభలు సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలో మున్సిపల్ కార్మికుల మహా ప్రదర్శన, బహిరంగ సభ జరగనుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు తెలిపారు. రాష్ట్ర మహా సభలు ఈ నెల 16, 17, 18 తేదీలలో జరుగుతున్న సందర్భంగా ఆదివారం ఉదయం నుండి పారిశుధ్య కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఏఐటీయూసీ తోరణాలు, జెండాలు ఆయా కూడళ్లు వద్ద ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళా కార్మికులు స్తంభాలు ఎక్కి ఫ్లెక్సీలు కట్టారు. వారికి ఏపీ యూనియన్ రెడ్ సెల్యూట్ తెలియజేసింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 2: 30 గంటలకు స్థానిక మున్సిపల్ స్టేడియం నుండి కార్మిక ప్రదర్శన ప్రారంభం అవుతుందని, అక్కడ నుండి బైపాస్ రోడ్డు, చర్చి సెంటర్, జాంపేట గాంధీ బొమ్మ, గణేష్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్ స్టాండు మీదుగా సుబ్రహ్మణ్యం మైదానంలో బహిరంగ సభ జరగనుందని అన్నారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య, అఖిల భారత మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి రాధాకృష్ణన్ (కేరళ), జాతీయ ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్ (తమిళనాడు), తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం, ప్రధాన వక్తగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకట సుబ్బయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, కోశాధికారి కొండలరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ సుబ్బారాయుడు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సభకు యూనియన్ అధ్యక్షుడు ఏ రంగనాయకులు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ ఏర్పాటులో ఉపాధ్యక్షుడు ధనాల దుర్గమ్మ, ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు బంగారు గిరి, గూడుపు గిరి, కాకి శారద, మీసాల రమణ, సతీష్ దేవి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

**- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** నేడు (సోమవారం) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, అదే విధంగా డివిజన్ మండల కేంద్రంలో "మీకోసం" కార్యక్రమం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక), రెవెన్యూ క్లినిక్ యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అన్నారు. అలాగే నమోదైన అర్జీల ప్రస్తుత స్థితి తదితర వివరాల కోసం 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) కు నేరుగా కాల్ చేయవచ్చని ఆమె సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల స్థాయిలలో కూడా "మీ కోసం", రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ క్లినిక్‌కు హాజరవుతారని చెప్పారు. తహశీల్దార్లు తమ ప్రధాన కార్యాలయాల నుంచి హాజరై ప్రజల అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారన్నారు. అదే విధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో పరిశీలన కూడా జరుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో కూడా అర్జీలను స్వీకరించే ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రజలకు మరింత మెరుగ్గా పౌర సేవలను 95523 00009 వాట్సాప్ నెంబర్ ద్వారా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

## మమ్మల్ని అడిగే వాడెవడురా

**- రోడ్డును ఆక్రమిస్తాం..కాలువ పూడ్చేస్తాం - మాకు ఫుల్ పొలిటికల్ సపోర్ట్ ఉంది..**

**- ఆదర్శ నగర్ లో అధికారులతో వితండ వాదం**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** "ఎవరొచ్చినా, ఏమి చేసినా డోన్ట్ ఖేర్..అంతా మా ఇష్టం. మాకు ఫుల్ పొలిటికల్ సపోర్ట్ ఉంది" అంటూ విర్రవీగుతూ..మాట్లాడుతున్నారు ఆ ఇంటి యజమానులు. రాజమహేంద్ర వరం రూరల్ హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధి ఆదర్శ నగర్ లో ప్రధాన రహదారిని తమ ఇంటి సరిహద్దును సిమెంట్ తో కలిపేశారు. మంచిదేగా తప్పేముంది అనుకోవచ్చు. ఇక్కడే అసలు సమస్య. మురుగు నీరు పారే డ్రెయినేజీని పూర్తిగా మూసేసి, దానిపై సిమెంట్ గచ్చులా చేసేసి..ఎవరైనా ఇదేంటి అని ప్రశ్నిస్తే.. ఇటు కాలువ అక్కర్లేదని బుకాయింపు ఒకటి. గ్రామ పంచాయతీ సెక్రటరీ వచ్చి ప్రశ్నించినా, పంచాయతీ ఈఓ వచ్చి అడిగినా..అదే సమాధానం. పైపెచ్చు.. మాకు రాజకీయ అండదండలు ఉన్నాయి.. వాసు మాకు తెలుసంటూ బెదిరింపు ధోరణిలో వాగ్వాదానికి సిద్ధం పడుతుండటంతో.. చుట్టు పక్కల వారు పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు ఎప్పుడొచ్చినా ఇంటి యజమానులు కనబడరు..అంతా ఫోన్లోనే వాదన. ఇంట్లో ఉండి కూడా బయట ఎక్కడో ఉన్నామని చెబుతూ ముఖం చాటేస్తున్నారని ఆదర్శ నగర్ వాసులు చెబుతున్నారు. మరి ఈ విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.



# ఎల్పీజీ కొరతపై గందరగోళం

**- ప్రభుత్వ వైఫల్యంపై మండిపడ్డ ఆర్పీసీపీ అధినేత మేడా శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** ప్రస్తుతం ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయంలో దేశ వ్యాప్తంగా ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులపై రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఆర్పీసీపీ) అధినేత మేడా శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. ఒక వైపు ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి భయాందోళన అవసరం లేదని, ఎల్పీజీ సిలిండర్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెబుతుండగా, మరో వైపు అనేక ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందని డీలర్లు చెప్పటం ప్రజల్లో తీవ్ర అనుమానాలు, భయాందోళనలు కలిగిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ప్రకటనలు ఒకలా ఉండగా, స్థానికంగా జరుగుతున్న పరిస్థితులు మరోలా ఉండటం వల్ల ప్రజలు ఏది నమ్మాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని మేడా శ్రీనివాస్ విమర్శించారు. కొన్ని ఎల్పీజీ డీలర్లు గ్యాస్ కొరత పేరుతో సరఫరా ఆలస్యం చేయటం, అలాగే సోషల్ మీడియా వేదికలలో కూడా కొరత ఉందని ప్రచారం జరగటం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేడా అన్నారు. ప్రభుత్వం నిజంగా గ్యాస్ సరఫరా సమృద్ధిగా ఉందని చెబితే, ఆ సరఫరా ప్రజలకు సకాలంలో అందేలా పర్యవేక్షణ ఎందుకు చేయలేకపోతుందో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థలో జరుగుతున్న లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దాలని, గ్యాస్ కొరత పేరుతో ప్రజలను భయపెట్టే డీలర్లు, తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. అదే విధంగా ఈ అంశంపై విజిలెన్స్ అధికారులు కూడా వెంటనే స్పందించి, గ్యాస్ సరఫరాలో జరుగుతున్న అవకతవకలు, కృత్రిమ కొరత సృష్టించే డీలర్లు, ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారాలపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మేడా శ్రీనివాస్ కోరారు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు కొనసాగితే సామాన్య ప్రజలు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రజలకు స్పష్టమైన సమాచారం అందిస్తూ, ఎల్పీజీ సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించటం ప్రభుత్వ బాధ్యత అని మేడా శ్రీనివాస్ అన్నారు.

# నేడు యధావిధిగా పీజీఆర్ఎస్

**- ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం**
**- కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలి**
**- కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగలి**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** ఈ నెల 16 వ తేదిన కాకినాడ జిల్లాలో పీజీఆర్ఏ కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు కాకినాడ కలెక్టరేట్ వివేకానంద కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లా స్థాయి అధికారులు అందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రాముఖ్యంగా న్యాయపరమైన సలహాలు, సూచనలు పొందేందుకు కాకినాడ కలెక్టరేట్ లో లీగల్ ఎయిడ్ క్లినిక్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొంద వచ్చన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీఖఎ. ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చుని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించ వచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పి కంపెనీ ప్రారంభం





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** గ్లాస్ తయారీ సంస్థ విశ్వ టఫ్ గ్లాస్ ఎలెల్పీ కంపెనీని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం సమీపంలోని ఇండస్ట్రియల్ కాలనీలో ఆదివారం ప్రారంభమైంది. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పీని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కేంద్రంగా ఇక్కడ ఏర్పాటు చేసిన గ్లాస్ తయారీ కంపెనీ ఈ ప్రాంతంలోని నిర్మాణ రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. గతంలో గృహ, ఇతర అవసరాలకు అవసరమైన గ్లాస్‌ను విజయవాడ, విశాఖపట్నంల నుండి తెచ్చుకోవాల్సి వచ్చేదని, దీని వల్ల రవాణా ఖర్చులతో పాటు, సమయం కూడా వృధా అయ్యేదన్నారు. ఇక్కడ విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పీ కంపెనీ అందుబాటులోకి రావటం వల్ల రవాణా ఖర్చులు, సమయం కూడా ఆదా అవుతుందన్నారు. బిల్డర్లు సహకరించాలని అన్నారు. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పీ కంపెనీ ఎండీ సురేంద్ర మాట్లాడుతూ విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పి వల్ల ఇక్కడ బిల్డర్లు, ఆర్కిటెక్చర్లు, ఇంటీరియర్స్‌కు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. గ్లాస్ అనేది చాలా సున్నితమైన వస్తువని, దీని ట్రాన్స్‌పోర్టు అనేది చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు. దగ్గరలోని గ్లాస్ తయారీ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండటం వలన రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతుందన్నారు. విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పీ ద్వారా 45 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 1992 నుంచి ట్రేడింగ్‌లో ఉన్నామని, ఇప్పుడు ప్రొడక్షన్‌లో అడుగుపెట్టామన్నారు. ఇప్పటి దాకా ట్రేడింగ్‌లో ఉండటం వల్ల ఇక్కడ డీలర్ల, వినియోగదారుల అవసరాలు, అభిరుచులు తమకు బాగా తెలుసునని, వారి అభిరుచులకు అనుగుణమైన నాణ్యమైన ప్రొడక్టును అందించే విధంగా తమ సిబ్బందిని సన్నద్ధం చేయడం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి డీలర్‌కి, కస్టమర్‌కి పర్ఫెక్ట్ ప్రొడక్ట్ అందజేయగమని అన్నారు. ముడిసరుకు అంతా కూడా సెయింట్ గోబెన్, అసాయి వంటి మల్టీనేషనల్ కంపెనీస్ నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. ఫ్యాక్టరీని మరింత విస్తరించే ప్రణాళికలు ఉన్నాయన్నారు. స్టార్టప్ కంపెనీలకు మేక్ ఇన్ ఇండియాలో అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఇక్కడ ఈ ఫ్యాక్టరీ నెలకొల్పామన్నారు. బిల్డర్లు నుండి మంచి సహకారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ టఫ్ గ్లాస్ ఎల్ఎల్పి కంపెనీ పార్టనర్లు సాయి, హరి సాయి, శ్రీకాంత్, హేమంత్, నగరంలోని ప్రముఖ బిల్డర్లు, వ్యాపార వేత్తలు మన్యం ఫణి, తొంటెపు రామలింగేశ్వరస్వామి, వంకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరం

**- అవసరానికి మించి బుకింగ్ లు చేయొద్దు - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** జిల్లాలో గృహ అవసరాల వినియోగం కోసం, అలాగే విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు, అత్యవసర సేవలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు గ్యాస్ సిలిండర్లు గోకవరం, విశాఖపట్నం, విజయవాడలోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి ప్రతి రోజూ సాధారణ స్థాయిలో సరఫరా అవుతున్నాయని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో రోజుకు సుమారు 11,000 నుంచి 11,500 వరకు రీఫిల్ బుకింగ్ లు నమోదవుతూ ఉంటాయని, అయితే ప్రస్తుతం రోజు వారీగా 19,896 నుంచి 22,250 వరకు బుకింగ్ లు నమోదవుతున్నాయని తెలిపారు. అంటే సాధారణ పరిస్థితులతో పోలిస్తే దాదాపు 90 నుంచి 95 శాతం వరకు పెరుగుదల నమోదైందన్నారు. సిలిండర్ల డెలివరీలు ఎఫ్ఐఎఫ్ఓ విధానంలో కొనసాగుతున్నందున కొన్ని చోట్ల బుకింగ్ చేసిన తరువాత 2 నుంచి 3 రోజులలో డెలివరీలు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల అంతరాయం కారణంగా 2 నుంచి 3 రోజుల వరకు ఆలస్యం కనిపిస్తున్నదని వివరించారు. అందువల్ల గ్యాస్ సరఫరా విషయంలో వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి అవసరానికి మించి బుకింగ్ లు చేయకుండా, అవసరం మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కోరారు. గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్‌లో హెల్ప్‌లైన్ నెంబర్ 8074661259 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే వినియోగదారులు ఈ సేవను వినియోగించు కోవచ్చని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో రీఫిల్ బుకింగ్ లు చేయడం వల్ల కొన్నిసార్లు కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అందు వల్ల వినియోగదారులు ఆయిల్ కంపెనీలు ఇచ్చిన నెంబర్లకు వాట్స్ యాప్ ద్వారా మెసేజ్ పంపడం, మిస్డ్ కాల్ ఇవ్వడం, అలాగే ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమ్జాన్ పే వంటి యూపీఐ యాప్‌ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఏజెన్సీ వారీగా శనివారం నమోదైన బుకింగ్స్, డెలివరీలు, గత 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న వివరాలను పరిశీలిస్తే, ... ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) పరిధిలో శనివారం 3,355 బుకింగ్స్ నమోదు కాగా 2,100 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 7,232 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 1,544 ఉన్నాయి. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్పీసీ) పరిధిలో శనివారం 15,278 బుకింగ్స్ నమోదు కాగా 10,134 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 8,077 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 18,306 ఉన్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీ) పరిధిలో శనివారం 1,236 బుకింగ్స్ నమోదు కాగా 727 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 1,138 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్ 2,394 ఉన్నాయని తెలిపారు.

శనివారం రోజున మూడు ఆయిల్ కంపెనీల ద్వారా మొత్తం 19,869 బుకింగ్స్ నమోదు కాగా 12,961 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం మూడు సంస్థల వద్ద కలిపి 16,447 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 72 గంటలకు మించిన పెండింగ్ బుకింగ్స్ మొత్తం 22,244 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ బుకింగ్స్ త్వరితగతిన క్లియర్ చేయడానికి ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

## ప్రైవేటు విద్యా సంస్థల్లో
# విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

**- పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాలి**
**- ఉచిత విద్య, విద్యార్థుల, తల్లిదండ్రుల అసోసియేషన్ విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** కేంద్ర ప్రభుత్వం పేద పిల్లల విద్యాభివృద్ధికి తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థలు తప్పని సరిగా అమలు చేయాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము సత్తిబాబు, ఏ సుధీర్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో స్థానికంగా నగరంలో ఒక చర్చిలో తల్లిదండ్రులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు, చిన నారాయణ మీడియాతో మాట్లాడుతూ చట్టం అమలు చేయడంలో ప్రైవేట్ విద్యా సంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, సంబంధిత విద్యా శాఖ ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం అమల్లోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్నప్పటికీ, సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు వర్గాలు ప్రచారం చేయడం లేదని, అవగాహన లేక వేలాది మంది పేద కుటుంబాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేషన్ చొరవ తీసుకుని ఆన్ లైన్లో వెయ్యి రిజిస్ట్రేషన్లు చేయగలిగామని, మార్చి 10వ తేదీతో గడువు ముగిసిందన్నారు. ఈ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల కోనసీమ జిల్లాకు చెందిన మండపేట నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లాలో కలిసిందని, ఈ జిల్లాలో ఆన్ లైన్ పోర్టల్ లో ప్రైవేటు విద్యా సంస్థలు కనిపించడం లేదని ఈ సమస్యను మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. నగరంలో పెద్ద పెద్ద ప్రైవేటు విద్యా సంస్థలు సీట్లు ఇవ్వడం లేదని, ఇటువంటి విద్యా సంస్థల లైసెన్స్ లను, రాయితీలను ప్రభుత్వం రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు. విద్యా హక్కు చట్టం 12(1)సీ అమలు చేయని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల పై హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఏ సుధీర్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు 12(1) సీ సెక్షన్ ప్రకారం 25 శాతం అమలు చేయకపోవడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నష్టపోతున్నార న్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వారు కాలక్షేపం చేస్తున్నారని పేద వర్గాలను పట్టించుకోవడం లేదని, ఆవేదన చెందారు. ఉపాధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ స్థానిక డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మా సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మా నిర్ణయాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని, మాతో సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో వేలాది సీట్లు మిగిలిపోతున్నాయని, రకరకాల ఫీజుల పేరుతో యాజమాన్యాలు దోచుకుంటున్నారని, పేద వర్గాలు నష్టపోతున్నారని వాపోయారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసు గణేష్, తగరం సురేష్, అంబేద్కర్, తేజస్విని, దీవెన, దుర్గ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



# దళితులు, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన మహా నేత కాన్షీరామ్

**- 92వ జయంతి కార్యక్రమంలో మర్రి బాబ్జి, పట్నాల విజయ కుమార్ తదితరులు నివాళి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** దళితులు, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానేత కాన్షీరామ్ అని న్యాయవాది మర్రి బాబ్జి నివాళులర్పించారు. బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 92వ జయంతి తూర్పు గోదావరి జిల్లా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్వారీ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది మర్రి బాబ్జి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి బాబ్జి, పట్నాల విజయ్ కుమార్ మాట్లాడుతూ దళితులు, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన మహా నాయకుడు అని కొనియాడారు. కాన్షీరామ్ బహుజనుల కోసం ఎంతో తోడ్పడ్డారని, "ఓట్లు మావి సీట్లు మీవా" అనే నినాదం ప్రజల హృదయాన్ని బలంగా తాకిందన్నారు. చైతన్యానికి కారణమైందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాన్షీరామ్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జ్ ఇసుకపట్ల రాంబాబు, కేవీ భాస్కర్, కొంకి రమేష్, బీఎస్పీ రూరల్ ఇంచార్జ్ కొత్తపల్లి శేఖర్, మండా సుబ్రమణ్యం, మద్దా సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ పార్టీ
# ఘటనలో పట్టుబడటం రాష్ట్రానికి అవమానం

**- పుట్టా మహేష్ వెంటనే ఎంపీ పదవికి రాజీనామా చేయాలి**
**- డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం**
**- అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ఆరోపణ**



**అమలాపురం( మనసులోమాట) మార్చి15:** హైదరాబాద్ శివారులో జరిగిన డ్రగ్స్ పార్టీ ఘటనలో టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ తీసుకుని పోలీసులకు పట్టుబడటం రాష్ట్రానికి తీవ్రమైన అవమానం అని అమలాపురం మాజీ ఎంపి చింతా అనురాధ తీవ్రంగా విమర్శించారు. టీటీడీ మాజీ చైర్మన్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడైన పుట్టా మహేష్ ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ఎంపీ పదవిలో ఉండి డ్రగ్స్ పార్టీల్లో పాల్గొని డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ రావడం అత్యంత సిగ్గుచేటని ఆమె ఆరోపించారు. హైదరాబాద్ శివారులోని మాజీ ఎమ్మెల్యే ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్టు అందిన పక్కా సమాచారంతో ఈగల్ టీమ్, ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించగా కొకైన్, మద్యంతో పాటు గన్‌ను కూడా స్వాధీనం చేసుకోవడం, మఫ్టీలో ఉన్న పోలీసులపైకి కాల్పులు జరపడం ఈ ఘటన తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోందని ఆమె తెలిపారు. డ్రగ్స్‌ను కట్టడి చేస్తామని బీరాలు పలికే టీడీపీ నాయకులు ఇప్పుడు ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని చింతా అనురాధ ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను పూర్తిగా అరికడతామని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనిత ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ఆమె నిలదీశారు. స్వయంగా టీడీపీ ఎంపీ డ్రగ్స్ తీసుకుని పోలీసులకు పట్టుబడటం రాష్ట్ర చరిత్రలోనే ఎక్కడా లేని ఘటన అని ఆమె అన్నారు.

గౌరవప్రదమైన ఎంపీ పదవిలో ఉండి డ్రగ్స్ తీసుకునే వ్యక్తికి పార్లమెంట్‌లో చోటు ఉండదని, వెంటనే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని పుట్టా మహేష్‌ను డిమాండ్ చేశారు. అలాగే ఆయనను వెంటనే టీడీపీ నుండి సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అనురాధ డిమాండ్ చేశారు. ఈ ఘటన ఇప్పుడు జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశంగా మారి రాష్ట్ర పరువును దిగజార్చిందని ఆమె అన్నారు. సొంత ఎంపీలు కూడా డ్రగ్స్ బానిసలుగా మారే పరిస్థితి వస్తే ఆ పార్టీ పాలన గురించి ప్రజలు ఏం అనుకోవాలని ఆమె ప్రశ్నించారు. టీడీపీ అంటే ఇప్పుడు "తెలుగు డ్రగ్స్ పార్టీ"గా పేరు మారిందని అనురాధ తీవ్రంగా విమర్శించారు. డ్రగ్స్‌ను అరికట్టడంలో పూర్తిగా విఫలమైన ఈ కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఇందులో ఉన్న వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాజకీయ ప్రభావంతో కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయకుండా అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని చింతా అనురాధ డిమాండ్ చేశారు.

## జిల్లాలో గ్యాస్ సమస్యలుంటే
# వెంటనే సంబంధించండి

**- కలెక్టర్**



**ఏలూరు, మార్చి, 15(మనసులో మాట)..** జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేకుండా సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ చెప్పారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, సోషల్ మీడియాలో గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడనుందంటూ కొన్ని నిరాధారమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రజలు ఇటువంటి అవాస్తవాలను నమ్మి ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడటానికి మరియు ప్రజల గందరగోళాన్ని నివారించడానికి, ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, ఏలూరు లోని జిల్లా పౌరసరఫరాల అధికారి (ఱజూూ) వారి కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక "జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్" ను ఏర్పాటు చేయడం జరిగిందని, గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదురైనా, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా వినియోగదారులు వెంటనే కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఈ కంట్రోల్ రూమ్ ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 8:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ కు సంప్రదించవలసిన ఫోన్ నంబరు :7569296272 వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే కంట్రోల్ రూంకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## కాండ్రకోట నూకాలమ్మ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు



పెద్దాపురం ( మనసులో మాట) మార్చి 15; రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు సహాయ కమిషనర్ ముమ్మన రాంబాబు రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 17 నుండి మే 3 వరకు సుమారు 45 రోజులపాటు అమ్మవారి మహా జాతర ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగిళ్ళ ఉదయ శ్రీనివాస్, నూకాలమ్మ తల్లి ఆలయ పాలకమండలి, అధికారి యంత్రాంగం పుర ప్రముఖుల సహకారంతో నూకాలమ్మ తల్లి జాతర ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటులు చేపట్టడం జరిగిందన్నారు. ఆలయం వద్ద పెద్ద ఎత్తున చలువ పందిళ్ళ నిర్మాణం, క్యూలైన్ల ఏర్పాటు, భక్తుల కోసం మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. భక్తుల పాలిట ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన నూకాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి తరించాలని రాంబాబు రెడ్డి కోరారు. ఆలయ ప్రతినిధులు మోహన్ తదితరులు పాల్గొన్నారు

## స్వామి ప్రసాద్ కి తెలుగు యూనివర్శిటీ ఉగాది సత్కారం



**మండపేట (మనసులో మాట ) మార్చి 15..** మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ కవి రచయిత, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామి ప్రసాద్ ను సత్కరించారు. తెలుగు సాహిత్యంలో చేస్తున్న సేవలను గుర్తించి ఆదివారం బొమ్మూరు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు విశ్వవిద్యాలయం స్వర్ణ భారతి జాతీయ సాహిత్య కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సంగమం లో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి మునిరత్నం నాయుడు, సాహితిమిత్ర దొండపాటి రాజారావులు దుస్సాలువ, కిరీటం, జ్ఞాపిక, అభినందన పత్రం, తెలుగు మాలలతో స్వామి ప్రసాద్ ను సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ ను జన విజ్ఞాన వేదిక నవ్యాంధ్ర రాష్ట్ర ప్రథమ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు పెరవలి ఏసుబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నక్కిన వీర రాఘవరావు యూ. టి. ఎఫ్. పట్టణ అధ్యక్షులు పడాల రామచంద్రారెడ్డి తదితరులు అభినందించారు.

## రేపటి నుంచి రైతన్న మీకోసం వారోత్సవాలు

### మండల వ్యవసాయ అధికారి బి రవి



కపిలేశ్వరపురం మనసులో మాట మార్చి 15.. వ్యవసాయ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో సోమవారం నుంచి రైతన్న మీకోసం వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి. రవి తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కపిలేశ్వరపురం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలను తెలియజేస్తారన్నారు. 202627 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమాన్ని మండలంలోని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి రవి కోరారు.

# అక్కడ జనసేన ఉడుము పట్టుకోసం తీవ్ర ప్రయత్నాలు

- గిరిజనుల మనసుని ఆకట్టుకొని వై సి పి పార్టీ ని మట్టి కరిపించడమే జనసేన పార్టీ ధ్యేయం...
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యూహం - అందుకే పాడేరు లో జనసేన 13 వ ఆవిర్భావ దినోత్సవం
- మారు మనసులో పొందుతున్న గిరిజన ప్రజానీకం...
- వారి ఓటు బ్యాంకు ను తమ ఖాతాలో వేసుకునే వ్యూహం లోనే జనసేన ప్రయత్నం...



**కాకినాడ (మనసులో మాట)మార్చి 15 ..** గిరిజన ప్రాబల్యం ఉన్న విజయనగరం శ్రీకాకుళం విశాఖపట్నం తూర్పుగోదావరి జిల్లాల పూర్వపు నియోజకవర్గాలలో వైఎస్ఆర్ పార్టీ ప్రాబల్యం ఇంకా పోలేదు. అయితే ఆ ఓటు బ్యాంకు ని తమ వైపు తిప్పుకునేలా జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్ ఒక అడుగు ముందుకు వేసి ఆ ప్రాంతంలో పర్యటిస్తూ గిరిజనుల బాగోగులను తెలుసుకొని వారి అండగా నిలవడంతో పాటు ఆయా నియోజకవర్గల దృష్టి సాధించారు. అల్లూరి జిల్లా పాడేరు, విజయనగరం జిల్లా మన్యం, పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గాలపై జనసేన ఉక్కుపిడికిలి బిగిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దశలో జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు మన్య ప్రాంతాలలో మావోయిస్టు పార్టీ నక్సలైట్లు ప్రాబల్యం ఉండడం చేత ఆయా ప్రాంతాలలో అభివృద్ధికి నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలోనే నక్సలైట్లను మార్చి నెలాఖరుకి సమూలంగా నాశనం చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఉంటున్న ప్రముఖ నక్సలైట్లు అందరిని మట్టు పెట్టింది. వందల సంఖ్యలో నక్సలైట్లు ఈ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లలో మరణించడంతో ఆ పార్టీ పూర్తిగా మన్యంలో నశించిపోయినట్లుగానే భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాన్ని ఇప్పటికైనా అభివృద్ధి పథంలో నడిపించాలని ఉద్దేశంతో వారి బాగోగులను తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ గిరిజనుల కష్టాలను తెలుసుకుంటున్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తికా వస్తున్న మన్యం ప్రాంతాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయి.

రవి అస్తమించిన సామ్రాజ్యాన్ని తెల్లదొరలు భారతదేశ అన్ని 200 సంవత్సరాలు పాలించి ముఖ్యంగా విశాఖ తూర్పుగోదావరి జిల్లాల మన్య ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులను ఎన్నో అవస్థల గురి చేసి వారి శ్రమను దోపిడీ చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ధార బంధాల చంద్రయ్య అల్లూరి సీతారామరాజు వంటి విప్లవ యోధులు గిరిజనులకు భారతదేశానికి విముక్తి కలగాలని ఉద్దేశంతో తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాటాలు చేసి అసువులు బాసారు. అనంతరం జరిగిన పరిణామాలలో పీపుల్స్ వార్ గ్రూప్ నక్సలైట్లు మావోయిస్టులు పైలా వాసుదేవరావు గ్రూపుకు చెందిన నక్సలైట్లు ఆయా ప్రాంతాలలో తమ ప్రాబల్యాన్ని పెంచుకొని గిరిజన అభివృద్ధికి ఆటంకంగా నిలిచారు.

అయితే నిరుపేద గిరిజనులను ఆయా ప్రాంతాల్లో ఉండే భూస్వాములు వారిని దోచుకునే క్రమంలోనే గిరిజన ప్రాంతాలలో నక్సల్ బరి ఎర్పాడి ఆ యాత్ర ఇంతవరకు కొనసాగింది. గిరిజన ప్రాంతాల్లో లభించే ఖనిజ సంపద దోచుకునే క్రమంలో బూర్జువా కంపెనీలు ఏజెన్సీ ప్రాంతాలల్లో వారికి అవసరమైన విలువైన ఖనిజాలు గనులు లభించడంతో వాటిని ఏ విధంగా దోచుకోవాలనే క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తమ గుప్పెట్లో తీసుకొని బడా వ్యాపారులు చేసే దోపిడీకి అడ్డు తగులుతున్నారనే నెపంతో నక్సలిజాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై ఉక్కు పాదం మోపి మట్టికరించారు. మిగిలిన కొందరు నాయకులు దిగువ క్యాడర్ గల వారు ఇటీవల వందల సంఖ్యలో పోలీసులకు లొంగిపోవడం జరుగుతుంది.

ఇది ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్లోని తూర్పు కనుమలలో ఉన్న పూర్వపు విజయనగరం విశాఖపట్నం శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాలలోని మన్యం ప్రాంతాలలో ఉన్న నిరుపేద గిరిజనాన్ని అభివృద్ధి బాటలో పట్టించేందుకు జనసేన నాయకుడు కొణిదల పవన్ కళ్యాణ్ నడుంబిగించినట్లు ఆయా వర్గాల సమాచారం మేరకు తెలిసింది. పవన్ కళ్యాణ్ గిరిజన మనసును దోచుకుంటే వైసీపీ పార్టీకి ఆంధ్రప్రదేశ్లో ఉన్న తూర్పు కనుమల్లో ఆ పార్టీకి తీవ్రమైన దెబ్బ తగిలినట్టే. గతంలో టిడిపి పార్టీకి మన్యప్రాంతములో విపరీతమైన అభిమానం ఉండేది. అయితే ఆ ప్రాంతంలో అల్యూమినియం ఫ్యాక్టరీ నిర్మాణానికి గూడెం కొత్త వీధి వంటి ప్రాంతాల్లో ఉన్న ఆ గనులను త్రవ్వకాలు జరిపేందుకు ఆ పార్టీ బడా (జిందాల్ కంపెనీ) వ్యాపారస్తులతో చేతులు కలిపిందనే నెపంతో ఆ ప్రాంతంలోని అప్పట్లో ఉన్న నక్సలైట్ల పిలుపుమేరకు గిరిజనులు ఆందోళన చేపట్టి ఆ ఫ్యాక్టరీ నిర్మాణానికి అడ్డుగా నిలిచారు. అయినా జిందాల్ కంపెనీ నర్సీపట్నం కి కూత దూరంలోనే కోటవురట్ల వద్ద అల్యూమినియం ఫ్యాక్టరీని నిర్మించి దాదాపు దశాబ్ద కాలం పూర్తవుతుంది. అప్పట్లో గిరిజనులు ఆ ఫ్యాక్టరీని నడిపేందుకు ససేమిరా ఒప్పుకోలేదు. అయితే ప్రస్తుతం మన్యం ప్రాంతంలో పూర్తిగా తగ్గిపోవడంతో మరేమైనా కూటమి ప్రభుత్వం జిందాల్ కంపెనీ తో స్నేహస్తం కలుపుతుందో లేదో వేచి చూడాలి.

ఇటీవల కాలంలో జనసేన పార్టీ ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల పై దృష్టి సారించి గిరిజన మనోగతాన్ని తెలుసుకుంటూ వారి అభివృద్ధి నిమిత్తం రహదారుల నిర్మాణం ఉపాధి కల్పన ప్రజలకు విద్య వైద్యంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గిరిజన అభివృద్ధి ప్రత్యేక అజెండాగా దృష్టి పెట్టారు. ఆయా ప్రాంతాలలో జనసేన పార్టీ కార్యక్రమాల జోరు పెంచడం తోపాటు వారి కి వ్యక్తిగతంగా కూడా చేరువ అయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని కూడా గిరిజన తండాలలో స్వయంగా పార్టీ అధినేత అయిన పవన్ కళ్యాణ్ నిర్వహించారు. తద్వారా గిరిజనుల మనసు దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి తొలుత పిఠాపురంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని భావించారు.

కానీ అనూహ్యంగా పాడేరు వంటి గిరిజన ప్రాంతాలకు ఈ కార్యక్రమాన్ని మళ్లించారు. తాను కూడా స్వయంగా హాజరయ్యారు. ఈ వ్యూహాన్ని తక్కువగా అంచనా వేసేందుకు అవకాశం లేదు. బలమైన వైసీపీ ఓటు బ్యాంకును తన వైపు తిప్పుకొనే ప్రయత్నం లోనే పవన్ ఈ దిశగా అడుగులు వేస్తున్నారన్న చర్చ కొన్నాళ్లుగా వినిపిస్తోంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కకి మరోసారి టీ డి పి ఆ తర్వాత వైసీపీకి అనుకూలంగా ఎస్టీ సామాజిక వర్గాలు బలంగా నిలిచాయి.

ప్రస్తుతం టీడీపీకి సైతం గిరిజన ప్రాంతలలో ఉన్న నియోజకవర్గాల్లో తుడిచిపెట్టుకుపోయింది. వైసీపీ నాయకులు ఎవరైనా సరే విజయం దక్కించుకునే స్థాయికి గిరిజన ప్రాబల్య నియోజకవర్గాలు చేరాయి. ఒక్క ఈ నియోజకవర్గాలే కాదు. గిరిజనులు ఎక్కువగా ఉన్న జనరల్ నియోజకవర్గాల్లోనూ కూడా వైసీపీ పేరు మార్మోగింది. ఇప్పుడు దానిని తనదైన శైలిలో తనవైపు మళ్లించుకునేందుకు జనసేన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నదన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తుంది .

గిరిజన తండాల్లో రహదారుల నిర్మాణం నుంచి వ్యక్తిగతంగా ఆయా కుటుంబాలకు సాయం వరకు పవన్ కళ్యాణ్ శ్రద్ధ చూపిస్తున్నారు. తాజాగా పార్టీ ఆవిర్భావ సమావేశం నిర్వహించడం ద్వారా మరింతగా వారిని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పూర్తిగా వైసీపీకి మైనస్ అయ్యే అవకాశం ఎక్కువ శాతం కనిపిస్తుంది. అయితే ఏడు నియోజకవర్గాలే ఎస్టీలకు ఉన్నాయి కాబట్టి తమకు ఇబ్బంది లేదని వైసీపీ భావిస్తే అది పూర్తిగా పప్పులో కాలేసినట్టే అవుతుందని పరిశీలకులు వ్యాఖ్యా నేస్తున్నారు. గిరిజనులు అనేక నియోజకవర్గాల్లో ఉన్నారు. ఇకనుండి గిరిజనుల ఓటు బ్యాంకు ని జనసేన పార్టీ పూర్తిగా పొందే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నాయి. గిరిజనుల మనసును దోచుకుని వారి ఓటు జనసేన పార్టీకి ప్రభావితం కావడం ఖాయమని పలువురు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## నిత్యాన్నదానానికి భారీ విరాళాలు



**అయినవిల్లి (మనసులోమాట) మార్చి 15:** ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సోమవారం దర్శించుకున్న భక్తులు ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానికి భారీగా విరాళాలు సమర్పించారు అమలాపురం వాస్తవ్యులు చౌరత్ సుభాష్యా కుటుంబ సభ్యులు అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాద ట్రస్ట్ నకు రూ.10,116/- విరాళాన్ని సమర్పించినారు. అలాగే ఖమ్మం వాస్తవ్యులు నల్లమోతు శివ వారి కుటుంబ సభ్యులు అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాద ట్రస్ట్ కు రూ.10,116/- విరాళాన్ని సమర్పించారు. అమలాపురం రూరల్ బండారులంక వాస్తవ్యులు సాల లక్ష్మణ్ నాగ తేజ కుటుంబ సభ్యులు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాద ట్రస్ట్ కు రూ.25,000/- లు విరాళాన్ని సమర్పించారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెం గ్రామ వాస్తవ్యులు చిత్తూరి చాందిని గంగ కుటుంబ సమేతంగా అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి, అన్నప్రసాద ట్రస్టు రూ.50,001/- లు విరాళాన్ని సమర్పించినారు. అదేవిధంగా హైదరాబాద్ వాస్తవ్యులు మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ సురేష్ చంద్ర శృతి దంపతులు కుటుంబ సమేతంగా అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి, శ్రీ విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్ట్ కు రూ.10,116/- లు విరాళాన్ని సమర్పించినారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదా శీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించి శ్రీ స్వామి వారి చిత్రపటాలను అందజేసినారు.



## అమృత్ భారత్ రైలు ను జెండా ఊపి ప్రారంభించిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం, (మనసులో మాట) మార్చి 15 : భీమవరం రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవింద రావు, చీణూ కూటమి నేతలు, కార్యకర్తలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శ్రీనివాస వర్మకి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమృత్ భారత్ రైలు ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు అత్యున్నత సౌకర్యాలతో కూడిన హై-స్పీడ్ ప్రయాణాన్ని తక్కువ ధరకే అందించాలన్న ప్రధాని మోదీ సంకల్పమే ఈ అమృత్ భారత్ రైలు అని కొనియాడారు. భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు మీడియాతో మాట్లాడుతూ.. నరసాపురం పార్లమెంటు పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా వందే భారత్, అరుణాచలంకు ప్రత్యేక రైలు, అమృత్ భారత్ వంటి ఆధునిక రైల్వే సర్వీసులు తీసుకువచ్చిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కృషిని అభినందించారు.

### దాతృత్వం చాటుకుంటున్న దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారు

## పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్లు పంపిణీ



భీమవరం, (మనసులో మాట) మార్చి 15 : పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ భీమవరం మండలం అధ్యక్షులు పి అశోక్ పరీక్ష ప్యాడ్లు అందజేసినారు. ఈ దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సుమారు 12 ఏళ్లుగా అనేక ధార్మిక కార్యక్రమాలు చేస్తూ అందులో భాగంగా పేద విద్యార్థులకు పుస్తకాలు ప్రతి సంవత్సరం ప్యాడ్లు అందజేస్తూ వస్తుందని, ఈనాటి విద్యార్థి విద్యార్థులకు స్వదేశీ భావజాలం చాలా అవసరం అని, అలా లేకపోతే దేశ విద్రోహ శక్తులతో కలిసి దేశద్రోహులుగా మారే అవకాశం ఉందని అందువలన స్వదేశీ భావజాలం కలిగి దేశం పట్ల ప్రేమ అభిమానాలు కలిగి ఉండాలని అన్నారు. ఈనాటి విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్మించే పనిలో భాగస్వాములు కావాలని అందుకు చదివే ఉత్తమ మార్గం అని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం

- ప్రమాదాలను నివారిద్దాం...
- ట్రాఫిక్ ఎస్సై బివి సత్యనారాయణ



**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** రోడ్డుపై ప్రయాణాలు చేసేటప్పుడు కుటుంబ సభ్యులను తనకున్న బాధ్యతలను గుర్తుంచు కోవాలని తద్వారా వాహనాలను జాగ్రత్తగా నడపాలని వాహనదారులకు ట్రాఫిక్ ఎస్.ఐ బి.వి సత్యనారాయణ సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని లక్ష్యంతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ రమేష్ పర్యవేక్షణలో స్థానిక ఎం ఎస్ ఎన్ చార్జెస్ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలను చేపట్టి తల్లిదండ్రులు , వాహన యాజమానాలకు చట్టపరమైన నిబంధనలు విధించే శిక్షల పై వాహన దారులకు అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరి దగ్గర తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ఎస్సై బి. వి. సత్యనారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణ నష్టం ప్రమాదాలపై వాహనదారులకు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఆయన అన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులు, హెల్మెట్లు, సీటు బెల్ట్‌లు ధరించకుండా వాహనాలు నడిపే వారికి తొలుత అవగాహన కల్పించాలని, తర్వాత కూడా ఉల్లంఘనకు పాల్పడితే జరిమానా చలానాలు వేయడం జరుగుతుందని అన్నారు. అసలు ప్రమాదాలు మానవ తప్పిదాలు వల్లే అధికంగా జరుగు తున్నాయని, యువత రోడ్డు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండే ఉన్నత చదువులకు తొలిమెట్టైన పదో తరగతి పరీక్షలు ప్రారంభం

### - జిల్లా కలెక్టర్

**అమలాపురం(మనసులోమాట)మార్చి 15:** పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళనలను విడనాడి విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా ఆల్ ది బెస్ట్ శుభా కాంక్షలు తెలిపారు.10 వ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థిని విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్య మైన ఘట్టమని ఈ సమయంలో భయాందో ళనలకు లోనవ్వడం సహజమని అయితే సరైన ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు సాధించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టమైనా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకుని స్థిరప డాలనే ఆశతో ఎంతోమంది తల్లిదండ్రులు కష్టపడి చది విస్తున్నారన్నారు. విద్యా ర్థులు తల్లిదండ్రులు పెట్టు కున్న నమ్మకాన్ని రెట్టింపు చేసేలా ఫలితాలు సాధిం చాలన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదవ తరగతి పరీక్షలేనని తర్వాత ఈ పరీక్షలు పాస్ అయితే ఉన్నత చదువులు చదివేందుకు మార్గం సుగమం అవుతుంద న్నారు.ఈనెల 16 నుండి ఏప్రిల్ 1వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో జిల్లావ్యాప్తంగా 19,310 విద్యార్థులకు 108 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలుసూ చనలు చేశారు. విద్యా ర్థులలో భయాందోళనలను పోగొ ట్టేందుకు ప్రణాళి కాబద్ధమైన ప్రిపరేషన్ ఉండాలని అన్ని సబ్జె క్టులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఒక చదువుల ప్రణాళికను సిద్ధం చేసు కోవాలన్నారు. కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. చదివేటప్పుడు ముఖ్యాంశాలను ఒక దగ్గర రాసుకోవడం వల్ల రివిజన్ సమయంలో సులభంగా ఉంటుందన్నారు. పరీక్షల సమయంలో రాత్రంతా మేల్కొని చదవడం కంటే, కనీసం 6 గంటలు నిద్ర అవసరమని. దీనివల్ల మెదడు చురుగ్గా పనిచే స్తుంద న్నారు.జంక్ ఫుడ్ మానేసి. పండ్లు, ఆకుకూ రలు మరియు తగినంత నీరు తీసుకోవాల న్నారు. నేను బాగా రాయ గలననే ఆత్మవిశ్వాసాన్ని పెంచు కొని. ఫలితం గురించి ఆలో చించకుండా కేవలం చద వడం పైనే దృష్టి పెట్టాలన్నారు. నిరంత రాయంగా గంటల తరబడి చదవ కుండా, మధ్య మధ్యలో విరామం తీసుకోవాల న్నారు గత కొన్ని సంవత్సరాల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం వల్ల పరీక్షా విధానంపై అవగాహన పెరిగి మరి యు సమయపాలన అలవడుతుందన్నారు తల్లి దండ్రుల పిల్లలపై అతిగా ఒత్తిడి తీసుకురావద్దనీ అన్నారు. వారిని ఇతర విద్యార్థు లతో పోల్చకుం డా, వారికి ధైర్యాన్ని నింపాలన్నారు. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలనీ పరీక్షలు మేధస్సుకు ఒక పరీక్ష మాత్రమేనని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయా లన్నారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు అనగానే భయప డాల్సిన అవసరం లేదని ఇది మీ విజ్ఞానాన్ని ప్రదర్శించే ఒక చక్కని అవకాశం మాత్రమే నన్నారు. ముఖ్యమైన అంశాలను పదే పదే రివిజన్ చేయాలన్నారు. విద్యార్థులు ఎంతో ప్రతిభా వంతులుగా పట్టుదల, కష్టపడే తత్వంతో కోనసీమ జిల్లాను రాష్ట్రం లోనే ప్రథమ స్థానంలో నిలబెట్టాలన్నారు. మీ వెనుక మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు మరియు జిల్లా యంత్రాం గం అండగా ఉంటుంద నీ.కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని పట్టుదల ఉంటే విజయం మీ సొంతమవుతుందన్నారు.

## నేడు పిజిఆర్ఎస్



**పిఠాపురం, ( మనసులో మాట ) మార్చి 15:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమం ఈరోజు పిఠాపురం పట్టణంలో పాత బస్టాండ్ వద్దగల పాడా కార్యాలయంలో జరుగుతుందని ప్రాజెక్టు డైరెక్టర్ పి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన కార్యక్రమంలో అర్జీదారులు వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందించవచ్చునని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ పిజిఆర్ఎస్ కి నేరుగా హాజరు కాలేని వారికోసం ఆన్లైన్ లో అర్జీలు నమోదు చేసుకునేందుకు సదుపాయం ఉన్నట్లు తెలిపారు. ఆన్లైన్ లో మీకోసం ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## జి. అచ్చంపేట పొలాల్లోనే పెద్ద పులి సేద తీరుతోందా...?

### - పట్టుకునేందుకు అవస్థలు పడుచున్న అటవీ శాఖ అధికారులు





**కాకినాడ (మనసులో మాట )మార్చి 15..** ప్రత్తిపాడు మండలం లోని గిరిజన గ్రామాల మీదుగా శంఖవరం మండలంలోని గిరిజన ప్రాంతానికి తరలి వచ్చిన పెద్ద పులి జి. అచ్చంపేట గ్రామం లోని పొలాల్లో గడిచిన రెండు రోజులుగా సేద తీరుతున్నట్లు కనబడుతుంది. ఎందుకంటే పచ్చని పొలాలు, అటవీ ప్రాంతం, సువిశాలమైన పెద బాపన్నదొర చెర్వు సేద తీరేందుకు పెద్ద పులికి అనువుగా ఉండొచ్చని, అందువల్లే ఈ గ్రామంలో రెండు రోజులుగా ఉండిపోయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పెద్ద పులిని పట్టుకునేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుండి తరలివస్తున్న అటవీ శాఖ అధికారులను అవస్థలకు గురిచేస్తుంది. పెద్ద పులికి జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్ అమర్చి ఉండడంతో అది ఏ ప్రాంతంలో ఉన్నదనే సమాచారం మాత్రం ఎప్పటికప్పుడు అధికారులకు అందుబాటులోకి వస్తుంది. పెద్దపులిని బంధించాలనే లక్ష్యంతో శనివారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బిఎన్ఎస్ మూర్తి, కాకినాడ డిఎఫ్ఓ రామచంద్రరావు, ఏలేశ్వరం రేంజర్ దుర్గా రామ్ ప్రసాద్, శంఖవరం, రౌతులపూడి సెక్షన్ అధికారులు జి నాగేశ్వరరావు, శ్యామ్ కుమార్ తమ సిబ్బంది, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పులిని బంధించే నైపుణ్యులతో కలిసి జి అచ్చంపేట పొలాలు, సమీపాన గల అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టుచున్నారు. జి అచ్చంపేటలో 3 బోనులు సిద్ధం చేసి ఉంచినట్లు సెక్షన్ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొందరు అధికారులు ప్రజలను బయటకు, పొలాలకు వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకుంటుండగా, మరికొందరు పులిని బంధించేందుకు పొలాలకు తరలి వెళ్లారు. ఏది ఏమైనప్పటికీ ఒక ప్రక్కన అటవీ శాఖ అధికారులను, మరో ప్రక్కన ప్రజలను నిద్ర, హారాలకు దూరం చేస్తుంది. అటవీ శాఖ అధికారులు కృషి ఫలించి పెద్ద పులి తొందరగా దొరకాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## విశ్వసనీయత కు మారుపేరు... మండపేట లో రికార్డు సృష్టించిన ధీరులు

### వైసిపి కౌన్సిలర్ లకు ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో సత్కారం - ముగుస్తున్న కౌన్సిల్ పదవి కాలం



**మండపేట (మనసులో మాట ) మార్చి 15..** సరిగ్గా ఐదేళ్ల క్రితం మండపేట చరిత్ర ను తిరగ రాసి టిడిపి కంచు కోట లాటి పురపాలక సంఘం ను ధీరులైన వైసిపి అభ్యర్థులు చేజిక్కించుకున్నారని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. విశ్వసనీయతకు విధేయతకు మారుపేరైన మండపేట వైఎస్ఆర్సీపీ కౌన్సిలర్ లను ఆయన ఆదివారం సత్కరించారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయం లో జరిగిన కార్యక్రమానికి చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి తో సహా 15 మంది వైసిపి కౌన్సిలర్ లను ఆయన అభినందించారు. ఈ నెల 17 తో కౌన్సిల్ పదవి కాలం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ 2021 – 2026 లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ వారి కలలను సహకారం చేశారని కొనియాడారు. మంచి సలహాలతో ముందుకు తీసుకెళ్లిన కో – ఆప్షన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారందరికీ జ్ఞాపికలను అందజేశారు. వైసిపి కౌన్సిలర్ లు పోతంశెట్టి ప్రసాద్, మెర్నేని ప్రభావతి సత్యం,మండపల్లి రవికుమార్, శెట్టి కళ్యాణి, మెండు బాపిరాజు, నాయుడు లక్ష్మి సౌజన్య అయ్యప్ప, ముక్కా లోవ లక్ష్మీ దలీయ్యా, ముక్కా మేరీ స్వరూప రాణి సుబ్రహ్మణ్యం, జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు,నీలం దుర్గా సత్తిబాబు, మొండి భవాని మురళి, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, ఏం ఎస్ శాంతి కుమారి లను సత్కరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వైసిపి కార్యదర్శి రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, ముమ్మిడివరపు బాపిరాజు, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, సిరిపురపు శ్రీనివాస్ , పెంకే గంగాధర్, తణుకు అశోక్ పాల్గొన్నారు.

## వినియోగదారుల రక్షణ చట్టం పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**కాకినాడ (మనసులో మాట )మార్చి 15..** సమాజంలో వినిమయం చేయబడే వస్తువులు లేదా సేవలను పొందే వ్యక్తి లేదా వ్యక్తుల హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల రక్షణ చట్టం ఏర్పడిందని దీనిపై అవగాహన పెంచుకోవాలని న్యాయవా ది, రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఉపయోగం కోసం వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేసిన వ్యక్తిని వినియోగదారుడు అంటామని అన్నారు. వినియోగదారుడు కొన్న వస్తువు నాణ్యత నిర్దేశించబడిన శ్రేణి కంటే తక్కువగా ఉంటే దాని వలన కలిగే ఆర్థిక ఇతర నష్టాలను ఆ వస్తువు తయారు చేసిన సంస్థ భరించాల్సి ఉంటుందన్నారు. ఆ సంస్థ ఆ నష్టాన్ని భర్తీ చేయకపోతే జిల్లా స్థాయిలో ఏర్పడిన వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కు వినియోగదారుడు ఫిర్యాదు చేస్తే న్యాయం లభిస్తుందన్నారు. ఆ విలువను బట్టి రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ లో అప్పీలు చేయవచ్చని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల స్థాయిలో 17 వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్లు ఏర్పడ్డాయని అన్నారు. వినియోగదారులకు నష్టం కలిగితే న్యాయవాదుల అవసరం లేకుండానే నేరుగా వినియోగదారుల వివాదాల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేయవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో కొమ్మూరి శ్రీనివాసరావు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, డాక్టర్ శిరీష ,ఆకేటి సత్యనారాయణ, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలింగి బాపిరాజు, ఆనాల సత్తిబాబు, పార్థసారథి, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో ముగ్గురు గల్లంతు ఒకరుమృతి, ఇద్దరు సురక్షితం..



**ముమ్మిడివరం( మనసులో మాట) మార్చి 15..** మరణించిన వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొన్న గ్రామస్తులు గోదావరిలో స్నానం చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. ఇద్దరు వ్యక్తులను స్థానికులు సురక్షితంగా రక్షించారు. ఒక వ్యక్తి మరణించారు. ముమ్మిడివరం మండలం అయినాపురంకు చెందిన ఒక వ్యక్తి మృతిచెందగా అతని మృతదేహాన్ని అంత్యక్రియల కొరకు అయినాపురం గోదావరిచెంతకు తీసుకువెళ్లారు. ఆదివారం అంత్యక్రియల అనంతరం గోదావరిలో స్నానమాచరిస్తూ ముగ్గురు గల్లంతుకాగా, ఇద్దరిని స్దానికులు రక్షించారు. మరొక యువకుడు మట్టపర్తి భానుప్రసాద్ (20) మృతదేహం లభ్యమయింది. అంత్యక్రియలకు వెళ్లినవ్యక్తి మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ఘటనపై ముమ్మిడివరం ఎస్సై డి. జ్వాలా సాగర్ ఘటనా స్థలంలో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడు మృతదేహాన్ని వెలికి తీయించారు. ఘటన స్థలంలో ఎస్సై తోపాటు టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తులు సాయి పర్యవేక్షించారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహణ





**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ నేరాల నివారణకు భాగంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేసి, భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యకలాపాలు, బెదిరింపులు, అక్రమ వసూళు ,,భూవివాదాల్లో జోక్యం చేసుకోవడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ కూడదని సూచించారు. పోలీస్ శాఖ వారి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఎవరైనా మళ్లీ నేరాలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. అలాగే సమాజంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులకు సహకరించాలని, చట్టానికి లోబడి జీవనం కొనసాగించాలని వారికి సూచించారు. అవసరమైనప్పుడు పోలీస్ స్టేషన్‌కు హాజరవుతూ పోలీసులకు సహకరించాలని కూడా తెలియజేశారు. జిల్లాలో నేరాల నివారణ ప్రజల భద్రత కోసం ఇటువంటి కౌన్సెలింగ్ కార్యక్రమాలను జిల్లా పోలీసు శాఖ తరచుగా నిర్వహిస్తుందని తెలిపారు.



## పరీక్షా కేంద్రాలను సందర్శించిన డీఆర్డీఏ పీడీ

**అయినవిల్లి మనసులోమాట మార్చి :15** గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది దీనిలో భాగంగా అక్షరాంధ్ర కేంద్రాలను ఏర్పాటు చేసి గత మూడు నెలల నుండి గ్రామాలలో చదువురాని,బడి మానేసిన వారిని గుర్తించి వారికి చదువు చెప్పటం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వెలుగు డి.ఆర్.డి.ఏ పీడి రాంబాబు అయినవిల్లి మండలంలోఉపాధి హామీ పథకం, విద్యాశాఖ, సచివాలయం మరియు ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఆదివారం అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం ఎగ్జామ్ సెంటర్ ను పరిశీలించారు. అదేవిధంగా అయినవిల్లి పూలతోటలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని అయినవిల్లి ఎంపీడీవో సరోవర్, విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు సందర్శించారు. వీరు వెంట డి ఆర్ డి ఏ వెలుగు ఏపిఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించి వారిని ప్రోత్సహించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం అనేది ఒక వ్యక్తికి నిర్దిష్ట కార్యకలాపాలు చేయడం కష్టంగా ఉండటమని అన్నారు. వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడం ఈ దినోత్సవ లక్ష్యమని అన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రతినెలా రూ. 6 వేలు చొప్పున పింఛను అందజేస్తుందని అన్నారు. అదేవిధంగా ఉగాది నుండి ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించ ను0దని అడబాల తెలిపారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్ ,రేలంగి బాపిరాజు, రాజా ఆకేటి సత్యనారాయణ బుద్ధరాజు సత్యనారాయణ రాజు చింతపల్లి సుబ్బారావు పార్థసారథి ఆనాల సత్తిబాబు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఆయిల్ పామ్ గెలల నాణ్యత ప్రమాణాలపై అవగాహనా సదస్సు



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 15..** జగ్గంపేట మండలం, జగ్గంపేట గ్రామంలో గల వెంకటా ప్రగడ శ్రీరామ్ మూర్తి పామాయిల్ తోటలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, పెద్దాపురం ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ గెలల కోత మరియు నాణ్యత ప్రమాణాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా పతంజలి ఫుడ్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డి. జి. మ్ ) ఎ.యస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల్లో గెలలను కోసేటప్పుడు నాణ్యత ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే కోయాలని, దానివల్ల గెలల బరువు, అధిక ఆదాయాన్ని రైతులు పొందుతారని,అలాగే దీనికి గెలలు కోసేవారు మరియు రైతులు సహకరించాలని, గెలలు కోసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, హార్వెస్టర్స్ చిన్నపాటి సమస్యలను తెలుసుకోని కంపెనీ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పడం జరిగింది.అదేవిధంగా నాణ్యతమైన పక్వానికి వచ్చిన గెలలను ఎలా కోయాలో అందరి సమక్షంలో అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో గెలలు కోసేవారు (హార్వెస్టర్స్ ) కంపెనీ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొనడం జరిగింది.

## సుంకరపాలెం గ్రామ కమిటీ కన్వీనర్ గా పలివెల రాము

### పలువురు అభినందనలు



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 15:** సుంకరపాలెం వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ కన్వీనర్గా పలివెల రామును ఏకగ్రీవంగా ఎంపికచేసారు. గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ కోసం విశేష సేవలు అందిస్తున్న పలివెల రామును గ్రామ కమిటీ కన్వీనర్గా ఏకగ్రీవంగా ఎంపికచేసారు. ఈ సందర్భంగా రామును నాయకులు దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. పార్టీని గ్రామస్థాయినుంచి అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని గోవిందకుమార్ కోరారు. ఈ సందర్భంగా రామును ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పార్టీ రాష్ట్ర నేత చింతలపాటి శ్రీనివాసరాజు, పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి, జడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, రాష్ట్ర నాయకులు కాశి లక్ష్మణస్వామి, వుంగరాల సంతోష్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, నాయకులు బొంతు సత్యన్నారాయణ, చింతాకుల శ్రీను, పెద్దిరెడ్డి శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## - ఇసుకలపేట ఏరియా, తుని టౌన్ పోలీస్ స్టేషన్





**కాకినాడ ( మనసులో మాట ) మార్చి 15..** డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ పర్యవేక్షణలో, కాకినాడ జిల్లా ఎస్పి జి. బింధు మాధవ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమం లో భాగంగా పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని తుని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుకలపేట ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

పెద్దాపురం సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో తుని టౌన్ సీఐ గీతా రామకృష్ణ సిబ్బంది కలిసి అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లు, వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 120 మంది వ్యక్తులను, 36 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 4 వాహనాలను స్వాధీనం చేసుకుని తుని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నేరాలకు సంబంధించిన వాహనాలు లేదా అక్రమ ఆయుధాలు గుర్తించబడలేదు. పాత కేసుల్లో పరారీ ముద్దాయిలు ఎవరూ పట్టుబడలేదు.

ఈ సందర్భంగా రౌడీ షీటర్లు అనుమానిత వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అలాగే గ్రామ పెద్దలు, యువతకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలని పోలీసు అధికారులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచ బడతాయని తెలిపారు. మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు - ఎస్వీఎస్ఎన్ వర్మ



**పిఠాపురం,(మనసులో మాట) మార్చి 15 :** పిఠాపురం పట్టణం 24వ వార్డులో మస్తాన్ నవాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఈ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం సోదరులు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీకి, తమకు అండగా ఉంటున్నారని, వారికి ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని పలువురు నిరుపేదలకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు బొజ్జా సతీష్, షేక్ యాసిన్, మొల్లి మరిడిరాజు, వియ్యపు రమణరాజు, మాజీ కోఆప్షన్ మెంబర్ బాషా, చెల్లూరు అశోక్, సోము సత్యనారాయణ, అల్లవరపు నగేష్, అద్దూరి శ్రీను, సురవరపు సుబ్బారావు, రావుల రమేష్, అందుగుల సత్తిబాబు ఇతర పార్టీ కార్యకర్తలు, ముస్లిం సోదరలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు ఏర్పాట్లు పరివేక్షించిన ఎస్ఐ జ్వాల సాగర్



**ముమ్మిడివరం( మనసులో మాట) మార్చి 15..** ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామానికి మురమళ్ళ నుండి కర్రివాని రేవు గ్రామానికి వెళ్లే రహదారి ప్రధాన కూడలిలో గాడిలంక గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ రావి సూర్య ప్రకాష్ ఆర్థిక సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల గాడిలంక బాబా నగర్ కు చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీ ని ధ్వంసం చేయడం తో గ్రామస్తులు దాతలు సహకారాన్ని కోరడం జరిగింది. ఆదివారం ముమ్మిడివరం ఎస్సై డి జోలసాగర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు జరిగింది. అనంతరం సిసి కెమెరాలు పనిచేసే తీరును ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జ్వాలా సాగర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ దేవాలయాలు వద్ద, జాతీయ నాయకులు విగ్రహాల వద్ద గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేషనల్ హైవే 216 నుండి సమీప మురమళ్ళ నుండి గాడి లంక, కర్రివాని రేవు రహదారులపై ఆకతాయిలు తిరుగుతున్నారన్నారు. బంగారం రేటు పెరగడంతో మహిళలు నుండి బైక్ పై వచ్చి సులువుగా బంగారాన్ని లాక్కుంటున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలు వల్ల గ్రామాల్లో కి ఎవరు వస్తున్నారు పోతున్నారో సులువుగా తెలుసుకోవచ్చు అన్నారు. గాడిలంక గ్రామం తో పాటు కర్రివాని రేవు, బ ా ర ం గ ు ప ే ట , కొత్తలంక గ్రామాల్లో కూడా గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే సూచించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాత రావి సూర్యప్రకాష్ ని ఎస్సై జ్వాల సాగర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తలంక ఐదు గ్రామాల అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు కాశి జగపతిరావు, ఎం. వి. సూర్జం, నేరేడుమిల్లి సుదర్శన్ తోపాటు గాడిలంక గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉత్తర పాలెం స్కూల్ నందు సరస్వతి దేవి విగ్రహా ఆవిష్కరణ

**ఉండి, మనసులో మాట) .మార్చ్ 15 :** ఉండి మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉత్తర పాలెం స్కూల్ నందు సరస్వతి దేవి విగ్రహ ఆవిష్కరణ జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, మరియు జిల్లా గ్రంధాలయ చైర్మన్ జుత్తిగ రాజు దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమము ఎంతో ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్,అధ్యక్షతన జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ మరియు పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స వెంకట సత్యనారాయణ రాజు,జిల్లా విద్యాశాఖ అధికారి వారు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలను ఎంతో అభివృద్ధి పథంలో నడిపించిన సత్యనారాయణ రాజు సేవలను కొనియాడారు. కార్యక్రమం అనంతరం సత్యనారాయణ రాజును, జిల్లా విద్యాశాఖ అధికారి,



గ్రామ పెద్దలు, గ్రంధాలయ చైర్మన్ జుత్తిగ నాగరాజు, చేతులమీదుగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఉత్తర పాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో పేద విద్యార్థులకు వారి భవిష్యత్తులో పదవ తరగతి వరకు చదువుకొనుటకు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమం జిల్లా విద్యాశాఖ అధికారి మరియు ప్రజా ప్రతినిధులు మరియు వివిధ పాఠశాల ఉపాధ్యాయచ్చే ఘనంగా నిర్వహించారు.



# ఆర్థికంగా స్థితి మంతులైన ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

## నారా లోకేష్ యోజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు పిలుపు

**కాకినాడ (మనసులో మాట ) మార్చి 15..** ఆర్థికంగా స్థితిమంతులైన ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు పిలుపు నిచ్చారు.స్వర్గీయ దాట్ల సత్యనారాయణ రాజు పద్మావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె ఏర్పరచిన ఐదు కేజీల రైస్ బస్తాలు పేదలకు చీరలు అదేవిధంగా అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా 1415వ రోజు పేదలకు భోజనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు చేసే సేవలు పరమావధిగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ తరఫున నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్య ప్రసాద్, ప్రత్తిపాడు అధ్యక్షుడు అడపా జగదీష్, మహిళా అధ్యక్షురాలు పొట్లూరి సత్యవతి, సభ్యులు కాలాడి వెంకటేష్ పేర్ల సత్తిబాబు,కర్రి వీరబాబు, మండపాక వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గణాంక కార్యాలయ నూతన భవన సముదాయం ప్రారంభోత్సవం

## - అదనపు డైరెక్టర్ జనరల్ సునీత భాస్కర్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనీ జాతీయ గణాంక కార్యాలయం క్షేత్ర కార్యకలాపాల విభాగం , కాకినాడ నూతన భవనం సముదాయాన్ని ఆ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ సునీత భాస్కర్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక సాల్ట్ కమిషనర్ ఆఫీస్ కాంపౌండ్ జన్మభూమి పార్క్ రోడ్ లో నిర్మించిన నూతన భవన ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక దక్షిణ భారత దేశం లోనే మొట్ట మొదటి సొంత భవనాన్ని కలిగిన ఏకైక కార్యాలయం అని ప్రశంసించారు. 2009 నుండి భవన నిర్మాణ దిశగా ఎంతో ప్రయాస పడినప్పటికిని 2026 నాటికీ కొత్త భవనం సాకరం కావడం అభినందనీయమన్నారు. సిబ్బంది ఉత్సాహంగా పనిచేయటమే కాకుండ కార్యాలయ భవనాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. జోనల్ హెడ్ శ్రీ అనుపమ్ లాహిరి మాట్లాడుతూ భవన నిర్మాణ నికి రిటైర్డ్ అధికారి అయిన కిరణ్ కుమార్ చేసిన కృషిని కొనియాడారు. అదేవిధంగా రిటైర్డ్ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి తన హయాంలో చేసిన అన్ని ప్రయత్నాలు వివరించారు. ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారుల కృషిని కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమలలో భాగంగా కూచిపూడి నృత్యాలు సీనియర్ స్టాటిస్టికల్ అధికారి కృపానిది కవిత అందరిని అలరించాయి.



# ప్రమాదంలో ఉన్న వంతెన

## శిధిలావస్థలో ఉన్న వెదురుమూడి వంతెన

**కపిలేశ్వరపురం (మనసులో మాట ) మార్చి 15..** తూర్పుగోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామ ప్రధాన రహదారి మార్గం లో ఉన్న కాల్వ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడో బ్రిటిష్ హయం లో నిర్మించిన ఈ వంతెన క్రింది భాగం మొత్తం పెచ్చులు ఊడిపోయాయి. మరో పక్క వంతెన భీమ్ కాల్వ లోకి కుంగి పోయింది. తాత్కాలిక ఏర్పాటు లో భాగంగా ఇసుక, బస్తాలు వేసి మరింత దిగిపోకుండా వేశారు.ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రయాణికులు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. కపిలేశ్వరపురం మండలంలో ఉన్న గ్రామాల నుండి మండపేటకు వెళ్లే ప్రధాన రహదారి మార్గం మధ్యలో ఈ వెదురుమూడి మురికి కాల్వ వంతెన ఉంది. నిత్యం వందలాది భారీ వాహనాలు ఓ.ఎన్.జి.సి. కి చెందిన బరువైన భారీ వాహనాలు ఈ వంతెన పై నుండే ప్రయాణం సాగిస్తూ ఉంటాయి. ఈ వంతెన శిధిలావస్థలో ఉన్నప్పటికీ ఇంతవరకు ఏ అధికారులు పట్టించుకునే దాఖలాలు లేవు కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని శిథిలావస్థలో ఉన్న ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని నియోజకవర్గం పాలకులను, అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

## కాకినాడ జిల్లా డ్రగ్స్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# మెగా రక్తదాన శిబిరం..




**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** కాకినాడ జిల్లా డ్రగ్స్ ట్రేడర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో యువసేన బ్లడ్ బ్యాంకు వారి సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కరుణ్ కుమార్ గుప్తా, మణిరాజ్, కృష్ణమూర్తి పాల్గొని రక్తదానం చేసిన అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసెంట్ గిరిధర్ గుండు మీడియాతో మాట్లాడుతూ మా అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ముందు ముందు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించడానికి మా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు స్టేట్ సెక్రటరీ గుప్తా, స్టేట్ ట్రెజరర్ శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ సాయిరాం సత్యనారాయణ, సురేష్, హనుమంతు అసోసియేషన్ సభ్యులు భారీ ఎత్తున పాల్గొని మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు.

## మండపేట లో ఆలయాల వద్ద చోరీలు

# పోలీస్ కేసులు నమోదు



**మండపేట (మనసులో మాట ) మార్చి 15..** మండపేట టౌన్ లో రెండు ప్రదేశాల్లో బంగారు నగలు, నగదు దొంగతనాలు జరిగాయి.మండపేట బూరుగుంట చెరువు వద్ద ఉన్న శ్రీ సీతా రామ క్షేత్రం మూడు ఆలయాల సెంటర్ దగ్గర ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వినాయకుని ఆలయ అర్చకులు, ధర్మకర్త ధ్వజస్తంభం ఏర్పాటు వద్ద ఉండగా వినాయకుని ఆలయం అర్చకులు గుడి లోపల పెట్టిన మొబైల్ ఫోను స్టీల్ బాక్స్ లో ఉంచిన రూ ఆరు వేలు రూపాయలు నగదు, అక్కడే లక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారి మెడలో ఉన్న ఐదు గ్రాముల బంగారం చైను 10 గ్రాముల మంగళ సూత్రాలు గుర్తు తెలియని చోర్లు దొంగలించుకు పోయారనీ ఇన్ ఛార్జ్ సి ఐ దొర రాజు తెలిపారు. ఈ క్రమంలో మండపేట సైదల్లి పేటలో కొత్తగా నిర్మించి ప్రారంభిస్తున్న రామాలయం వద్ద మహిళ మెడలోని బంగారు చైను మంగళ సూత్రాలు కలిపి 29 గ్రాములు మరొక మహిళా మెడలోని ఆరు గ్రాముల రెండు మంగళ సూత్రాలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా ఈస్ట్ జోన్ డిఎస్పీ బి విద్య , మండపేట రూరల్ సిఐ దొర రాజుఆదేశాల మేరకు మండపేట టౌన్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కుటుంబరావుకు ఉగాది సాహితీ పురస్కారం




**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 15:** విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు యడ్ల కుటుంబరావు ఉగాది సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం అంబాజీపేటలోని ఎర్రాప్రగడ సూర్య ప్రకాశరావు కల్యాణ మండపంలో జరిగిన 165వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమంలో స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ సూపరెంటెండెంట్ ఆఫ్ పోలీస్ కొండా నరసింహారావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు కుటుంబరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాలలో సేవలకు సంబంధించి కవిగా, రచయతగా, న్యాయవాధిగా, బౌద్ధ వివాహకర్తగా విశేష సేవలు అందిస్తున్నందుకుగానూ ఈ అవార్డు ప్రధానం చేసినట్లు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# నిరంతర గ్యాస్ సరఫరా

- ప్రజలు ఆందోళన చెందవద్దు....
- బుకింగ్ చేసిన వారికీ ప్రాధాన్యత క్రమంలో డెలివరీ
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ (మనసులో మాట) మార్చి 15..** కాకినాడ జిల్లాలో గృహ అవసరాల కోసం, అలాగే విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు మరియు అత్యవసర సేవల కోసం ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. కాకినాడ జిల్లాకు ఐఓసీ గ్యాస్ సిలిండర్లు విశాఖపట్నం నుండి, హిందుస్థాన్ పెట్రోలియం గ్యాస్ సిలిండర్లు తూర్పు గోదావరి జిల్లా గుమ్మల దొడ్డి, విశాఖపట్నం నుండి, బిపిసిఎల్ గ్యాస్ సిలిండర్లు కాకినాడ పోర్టు నందున్న బాట్లింగ్ ప్లాంట్ నుండి ప్రతిరోజూ సాధారణ స్థాయిలో సరఫరా అవుతున్నాయని తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ జరుగుతోందని అన్నారు. ఆదివారం వరకు జిల్లాలో 75,862 వినియోగదారులు రీఫిల్ బుకింగ్స్ నమోదు చేసుకున్నారని, ఈరోజు 14,392 సిలిండర్ల డెలివరీ పూర్తయిందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 61,470 వినియోగదారులకు 3 లేక 4 రోజుల్లో డెలివరీ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. రీఫిల్ బుకింగ్లు సాధారణ స్థాయికంటే ఎక్కువగా నమోదవుతున్నాయని, సిలిండర్ల డెలివరీలు ఎఫ్ ఐ ఎఫ్ ఓ (ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ ) విధానంలో కొనసాగుతున్నాయని తెలిపారు.

గ్యాస్ వినియోగదారులు తప్పుడు ప్రచారాన్ని నమ్మి అవసరానికి మించి రీఫిల్ బుకింగ్లు చేయకుండా, అవసరం మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్‌లో హెల్ప్‌లైన్ నెంబర్ 8886903611 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సేవను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో రీఫిల్ బుకింగ్లు కావడం వల్ల కొన్నిసార్లు కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాంటి సందర్భాల్లో ఆయిల్ కంపెనీలు అందించిన నంబర్లకు వాట్సాప్ ద్వారా సందేశం పంపడం, మిస్డ్ కాల్ ఇవ్వడం, అలాగే ఫోన్ పే , గూగుల్ పే పే టీ ఎం అమెజాన్ పే వంటి యు పి ఐ యాప్‌ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటు లో ఉందని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. ప్రస్తుతం మూడు ఆయిల్ కంపెనీలకు కలిపి 16,150 సిలిండర్లు స్టాక్‌లో అందుబాటులో ఉండగా, పెండింగ్‌లో ఉన్న రీఫిల్ బుకింగ్లు 61,470 ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో గల గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరా కోసం చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. కాకినాడ జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజును ఆదేశించి, కంట్రోల్ రూమ్ ద్వారా స్వయంగా ప్రతి గ్యాస్ ఏజెన్సీతో మాట్లాడి వినియోగదారుల సమస్యలను తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# 22కేజీల గంజాయి పట్టివేత

- ముగ్గురు ఒడిస్సా యువకులు అరెస్ట్



**ఎటపాక( మనసులో మాట) మార్చి 16:** పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలో ముగ్గురు వ్యక్తులు కారులో తరలిస్తున్న గంజాయితో ఆదివారం ఎటపాక పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు లక్ష్మీపురం శివారులలో మాధవరావుపేట బస్ షెల్టర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా చింతూరు వైపు నుండి అనుమానస్పదంగా వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా, కారు డిక్కీ లో 22 కేజీల గంజాయి ని గుర్తించారు. గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని, కారును సీజ్ చేశారు. పట్టుబడ్డ ముగ్గురు యువకులు ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా వాసులుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అమలాపురం బాలయోగి స్టేడియంలో ఘనంగా

# ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు



**అమలాపురం (మనసులోమాట) మార్చి 15 :** స్థానిక బాలయోగి స్టేడియంలో రెండు రోజుల పాటు ఉత్సాహభరితంగా జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ ముగింపు సభకు పలువురు ప్రముఖులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లాడ శరత్ బాబు మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి మరియు క్రమశిక్షణకు చిహ్నాలని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పప్పుల శ్రీరామ చంద్రమూర్తి, మండేల బాబీ, మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ళ సతీష్ ప్రసంగిస్తూ, అమలాపురం వేదికగా ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం సంతోషదాయకమని, స్థానిక క్రీడాకారులకు ఇది మంచి అవకాశమని కొనియాడారు. అనంతరం అంతర్జాతీయ షటిల్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ మాతృమూర్తి రంగమణి ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, పట్టుదలతో కృషి చేస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని ఆకాంక్షించారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మొత్తం 8 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రాజమండ్రికి చెందిన రాజీ, విజయ్ దంపతులు విజేతలుగా నిలిచారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి రుద్ర ఈ టోర్నమెంట్ బాధ్యతలను పర్యవేక్షించి, పోటీలను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ముగింపు వేడుకలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

### వేలంక జగనన్న కాలనీలో ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ

# 2వ వార్షికోత్సవ వేడుకలు

- వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మాంసాహార రుచులతో మహా అన్నదానం



**కిర్లంపూడి (మనసులో మాట) మార్చి 15..** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకలో జగనన్న కాలనీలో వెలసిన గ్రామ దేవత శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ 2వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించికొని నాన్ వెజ్ వంటకాలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దోమాల గంగాధర్,నీలగిరి చిట్టిబాబు,శెట్టి చిన్న సత్తిబాబు మాట్లాడుతూ శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ 2వ అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామ ప్రజల సహాయ సహకారాలతో మహా అన్నదానం చేయడం జరిగిందన్నారు. శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి చల్లని చూపుతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఈ మహా అన్నదానానికి సహకరించిన గ్రామ ప్రజలకు,అన్న ప్రసాదం స్వీకరించడానికి వచ్చిన భక్తులకు వారు ద. ´ న్య ఎా దా ల ం తెలియజేశారు. అన్న ప్రసాదం స్వీకరించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దోమాల కృష్ణ జడ్జి,బేతాళ భాస్కరరావు,ఇంటి చెల్లారావు ఆలయ కమిటీ సభ్యులు అడబాల శ్రీను,దోమాల రాజా,దేవర దావీదు,శెట్టి పెద్ద సత్తిబాబు,శెట్టి సాంబ మూర్తి, నీలగిరి అప్పోజి,శెట్టి బుజ్జి, ఇంటి తమ్మాజీ,ఎలుబండి శివ,దోమాల అశోక్,నీలగిరి కాశీ, అల్లు లోవ,బస్వా చిట్టిబాబు,ఆకుల పెద్దకాపు గ్రామస్తులు,గ్రామ పెద్దలు, జగనన్న కాలనీ యూత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ వ్యక్తి కాదు మహోన్నతమైన శక్తి

- పవన్ కళ్యాణ్ కు జన సైనికులంతా అండగా ఉండాలి
- మహాదేవపట్నం లోని జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 15 :** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని వేడుకలు ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తుగ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేకును కట్ చేశారు. అనంతరం జన సైనికులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తదానం చేశారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పవన్ కళ్యాణ్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని, పవన్ కళ్యాణ్ వ్యక్తి కాదు మహోన్నతమైన శక్తి అని ఆయనకు మనమంతా అండగా నిలబడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మిత్ర ధర్మం పాటిస్తూనే జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అలు పెరగని యోధులని, గెలుపు ఓటమిలతో పని లేకుండా నిత్యం జనంలో ఉంటూ వారికి అండగా నిలబడి ఏకైక వ్యక్తి పవన్ కళ్యాణ్ మాత్రమేనని అన్నారు. జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జనసేన ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# మత సామరస్యం మన సంస్కృతి మూలస్తంభాలు

-వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 15:** “మత సామరస్యం, సోదర భావం మన సంస్కృతి మూలస్తంభాలని“ మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మంజీరా కన్వెన్షన్‌లో ముస్లిం సోదరుల కోసం భరత్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతం రామ్, దాసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు, మత గురువులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ అందరం కలిసి జీవించడమే వైఎస్సార్ సీపీ భావజాలం అన్నారు. పవిత్ర ఖురాన్ పఠనం, ప్రార్థన అనంతరం సమూహ ఇఫ్తార్ నిర్వహించారు. మన ప్రభుత్వ హయాంలో ఆవ రోడ్డులో షాదీ ఖానా కు స్థలం మనం చూసుకున్నాం.. కానీ అది ఆచరణలోకి రాలేదు, మరల జగన్ భాయ్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీ నెరవేర్చే బాధ్యత నేను తీసుకుంటానని భరత్ తెలిపారు. జగన్ భాయ్ మైనారిటీస్ పక్షపాతి అని, మన కోసం ఏమన్నా చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం కుటుంబాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. పార్టీ నేతలు ఈ కార్యక్రమాన్ని మత సమైక్యతకు చిహ్నంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పిల్లలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు వార్డు ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





### వేలంకలో ఘనంగా భారతీయ కిసాన్ సంఘ్

# ఆవిర్భావ దినోత్సవం

**కిర్లంపూడి (మనసులో మాట) మార్చి 15..** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు ఆధ్వర్యంలో భారతీయ కిసాన్ సంఘ్ (బి కె ఎస్) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో సంఘ జెండా ఆవిష్కరించారు. అనంతరం సంఘ్ వ్యవస్థాపకుల దత్తోపంత్ ఠేంగ్డేజీ మరియు రైతుల ఆరాధ్య దైవం భగవాన్ బలరాముడు,భారతమాత చిత్ర పటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా,కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లపు సూర్యనారాయణ,బికెఎస్ ఆవిర్భావ విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో నీలగిరి కాశీ,భేతాళ భాస్కరరావు,నీలగిరి గణేష్,దోమాల జడ్జి,శెట్టి చిన సత్తిబాబు,బస్వా చిట్టిబాబు,దోమాల చినబాబు ఇంకా పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో అభివృద్ధి పనులు వేగవంతం

- మాజీ ఎమ్మెల్యే వర్మ



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 15:** కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో సి.సి రోడ్లు, డ్రైనేజీ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ తెలిపారు. ఆదివారం వెల్దుర్తి గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిఠాపురం - ధర్మవరం మెయిన్ రోడ్డుకు రూ.17 కోట్ల రూపాయల కేటాయించామని, తిమ్మాపురం - రాయవరం మధ్య నిలిచిపోయిన 4.5 కోట్ల రూపాయల పనులను స్టే ఆర్డర్ తొలగగానే ప్రారంభిస్తామని చెప్పారు. చంద్రబాబు నాయుడు పాలనలో పేదలకు సంక్షేమం, వసతులు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్ రావు, నాయకులు సూర్నీడి దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆలయ ఇచ్చే పథకానికి రూ లక్ష విరాళం



**కొత్తపేట మనసులో మాట మార్చి 15..** కోనసీమ తిరుమల గా పేరు వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాత పథకానికి వీరవాసరం మండలం మత్స్యపురి చెందిన జవ్వాది సూర్యనారాయణ మూర్తి కుటుంబ సభ్యులు రూ,1,01,116 విరాళాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు వేద ఆశీర్వచనం స్వామివారి చిత్రపటం అందజేశారు.

# బలభద్రపురంలో భూగర్భ వారాహి మాత ఆలయ ప్రారంభోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి దంపతులు



**అనపర్తి (మనసులో మాట) మార్చి 15:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో తోటలో మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన, భూగర్భ వారాహి మాత ఆలయ ప్రారంభోత్సవం మరియు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తిసూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన సూర్యనారాయణ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అందజేసిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంపై సూర్యనారాయణ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, భూగర్భంలో నిర్మించిన ఈ వారాహి మాత ఆలయం ఎంతో అద్భుతంగా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో ఈ ఆలయం కాశీ వారాహి మాత ఆలయంలా ప్రసిద్ధి గాంచడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఈ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామ ప్రజలను మరియు ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
సోమవారం 16 మార్చి 2026


# ట్రంప్ పర్సనల్ మొబైల్ నంబర్ కావాలా..? అయితే ఇలా చేయాలట..!!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత సెల్‌ఫోన్ నంబర్.. ఇప్పుడు అమెరికాలోనే ఎంతో విలువైన సమాచారంగా పరిగణిస్తున్నారు. జర్నలిస్టులు, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు వైట్ హౌస్ అధికారిక మార్గాలను దాటి నేరుగా అధ్యక్షుడితో మాట్లాడాలని దీనికోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. 'ది అట్లాంటిక్' అందించిన నివేదిక ప్రకారం.. ఈ నంబర్ ప్రస్తుతం జర్నలిస్టులు, రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చలామణిలో ఉంది. ట్రంప్ ను సంప్రదించాలనే ప్రయత్నం తీవ్రం కావడంతో కొందరు అసాధారణ మార్గాలలో నంబర్‌ను పొందడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ధనవంతులైన ఎగ్జిక్యూటివ్ లు దీని కోసం డబ్బును ఆఫర్ చేస్తున్నారని అధికారులు తెలిపారు. మరికొందరు ప్రముఖుల కాంటాక్ట్ వివరాలను మార్పిడికి ప్రతిపాదించారట. అయితే వైట్‌హౌస్ లోపల, అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ అరుదుగా నిశ్శబ్దంగా ఉంటుందని సహాయకులు చెబుతారు. ఇన్ కమింగ్ కాల్స్, సందేశాలతో ఫోన్ నిత్యం వెలిగిపోతుంది. తెలియని నంబర్లు చాలా కాగా, కొన్ని అధ్యక్షుడితో మాట్లాడే అవకాశం కోసం ఎదురుచూసే విలేకరులవి అని సమాచారం. ఒక జర్నలిస్ట్ ట్రంప్ ను సంప్రదించి వార్త ప్రచురించినప్పుడు ఈ ధోరణి మొదలైనట్లు తెలుస్తోంది. రెండు వారాల క్రితం యునైటెడ్ స్టేట్స్ దాడులు ప్రారంభించిన తర్వాత, ట్రంప్ ప్రధాన అమెరికన్ నెట్‌వర్క్‌ల నుండి అంతర్జాతీయ మీడియా సంస్థల విలేకరుల నుండి మూడు డజన్ల కంటే ఎక్కువ కాల్‌లను స్వీకరించినట్లు నివేదించింది. ఈ సంభాషణలు సామాన్యంగా సంక్షిప్తంగా, కొన్ని నిమిషాలు మాత్రమే కొనసాగుతాయి, అధ్యక్షుడు ఫోన్ పెట్టేసినప్పుడు అకస్మాత్తుగా ముగుస్తాయి. అయినప్పటికీ, ఒక చిన్న వ్యాఖ్య కూడా పెద్ద వార్తగా మారగలదు. ఇటీవల, ట్రంప్ ఒక ఫోన్ కాల్‌లో జదీా న్యూస్‌తో ఇరాన్‌తో యుద్ధం "దాదాపు పూర్తయిందని" చెప్పారు. ఈ వ్యాఖ్య ఆర్థిక మార్కెట్లను కొద్దిసేపు కదిలించింది, ఆ తర్వాత అతను ఒక విలేకరుల సమావేశంలో మరింత జాగ్రత్తగా వివరణ ఇచ్చారు. వైట్‌హౌస్ సహాయకులకు, అధ్యక్షుడి ఈ అనుకోని కాల్‌లకు సమాధానం ఇచ్చే అలవాటు సుపరిచితమే, కానీ వారికి నిరాశను కలిగిస్తుంది. దశాబ్దాలుగా ట్రంప్ జర్నలిస్టులతో నేరుగా మాట్లాడటానికే ఇష్టపడతారు. సాధారణ విధానాల చర్చలు లేకుండా అధ్యక్షుడు త్వరగా స్పందిస్తే ఈ కాల్‌ల ప్రవాహం గందరగోళానికి దారితీస్తుందని నలవోదారులు ఆందోళన చెందుతున్నారు. వైాన వ్రారిత్ సమాచారం లేదా కుట్ర సిద్ధాంతాలు ప్రచారం కావచ్చని ఎాంం భయపడుతున్నారు. మరిన్ని కనుగొనండి స్పోర్ట్స్ దుస్తులు టీవీ సినిమా వార్తల సేవలు క్రికెట్ స్కోర్లు లైఫ్ స్టైల్ బ్లాగ్ జాతీయ వార్తల సేవలు ఈ ప్రమాదాలు ఉన్నప్పటికీ, వైట్‌హౌస్ కాల్‌లను ఆపడానికి ప్రయత్నించలేదు. ట్రంప్ ఈ సంభాషణలను ఆస్వాదిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉండే అధ్యక్షుడిగా ఆయన ప్రతిష్టను ఇది పెంచుతుందని అధికారులు అంటున్నారు. ఈ పరిస్థితి కొనసాగినంత కాలం, వాషింగ్టన్‌లో అత్యంత విలువైన ఈ ఫోన్ నంబర్ చలామణిలో ఉంటుంది. తదుపరి వార్త కోసం ఎదురుచూస్తున్న విలేకరులకు, దీనిని డయల్ చేయాలనే ప్రలోభాన్ని నిరోధించడం కష్టం.


# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





కలిగిరి : కూలీ పనుల కోసం బైక్పై వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి మిని వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటన ఆదివారం జాతీయ రహదారి 167బీజీపై కలిగిరి మండలం పెద్దపాడు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్లకు చెందిన మూకిరి రత్నరాజు (40) పొగాకు బ్యారన్ల వద్ద పనుల నిమిత్తం స్వగ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకుని వింజమూరు మండలం గుండెమడకలకు బైక్పై బయలుదేరాడు. మార్గంమధ్యలో పెద్దపాడు సమీపంలో ఇతను ప్రయాణిస్తున్న బైక్ను వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో రత్నరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్పై ఉమాశంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చాడు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

# గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యం అక్రమ రవాణా..?



**పలమనేరు మార్చి 15( మనసులో మాట) :** పలమనేరు నియోజకవర్గంలో ప్రభుత్వం దారిద్ర రేఖకు దిగువ ఉన్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాలలో వినియోగదారులకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇదే అదునుగా భావించి సిండికేట్ వ్యాపారస్తులు ప్రజల నివాసాల వద్ద నుండి 17 రూపాయలు నుండి 20 రూపాయలు వరకు ఒక కేజీ రేషన్ బియ్యాన్ని కొనుక్కుంటారు. అభియాన్ని మిల్లర్ల వద్దకు ఆటోలలో, టెంపుల్,బోలోరా వాహనాల లో, రాత్రిపూట తరలించి మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ పట్టి అధిక ధరలకు విక్రయిస్తుంటారు. ఏది ఏమైనాప్పటికీ పోలీసులకు కూడా కళ్ళు కప్పి వారి వ్యాపారాలు సజావుగా చేసుకుంటారు. ఏది ఏమైనాప్పటికీ పలమనేరులో సిండికేట్ గా మారిన రేషన్ బియ్యం వ్యాపారస్తులకు మూడు పూలు ఆరు కాయలుగా వ్యాపారం చేసుకుంటూ లాభాలు ఆర్జిస్తుంటారు. ఈ వ్యాపారస్తులు అక్రమ మార్గాలను ఎంచుకొని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలోని సరిహద్దులో ఉన్న పలమనేరు ప్రాంతాన్ని కేంద్ర బిందువుగా ఉపయోగించుకుంటారు. ఇటు కర్ణాటక కు వెళ్లాలంటే 20 కిలోమీటర్లు పై మాటే, అటు తమిళనాడుకు వెళ్లాలంటే 20 కిలోమీటర్లు పై మాటే యదేచ్ఛగా రేషన్ బియ్యాన్ని వాహనాలలో తరలిస్తుంటారు. బియ్యాన్ని కొనుక్కోవడానికి స్కూటర్లలో వ్యాపారస్తులు ఇళ్ల వద్దకే వచ్చి 17 రూపాయలతో బియ్యాన్ని కొనుక్కొని వెళుతుంటారు. ఈ బియ్యానికి పాలిష్ పట్టి 35 రూపాయల నుండి 45 రూపాయలకు 25 కేజీలు ఒక బ్యాగు చొప్పున ప్యాకింగ్ చేస్తారు. అది మార్కెట్లో ప్రజలకు విక్రయిస్తారు. ఆంధ్రప్రదేశ్లో పేద ప్రజలకు రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అక్రమ బియ్యాన్ని పై నిగా పెట్టి అరికట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# అగ్నికి ఆహుతైన మామిడి, శ్రీగంధం చెట్లు..

## - రూ.2 లక్షలకు పైగా నష్టం



**కలసపాడు:** వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలంలోని ముసల్ రెడ్డిపల్లె సమీపంలోని కొండకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కొండకు దగ్గరలో ఉన్న పెద్దిరెడ్డి నారాయణరెడ్డి అనే రైతుకు చెందిన పొలానికి మంటలు వ్యాపించి.. 50 మామిడి చెట్లు, 70 శ్రీగంధం చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు తెలిపాడు. రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# 31 ఎర్రచందన దుంగలు స్వాధీనం



సుండుపల్లి: వేర్వేరు ప్రాంతాల్లో 31 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజి అధికారి వై.సి. రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల సమాచారంతో రాయవరం డీఆర్వో రమేష్ బాబు ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది శనివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. రాయవరం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారు ఆగకుండా వెళ్లింది. అప్రమత్తమైన అటవీశాఖ సిబ్బంది కారును వెంబడించి గుండ్లపల్లి సమీపంలోని గొల్లపల్లి చెరువు వద్ద పట్టుకున్నారు. కారులో ఉన్న 21 ఎర్రచందన దుంగలు స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. రూ.6 లక్షలు విలువ చేసే దుంగలతోపాటు వాహనాన్ని పట్టుకున్నామన్నారు. అదేవిధంగా జిలేళ్లమంద బీట్ పరిధిలోని పోరాకనుమ ప్రాంతంలో 254 కిలోల బరువు ఉన్న 10 ఎర్రచందనం దుంగలను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని.. వీటి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో రాయవరం డీఆర్వో ఎస్. రమేష్ బాబు, ఎఫ్ బీవోలు అంజనాస్వాతి, వెంకటేశ్వర్లు, రాయవరం, ముదుంపాడు బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండలం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారుల వివరాలు నాగంపల్లి గ్రామంకు చెందిన బడికల చిన్న మస్తాన్‌కి 52,641/-రూపాయలకు సంబంధించిన చెక్కును, ఎర్రమఠం గ్రామంకు చెందిన బద్దుల మహేశ్వరయ్యకి 48,162/- రూపాయలకు సంబందించిన చెక్కును, నందికుంట గ్రామంకు చెందిన కె దీపిక కి 41,600/- రూపాయలకు సంబందించిన చెక్కును నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, వారి ఇంటికి వెళ్లి మండల నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో: సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ నారపు రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, హరికృష్ణ రెడ్డి, సత్యాల్ రెడ్డి, చంద్రారెడ్డి,రామిరెడ్డి జహురుల్లా, షఫీవుళ్ళ,మహేష్ వెంకటేష్, పరశురాం, కృష్ణ, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# మాన్యశ్రీ కాన్షీరామ్ 92 వ జయంతి




బహుజనుల ఆరాధ్యులు మాన్యశ్రీ కాన్షీరామ్ గారి 92 వ జయంతి కార్యక్రమాన్ని కర్నూలు నందలి స్థానిక మద్దూరు నగర్ లోని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మరియు కర్నూలు జిల్లా కార్యదర్శి చిరంజీవమ్మ లు కలిసి మాన్యశ్రీ కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ బహుజనుల కు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం అని ఆ దిశగా బహుజనులు అందరూ ఐక్యమై పోరాడాలని కాన్షీరామ్ గారు సూచించారని ఆమె అన్నారు. మాన్యశ్రీ కాన్షీరామ్ మహిళల పక్షపాతి అని, ఒక మహిళను ముఖ్యమంత్రి ని చేసిన ఘనత మాన్యశ్రీ కాన్షీరామ్ గారికే దక్కినది అని ఆమె తెలిపారు. నీతికి నిజాయితీకి ఆత్మ గౌరవానికి నిలువెత్తు నిదర్శనమే కాక అంబేద్కర్ గారి ఆశయాలకు వారసులు మాన్యశ్రీ కాన్షీరామ్ గారు అని ఆమె అన్నారు. కాన్షీరామ్ గారు తన జీవిత కాలం అంతా అంబేద్కర్ ఆశయ సాధన కు, సామాజిక మార్పు కోసం నిరంతరం శ్రమించి, జ్యోతిబాపూలే,అంబేడ్కర్ పెరియార్, సాహు మహారాజ్, నారాయణ గురు, గాడ్గేబాబా కొమురం భీమ్ వంటి సామాజిక ఉద్యమకారుల జీవితాలను అధ్యయనం చేసి వారి ఆలోచనా విధానాన్ని కొనసాగించిన మహోన్నత వ్యక్తి మాన్యశ్రీ కాన్షీరామ్ అని ఆమె తెలిపారు.

# హెచ్ పి పెట్రోల్ పంపు ప్రారంభోత్సవం





నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండలం శివపురం గ్రామ సమీపంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్ పి పెట్రోల్ పంపు ప్రారంభోత్సవ లో ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్, నారపురెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, రవికాంత్, పల్చని మహేష్ రెడ్డి, గోవిందు, నియోజవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

ఆదివారం 15 మార్చ్ 2026 పేజీ :23



# మత సామరస్యంతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..
సచివాలయం నుంచి గల్లీ వరకు ప్రాధాన్యత
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
ఎల్బీ స్టేడియంలో ఘనంగా ఇఫ్తార్ విందు..
ముస్లిం సోదరులతో కలిసి విందు ఆరగించిన సీఎం

02



# రైతులకు శుభవార్త

22 నుంచి రైతు భరోసా నిధుల విడుదల
తొలి విడతగా 70 లక్షల మంది ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు..
సిద్దిపేటలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
ఏప్రిల్ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి..
మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్ల పంపిణీ

02



## కేసీఆర్ గారూ.. అసెంబ్లీకి రండి

ఏపీలో జగన్‌కు లేని హోదా.. ఇక్కడ కేసీఆర్‌కు ఇచ్చాం
మంత్రి కోమటిరెడ్డి





# హైడ్రాతో అరాచకం

ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా..
రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం

03

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పురోగతి

03

- ఆరుగురికి పాజిటివ్.. కఠిన చర్యలు తప్పవు
- సిమ్లా నుంచి కొకైన్ సరఫరా.. ఫామ్‌హౌస్‌లో తుపాకీ కాల్పుల కలకలం
- నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్న ఈగల్ ఎస్పీ గిరిధర్..
- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం



# నేటి నుంచి అసెంబ్లీ

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
తొలిసారిగా సభకు రానున్న శివ ప్రతాప్ శుక్లా..
తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సర్వత్రా ఉత్కంఠ
గిగ్ వర్కర్ల చట్టం, మూసీ ప్రక్షాళన,
సోషల్ మీడియా కట్టడిపై కీలక చర్చకు రేవంత్ సర్కార్ సిద్ధం

03

# మతసామరస్యంతోనేరాష్ట్రప్రగతిసాధ్యం

- మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..
- సచివాలయం నుంచి గల్లీ వరకు ప్రాధాన్యత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్బీ స్టేడియంలో ఘనంగా ఇఫ్తార్ విందు..
- ముస్లిం సోదరులతో కలిసి విందు ఆరగించిన సీఎం



**హైదరాబాద్, మార్చి 15 (మనసులో మాట):** అన్ని మతాలకు చెందినవారు కలిసికట్టుగా సోదరభావంతో మెలగాలని, అప్పుడే ఈ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించుకోగలమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అధికారిక ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రంజాన్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది మానవీయ విలువలను గుర్తుచేసే పవిత్ర మాసమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ సత్సంబంధాలను కొనసాగించడమే ఈ మాసం గొప్పతనం అని కొనియాడారు. రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మైనారిటీ వర్గానికి చెందిన నాయకులకు పదవుల్లో సముచిత స్థానం కల్పించడమే కాకుండా, క్రీడాకారులను సైతం ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. ప్రముఖ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి, షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు ఇచ్చామని తెలిపారు. అలాగే అంతర్జాతీయ క్రీడాకారులు మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌లకు డీఎస్పీ హోదాతో కూడిన ఉద్యోగాలతో పాటు ఒక్కొక్కరికి ₹ 2 కోట్ల ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు. 8 మంది మైనారిటీ నేతలను వివిధ కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించడం ద్వారా వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేశామని వివరించారు. ఈ ప్రభుత్వం అందరిదని, తాను ఒక సోదరుడిగా మైనారిటీల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకంలోనూ మైనారిటీలకు సింహభాగం కేటాయిస్తున్నామని, కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో కూడా ముస్లిం విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. తెలంగాణ మరియు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం అందరూ కలిసి కష్టపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు పలువురు ముస్లిం మతపెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# నేటి నుంచి అసెంబ్లీ

- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- తొలిసారిగా సభకు రానున్న శివ ప్రతాప్ శుక్లా..
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సర్వత్రా ఉత్కంఠ
- గిగ్ వర్కర్ల చట్టం, మూసీ ప్రక్షాళన, సోషల్ మీడియా కట్టడిపై కీలక చర్చకు రేవంత్ సర్కార్ సిద్ధం



**హైదరాబాద్, మార్చి 15(మనసులో మాట):** తెలంగాణ శాసనసభ సమావేశాలు **సోమవారం ఉదయం 11**:45 గంటలకు ప్రారంభం కానున్నాయి. కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీకి వస్తుండటం ఈ సమావేశాల ప్రత్యేకత. సంప్రదాయం ప్రకారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంతో ఈ సమావేశాలు మొదలవుతాయి. సుమారు పది రోజుల పాటు ఈ సమావేశాలను నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. సభా ప్రారంభానికి ముందు అసెంబ్లీ ప్రాంగణంలో కొత్తగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అయితే, ఈ విగ్రహ రూపురేఖలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సభలో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ దఫా సమావేశాల్లో పలు కీలక బిల్లులు మరియు ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎజెండాను సిద్ధం చేసింది. ముఖ్యంగా డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు వంటి గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణ కోసం తీసుకురానున్న కొత్త చట్టంపై ప్రభుత్వం చర్చించనుంది. అలాగే, విద్యారంగంలో నూతన విధానాల అమలు, బడ్జెట్ కేటాయింపులపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న ఫేక్ న్యూస్, విద్వేషపూరిత పోస్టుల నియంత్రణకు గాను సోషల్ మీడియా కట్టడిపై చట్టపరమైన చర్చ జరగనుంది. రాష్ట్రానికి సంబంధించి అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు, నదీ జలాల పంపిణీ అంశాలపై కూడా ప్రభుత్వం తన కార్యాచరణను సభ ముందు ఉంచనుంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత స్థితిగతులు మరియు ఈ వ్యవహారంలో జరుగుతున్న దర్యాప్తు పురోగతిపై సభ్యులు చర్చించనున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ సమావేశాల్లో పలు చట్టాలకు రూపకల్పన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిపక్షాలు కూడా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతుండటంతో అసెంబ్లీ సమావేశాలు ఆసక్తికరంగా మారనున్నాయి.

# రైతులకు శుభవార్త

- 22 నుంచి రైతు భరోసా నిధుల విడుదల
- తొలి విడతగా 70 లక్షల మంది ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు..
- సిద్దిపేటలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఏప్రిల్ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి..
- మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు రూ.9 వేల కోట్ల పంపిణీ



**హైదరాబాద్, మార్చి 15 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులను ఈ నెల 22వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరియు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 22న సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నిధుల విడుదల కార్యక్రమం ప్రారంభం కానుంది. మొదటి విడతలో భాగంగా ఎకరం వరకు భూమి ఉన్న సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 3,590 కోట్ల నిధులను నేరుగా జమ చేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చిన్న, సన్నకారు రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరనుంది. అనంతరం మరో 20 రోజుల గడువులో రెండో విడతగా రూ. 2,650 కోట్లను పంపిణీ చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మిగిలిన రైతులందరికీ నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మరియు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల కోసం డ్రగ్స్ కేసులా?

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, మార్చి15**: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో డ్రగ్స్ పార్టీ తీవ్ర కలకలం సృష్టించింది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. డ్రగ్స్ మహమ్మారిపై తన నిబద్ధతను చాటుతూనే.. ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ కేసుపై కేటీఆర్ మాట్లాడుతూ.. 'మాదక ద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా మారుస్తాయి. సమాజానికి ఇవి పెను ముప్పు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా ఇలాంటి వ్యసనాలకు పాల్పడటం దురదృష్టకరం. డ్రగ్స్ వాడకాన్ని, విక్రయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విషయంలో మాకు ఎలాంటి రాజీ లేదు. డ్రగ్స్ కేసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారం జరుగుతోంది. ఈ అంశంలో నీచమైన రాజకీయాల కోసం బీఆర్ఎస్ పార్టీని లాగుతున్నారు. నాపై అసత్య ప్రచారాలు చేసేవారికి చట్టపరమైన నోటీసులు ఇస్తాను. నేను ఏ పరిక్షకైనా సిద్ధం. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. డ్రగ్స్ వాడుతున్న వారు లేదా విక్రయిస్తున్న వారెవరైనా సరే.. అలాంటివారికి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షించాలి' అని అన్నారు.

# కేసీఆర్‌గారూ.. అసెంబ్లీకి రండి

- ఏపీలో జగన్‌కు లేని హోదా.. ఇక్కడ కేసీఆర్‌కు ఇచ్చాం
- మంత్రి కోమటిరెడ్డి



**సంగారెడ్డి, మార్చి15(మనసులో మాట):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై, ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు అందించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ కేవలం ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని, ఈసారైనా పూర్తిస్థాయిలో సభలో ఉండాలని ఆయన కోరారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రజల తరపున నేను కేసీఆర్‌కు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. మీరు సభకు వచ్చి మా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వండి. మీరు ఇచ్చే మంచి సూచనలు స్వీకరించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ 11 సీట్లు వచ్చినా అక్కడ ప్రతిపక్ష హోదా దక్కలేదు, కానీ తెలంగాణలో మేము గౌరవప్రదంగా ప్రతిపక్ష హోదా ఇచ్చాం. ప్రభుత్వం చేసే మంచి పనులను కేసీఆర్ అభినందిస్తే, ఆయనకే గౌరవం. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము అధికార పార్టీలో ఉండి కూడా రాష్ట్రం కోసం సస్పెండ్ అయ్యాను. మూసీ పునరుజ్జీవంపై కేటీఆర్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూస్తుంటే నవ్వు వస్తోంది. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ ప్రజలు పడుతున్న ఇబ్బందులు మాకు తెలుసు. ఫ్లోరైడ్ సమస్యలతో దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాం' అని అన్నారు.

# వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



**తొగుట, మార్చి 15 (మనసులో మాట):** సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రంలోని మల్లన్న ఆలయంలో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. యాదవ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. లోకకల్యాణార్థం మరియు గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కల్యాణోత్సవంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తుల కోసం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమం భక్తి పారవశ్యం మధ్య సాగింది. భక్తులు నిప్పులపై నడుస్తూ స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాగాల శోభ కొండల రెడ్డి, ఉప సర్పంచ్ బండారి తిరుపతి, నిరంజన్ రెడ్డి, అక్కం స్వామి, భరత్ తేజ, సీత ఐలయ్య, దుద్దెడ యాదగిరి, ముక్కెర తిరుపతి, సీత ఆంజనేయులు, బండారి ఆంజనేయులు, లెంకల ఆంజనేయులు, కోడెల మహేష్, బండారి మల్లేశం, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మల్లన్న నామస్మరణతో తొగుట గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# హైడ్రాతో అరాచకం

- ఆధారాలు బయటపెడితే నన్ను బదనాం చేస్తారా..
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కవిత ధ్వజం

**హైదరాబాద్, మార్చి15 (మనసులో మాట)**: సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంక్‌కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు(ఆదివారం) హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు.ఫేజ్– వన్‌కి సంబంధించిన డీపీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చూపెట్టిందని ప్రస్తావించారు. పూర్తి డీపీఆర్ ఇవ్వకపోవడం వెనుక మోసం ఉందని ఆరోపించారు. ఫ్రీ ఫీజబులిటీ రిపోర్టులో రూ.5,641 కోట్లు ఖర్చు అవుతుందని ఈ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు.

**మూసీపై ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదు..**

ఆరు నెలల తర్వాత దాదాపు రూ.1400 కోట్ల అంచనా ఎందుకు పెరిగిందని కవిత నిలదీశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంత ఖర్చు అవుతుందో.. ఆ ఖర్చు మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టు ప్రజెంటేషన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, మంత్రులను పిలిచారని అన్నారు. కానీ మూసీలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులను ప్రజెంటేషన్‌కు ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో చిన్న మోదీలా.. రేవంత్‌రెడ్డి వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మూసీ పేరుతో సీఎం గ్రాఫిక్స్ చూపెట్టారని సెటైర్లు గుప్పించారు. 16 నాలాల నుంచి మూసీలోకి మురుగు నీరు వస్తోందని చెప్పుకొచ్చారు. నగరంలో ఉన్న వ్యర్థాలన్నీ మూసీలోకి వెళ్తున్నాయని తెలిపారు.

**అరాచకం చేస్తున్నారు..**

హైడ్రాతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి అరాచకం చేస్తున్నారని కవిత ఆగ్రహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఇప్పటివరకు ఆరు



ఫిర్యాదులు చేశామని ప్రస్తావించారు. హైడ్రా కమిషనర్, ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెబుతున్నారని ఫైర్ అయ్యారు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడుతున్నారని.. మీరేమైనా కంటెంట్ రైటర్లా ...? అని ధ్వజమెత్తారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలి..**

తాను ఆధారాలు బయటపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని కవిత ఎద్దేవా చేశారు. తాను ఆధారాలు బయటపెడితే ఈ ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా...?, తమాషాలు చేస్తున్నారా..? అని ఆగ్రహించారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్ వెంటనే డిలీట్ చేయాలని.. లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో అసలైన బాధితులకు ఇళ్ల పట్టాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు ఇచ్చారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. త్వరలో వెలుగుమట్లలో పర్యటిస్తానని కవిత స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో దారుణం

- ఉప్పల్‌లో కానిస్టేబుల్ సుధీర్ రెడ్డి దారుణ హత్య
- నమ్మించి పిలిచి.. కత్తితో విచక్షణారహితంగా పొడిచిన స్నేహితుడు సంతోష్
- సిటీ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్న బాధితుడు..
- పాత కక్షలే కారణమని పోలీసుల అనుమానం

**హైదరాబాద్, మార్చి 15 (మనసులో మాట)**: నగరంలోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. నగర పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుధీర్ రెడ్డిని, అతని స్నేహితుడే అత్యంత క్రూరంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. చిల్కానగర్ పరిధిలోని ఆదర్శ్ నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పోలీసుల కథనం ప్రకారం.. చెంగిచర్ల ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న సుధీర్ రెడ్డి హైదరాబాద్ సిటీ వింగ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సంతోష్ అనే వ్యక్తి సుధీర్ రెడ్డికి స్నేహితుడు. ఏదో విషయంపై చర్చించాలంటూ ఆదివారం సంతోష్, సుధీర్ రెడ్డిని చిలకనగర్‌కు పిలిపించాడు. అక్కడ ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో, ముందస్తు పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో సంతోష్ ఒక్కసారిగా దాడికి దిగాడు. సుధీర్ రెడ్డి కడుపులో, మెడపై విచక్షణారహితంగా పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సుధీర్ రెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలు లేదా వ్యక్తిగత కక్షలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సంతోష్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఒక రక్షక భటుడే ఇలా ప్రాణాలు కోల్పోవడం పోలీస్ శాఖలో విషాదాన్ని నింపింది.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పురోగతి

- ఆరుగురికి పాజిటివ్.. కఠిన చర్యలు తప్పవు
- సిమ్లా నుంచి కొకైన్ సరఫరా.. ఫామ్‌హౌస్‌లో తుపాకీ కాల్పుల కలకలం
- నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్న ఈగల్ ఎస్పీ గిరిధర్..
- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం



హైదరాబాద్, మార్చి 15 (మనసు **మాట)**: మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని ఈగల్ ఎస్పీ గిరిధర్ తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న వారు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారంతోనే తాము ఫామ్‌హౌస్‌పై దాడులు నిర్వహించినట్లు స్పష్టం చేశారు. ఈ దాడుల సమయంలో అక్కడ ఉన్న వారిలో 11 మందికి డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా, ఆరుగురికి పాజిటివ్‌గా తేలిందని ఎస్పీ వివరించారు. బాధితుల్లో ఒక మహిళ కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరినీ త్వరలోనే కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఫామ్‌హౌస్ లోపలికి వెళ్లే క్రమంలోనే తమకు తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయని, ఈ గన్‌ఫైర్‌కు సంబంధించి లోతైన ఆరా తీస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ పార్టీ కోసం సిమ్లా నుంచి కొకైన్‌ను తీసుకువచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, నిందితులు మొత్తం రెండు రకాల మత్తు పదార్థాలను వాడినట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే ఈగల్ టీమ్ ప్రధాన లక్ష్యమని ఎస్పీ గిరిధర్ పునరుద్ఘాటించారు. 14వ తేదీ సాయంత్రం నిషేధిత మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు సమాచారం అందగానే మెరుపు దాడులు చేశామన్నారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి? దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అనే కోణంలో విచారణ కొనసాగుతోందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడకం మరియు రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# బడ్జెట్ సమావేశాలకు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్**: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. రాజ్ భవన్‌లో జరిగిన ఈ భేటీలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. భట్టి విక్రమార్కతో పాటు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్–ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్థిక శాఖ కార్యదర్శి స్మితా పట్నాయక్ తదితర ఉన్నతాధికారులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం, సోమవారం (మార్చి 16) నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలు కొలువుదీరుతాయి. ఈ సమావేశాలను మార్చి 30వ తేదీ వరకు నిర్వహించాలని రాష్ట్ర క్యాబినెట్ ఇప్పటికే నిర్ణయించింది. అత్యంత కీలకమైన 2026–27 ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌ను మార్చి 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి 26 నుంచే సమావేశాలు జరగాల్సి ఉన్నప్పటికీ, బడ్జెట్ రూపకల్పనలో తుది మెరుగులు దిద్దేందుకు ప్రభుత్వం ఈ తేదీని మార్చి 16కు వాయిదా వేసింది. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు గతంలో కంటే భారీగా ఉండే అవకాశం ఉందని సచివాలయ వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, ఇతర సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. పదిహేను రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి.

# రేవంత్‌రెడ్డి జూనియర్ యోగిలా మారారు

- - అధికారంలోకి వచ్చాక ఇళ్లు కట్టడం మానేసి కూల్చడమే పనిగా పెట్టుకున్నారు
- - షాదీ ముబారక్, తులం బంగారం ఏమైంది?..
- - కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు




హైదరాబాద్, మార్చి 15 (మనసులో **మాట)**: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్లు కట్టడం పక్కన పెట్టి, పేదల ఇళ్లను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఆయన 'జూనియర్ యోగి'లా (యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్) మారారని ఎద్దేవా చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్‌లో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలకు రేషన్ కిట్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధి మంత్రం నడిస్తే, రేవంత్‌రెడ్డి పాలనలో విధ్వంసం కనిపిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర ఏళ్లలో ఒక్క కొత్త ఇల్లు కూడా కట్టలేదని, కానీ లక్ష ఇళ్లను మాత్రం బుల్డోజర్లతో కూల్చివేసిందని మండిపడ్డారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి, వారి గూడు చెడగొట్టడమే ఈ ప్రభుత్వ సాధన అని విమర్శించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని, అర్హులైన పేదలకు లక్ష రూపాయల సాయం అందడం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని హరీశ్‌రావు నిలదీశారు. తులం బంగారం ఇస్తామని, ఇమామ్ మరియు మోజమ్‌లకు వేతనాలు పెంచుతామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పరిష్కారమైన తాగునీటి సమస్యలు మళ్లీ మొదలయ్యాయని, ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ సలీం సొంత నిధులతో నిరుపేదలకు సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ సలీం తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ కిట్ మాయం..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కిట్ ఎందుకు మాయమైందని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో కరోనా సమయంలో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకున్నామని గుర్తుచేశారు. ప్రజలందరి దయ, అల్లా దయతో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, మళ్లీ మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు. రంజాన్ నెల పవిత్ర మాసమని ఏదైనా కోరుకుంటే జరుగుతుందని చెప్పుకొచ్చారు. నేడు ప్రపంచమంతా యుద్ధ వాతావరణంలో ఉందని తెలిపారు. సిలిండర్ దొరకడం లేదని.. నిత్యావసర ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరి ఇబ్బందులు తొలగిపోవాలని దేవుడిని ప్రార్థించాలని అన్నారు. మళ్లీ అందరికీ మంచి రోజులు రావాలని కోరుకుందామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# గోల్కొండలో దారుణం

- 14 నెలల పసికందును చంపిన కన్నతల్లి
- దిండుతో ఊపిరాడకుండా చేసి ఘాతుకం..
- కుటుంబ కలహాలే కారణమని అనుమానం- ఆసుపత్రిలో చిన్నారి మృతి.. లొంగిపోయిన నిందితురాలు



**హైదరాబాద్, మార్చి 15 (మనసులో మాట)**: నగరంలోని గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెలు పిండేసే విషాద ఘటన చోటుచేసుకుంది. క్షణికావేశంలో ఓ కన్నతల్లి తన 14 నెలల పసికందును అత్యంత దారుణంగా అంతమొందించింది. దిండుతో ముఖంపై అదిమి పట్టి ఊపిరాడకుండా చేసి సొంత బిడ్డనే ప్రాణాలు తీసింది. ఆదివారం (మార్చి 15) జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండకు చెందిన మౌసియా బేగంకు 14 నెలల కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా ఆమె కుటుంబ కలహాలతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే ఆదివారం కుటుంబ సభ్యులతో గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మౌసియా బేగం, ఆ కోపాన్ని పసికందుపై చూపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసివాడిని దిండుతో ఊపిరాడకుండా చేసి చంపేసింది. శిశువు స్పృహ తప్పి పడి ఉండటాన్ని గమనించిన తండ్రి మరియు తాత వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం ఇండో–యూఎస్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బాబు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘాతుకానికి పాల్పడిన అనంతరం మౌసియా బేగం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, కుటుంబ కలహాలే ఈ హత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. మానవ సంబంధాలను మంటగలిపేలా జరిగిన ఈ దారుణంపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# భవనంపై నుండి పడి హోంగార్డుకు తీవ్ర గాయాలు

- - ఆపన్నహస్తం అందించిన వైస్ చైర్మన్
- - స్వయంగా ఆసుపత్రికి తరలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



**ఆసిఫాబాద్, మార్చి 15 (మనసులో మాట)**: జిల్లా కేంద్రంలో ప్రమాదవశాత్తు భవనంపై నుండి పడి గాయపడిన ఓ హోంగార్డుకు ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ సకాలంలో స్పందించి ప్రాణదాతగా నిలిచారు. జిల్లా కేంద్రంలోని బజార్ వాడీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న హోంగార్డు ప్రకాష్ జాదవ్ ఆదివారం రాత్రి తన నివాసం ఉంటున్న భవనం రెండో అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయనకు శరీర భాగాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో వెళ్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, అక్కడ గుమ్మిగూడి ఉన్న స్థానికులను చూసి వెంటనే తన వాహనాన్ని ఆపారు. రక్తపు మడుగులో గాయాలతో ఉన్న హోంగార్డును గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తన సొంత వాహనంలోనే ప్రకాష్ జాదవ్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, బాధితుడి భార్య లక్ష్మీ జాదవ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. హోంగార్డుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆయన కోరారు. ఒక ప్రజా ప్రతినిధి హోదాలో ఉండి కూడా సామాన్యుడి ప్రాణాలు కాపాడేందుకు తక్షణమే స్పందించి, స్వయంగా ఆసుపత్రికి తరలించిన ఎండీ అహ్మద్ తీరును ఆసిఫాబాద్ పట్టణ ప్రజలు మరియు పోలీసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఆయన చూపిన మానవత్వంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- ఐఎఫ్టీయూ డిమాండ్
- నేడు కలెక్టరేట్ల ముట్టడి..
- 23న హైదరాబాద్‌లో భారీ ధర్నా
- జయప్రదం చేయాలని పిలుపు



ఆసిఫాబాద్, మార్చి 15 (మనసులో **మాట)**: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్ పాషా పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో భాగంగా నేడు (సోమవారం) చేపట్టనున్న జిల్లా కలెక్టరేట్ల ముట్టడిని, అలాగే ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా చాంద్ పాషా మాట్లాడుతూ.. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కేంద్రం కొత్త లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కొత్త చట్టాల వల్ల కార్మికులకు కనీస హక్కులు ఉండవని, వారు యజమానుల వద్ద కట్టుబానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సింగరేణి వంటి సంస్థల్లో ఈ లేబర్ కోడ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయవద్దని ఆయన డిమాండ్ చేశారు

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్
- వైస్ చైర్మన్ అహ్మద్‌తో కలిసి ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభం




ఆసిఫాబాద్, మార్చి 15 (మనసులో మాట): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్ హెచ్‌ఓ) సీతారాం, కౌన్సిలర్ వెంకటేశ్వర్లుతో కలిసి వారు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్ మరియు వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ, పట్టణాన్ని వ్యాధుల బారి నుండి కాపాడుతూ నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఎండ, వాన అని లెక్కచేయకుండా కష్టపడే కార్మికులు తమ ఆరోగ్య విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్య బృందం కార్మికులకు బీపీ, షుగర్ వంటి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి నిపుణులైన వైద్యులు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రామయ్య, బీఆర్ఎస్ నాయకుడు సాయి శ్రావణ్, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్సీ-ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- కరీంనగర్‌లో కమిషన్ చైర్మన్‌కు అధికారుల ఘన స్వాగతం



**కరీంనగర్**: దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి అధికారులు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఆదివారం ఒక ప్రైవేట్ కార్యక్రమం నిమిత్తం కరీంనగర్ విచ్చేసిన ఆయనకు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇన్‌చార్జి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుపతిరావు, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి విజయపాల్ రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దివాకర్ రావు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో అర్హులకు ఫలాలు అందుతున్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు చేరవేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప

# కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించం

- డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారానికి వాడితే కఠిన చర్యలు
- పెట్రోల్ బంకుల్లో ప్లాస్టిక్ క్యాన్లలో ఇంధనం పోయరాదు..
- హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్లే వాడాలి..
- జిల్లావ్యాప్తంగా తనిఖీలకు కలెక్టర్ కె.హరిత ఆదేశం




**ఆసిఫాబాద్, మార్చి 15 (మనసులో మాట)**: గృహ అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మి, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్‌లతో కలిసి ఆమె గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లు మరియు వీధి వ్యాపారులు ఎట్టి పరిస్థితుల్లోనూ డొమెస్టిక్ సిలిండర్లను వాడరాదని స్పష్టం చేశారు. ఈ అంశంపై రెవెన్యూ, పౌరసరఫరాలు, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించార

# పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**మేడిపల్లి, మార్చి 15 (మనసులో మాట)**: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కాచారం గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. నిత్యం గ్రామంలో వీధులను ఊడ్చుతూ, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేస్తూ, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎంతో గొప్పదని ప్రశంసించారు. వారి నిరంతర శ్రమ వల్లే కాచారం గ్రామం స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దబడుతోందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సేవలను గుర్తించి గౌరవించుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మావతి-సురేష్, ఉపసర్పంచ్ దేశెట్టి రాజేందర్, కాంగ్రెస్ నాయకులు పానుగంటి రాజేష్, వార్డు సభ్యులు రవి, గ్రామ కార్యదర్శి వాజిద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# పేద ముస్లింలకు 'రంజాన్ కిట్లు'


మిర్యాలగూడ, మార్చి 15 (మనసులో **మాట)** : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతల సహకారంతో సేకరించిన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరేళ్లుగా ప్రతి ఏడాది మిత్ర బృందం, దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రంజాన్ మాసం దానధర్మాలకు, ఆత్మశుద్ధికి ప్రతీక అని, ఈ పవిత్ర సమయంలో శక్తివంచన లేకుండా పేదలకు సహాయం అందించడం సంతోషంగా ఉందని హమీద్ షేక్ పేర్కొన్నారు. యువత కేవలం వ్యక్తిగత ఎదుగుదలకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వమత సౌభ్రాతృత్వాన్ని చాటేలా తమ మిత్ర బృందం అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. ముస్లిం సోదరసోదరీమణులు ఐక్యతతో మెలుగుతూ, పండుగను ఇంటిల్లిపాది భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన సూచించారు

# కవులు, కళాకారులను గౌరవించే సమాజం సుభిక్షంగా ఉంటుంది

- పుల్లాభట్ల వెంకటరామశర్మ
- మిర్యాలగూడలో వైభవంగా 'నందినీ అవార్డ్స్ -2026'
- ఏడవ రోజుకు చేరిన నాటక పోటీలు



**మిర్యాలగూడ, మార్చి 15 మనసులో మాట**:
కవులు, కళాకారులకు ఎక్కడైతే సముచిత గౌరవం లభిస్తుందో అక్కడ సమాజం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని త్యాగరాయ జిల్లా పరిషత్ గౌరవ అధ్యక్షులు పుల్లాభట్ల వెంకటరామశర్మ అన్నారు. కవిత్వాన్ని, కళలను ఆదరించే సమాజం ఎప్పుడూ ఉన్నత శిఖరాల్లోనే ఉంటుందని ఆయన కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మరియు మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నందినీ అవార్డ్స్-2026' జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు ఆదివారం ఏడవ రోజుకు చేరుకున్నాయి. మిర్యాలగూడ కళాభారతి ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకను డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, డాక్టర్ పందిరి రవీందర్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరామశర్మ మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయల కాలంలో కళలకు పెద్దపీట వేశారని, అందుకే ఆ కాలం చరిత్రలో సస్యశ్యామలంగా నిలిచిపోయిందని గుర్తుచేశారు.



# పశ్చాత్తాపం.. ప్రాయశ్చిత్తం

- రంజాన్ రాత్రుల్లో 'అల్లా'కు వినిపించేలా మనసుల మౌన నివేదన
- 'జిందగీ'లను 'రీ-స్టార్ట్' చేసుకుంటాం.. 'రీ-ఛార్జ్' చేయండని విన్నపం
- క్షమాపణ కోరే ప్రార్థనలు
- జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలనే ఆశతో మసీదులలో భావోద్వేగ దృశ్యాలు

"పవిత్ర రంజాన్ మాసం కేవలం ఉపవాసాల కాలం మాత్రమే కాదు.. అది మనసును శుద్ధి చేసుకునే ఆధ్యాత్మిక యాత్ర.! మసీదులలో సాయంత్రం నుంచి రాత్రివేళల వరకు పురుషులు, మహిళలు, వృద్ధులు తమ జీవితపు బాధలు, తప్పులు, పశ్చాత్తాపాలను అల్లా ముందుంచి కన్నీళ్లతో ప్రార్థిస్తారు.! గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే మరో అవకాశం ఇవ్వమని వేడుకుంటూ, కొత్త ఆశతో జీవితాన్ని మళ్లీ ప్రారంభించాలనే సంకల్పంతో ఆరాధనలో మునిగిపోతారు"..

- మనసులో మాట ప్రత్యేకం



## పశ్చాత్తాపపు ప్రార్థనల వాతావరణం

రంజాన్ మాసంలో సాయంత్రం నుంచి రాత్రివేళ వరకు మసీదులలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది. ఇఫ్తార్ ముగిసిన వెంటనే విశ్వాసులు నమాజ్ కోసం మసీదులకు చేరుకుంటారు. నమాజ్ అనంతరం ప్రార్థనలో మునిగిపోయిన భక్తులు అల్లా ముందు తమ హృదయాల ముడి విప్పి మౌనంగా చెప్పుకుంటారు. గతంలో..తెలిసి చేసినవో..తెలియక చేసినవో.. అనుకోకుండా జరిగివో తప్పుల జ్ఞాపకాలు మనసును తాకినప్పుడు కొందరి కళ్లలో నీరు జారిపడుతుంది.! 'మా తప్పులను క్షమించు.. మాకు మరో అవకాశం ఇవ్వు' అనే వినమ్ర వినతులు గాలిలో కలిసిపోతాయి. కొందరి కన్నీళ్లు నిశ్శబ్దంగా చెంపలపై జారుతుంటే, మరికొందరు లోలోపల కుమిలిపోతూ అల్లా కరుణ కోసం ప్రార్థిస్తారు.!

## 'నీవే మా దిక్కు'ని వేడుకునే విశ్వాసం



జీవితంలో ఎదురయ్యే కష్టాలు, పేదరికం, బాధ్యతల బరువు చాలా మందిని మానసికంగా అలసటకు గురిచేస్తాయి. అలాంటి సమయంలో రంజాన్ ప్రార్థనలు వారికి ఒక నూతన ఆశగా మారతాయి. 'నీవే మా దిక్కు.. మాకు బలం ఇవ్వు' అంటూ అల్లాను ప్రార్థించే వారి గళంలో ఒక నిరాశతో కూడిన ఆశ కనిపిస్తుంది. జీవితంలో ఎదురైన కష్టాలు, పేదరికం, బాధ్యతల బరువు.. ఈ అన్నింటి మధ్య మనిషి కొన్నిసార్లు ఒంటరిగా అనిపించుకుంటాడు. అలాంటి వేళల్లో మసీదు గడప అతనికి ఆశ్రయం అవుతుంది. 'నీవే మా దిక్కు.. మా తప్పులను క్షమించు' అని అల్లాకు విన్నవిస్తూ భక్తులు తమ మనసులోని భారాన్ని దింపుకుంటారు. ఆ ప్రార్థనల్లో విశ్వాసం, భయం, ప్రేమ.. అన్నీ కలిసిన ఒక ఆత్మీయత కనిపిస్తుంది!

## జీవితాన్ని 'రీ-స్టార్ట్' చేసుకునే ఆత్మశక్తి

రంజాన్ మాసం కేవలం 'ఉపవాసాని'కి మాత్రమే పరిమితం కాదు. అది ఆత్మపరిశీలనకు, మనసును శుభ్రం చేసుకునే సమయంగా కూడా భావిస్తారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని కొత్తగా జీవితం మొదలుపెట్టాలని అనేక మంది నిర్ణయించుకుంటారు. చాలా మంది రంజాన్ నెలను తమ జీవితానికి 'కొత్త ఆరంభం'గా భావిస్తారు. గతంలో చేసిన పొరపాట్లను గుర్తుచేసుకుని వాటిని సరిదిద్దుకోవాలని సంకల్పిస్తారు. అల్లా క్షమాపణ పొందితే జీవితం మళ్లీ 'రీ-స్టార్ట్' అయినట్టేనని విశ్వసిస్తారు. అందుకే ప్రతి 'నమాజ్' తర్వాత చేతులు ఎత్తి, హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ భవిష్యత్తులో మంచి మార్గంలో నడిచే శక్తిని ఇవ్వమని కోరుతారు. ప్రార్థనల అనంతరం వారి ముఖాల్లో కనిపించే ప్రశాంతత, ఆధ్యాత్మిక తృప్తి ఈ భావనను మరింత బలపరుస్తుంది.



## భారాన్ని మోసేందుకు 'శక్తి' కోసం విన్నపం..

కుటుంబ బాధ్యతలు, జీవన పోరాటం, అనేక సమస్యలతో నిండిన జీవితంలో ముందుకు సాగేందుకు మనోబలం అవసరం. అందుకే రంజాన్ ప్రార్థనల్లో భక్తులు అల్లాను వేడుకుంటారు.'మాకు శక్తిని ఇవ్వు... సరైన మార్గంలో నడిపించు... మా జీవితాన్ని సార్థకం చేయు..'మనే ప్రార్థనల్లో కేవలం పాపక్షమాపణ మాత్రమే కాదు, జీవన పోరాటాన్ని 'ఎదుర్కొనే శక్తి' కోసం కూడా విన్నపం ఉంటుంది. కుటుంబాన్ని పోషించాలి, పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలి, సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలి అనే బాధ్యతలు ప్రతి మనిషి భుజాలపై ఉంటాయి. ఆ బాధ్యతల బరువును మోసే ధైర్యం, శక్తి ఇవ్వమని అల్లాకు వేడుకుంటారు. ఈ ప్రార్థనలు కేవలం మాటలు కాదు.. మనసులోంచి పుట్టే నిజమైన 'భావోద్వేగాలు..'!







## కన్నీటిలో కొత్త ఆశ.. ఆధ్యాత్మిక 'రీ-ఛార్జ్'

మసీదు ప్రాంగణంలో కనిపించే ఆ 'కన్నీటి చుక్కలు' దుఃఖానికి సూచికలు మాత్రమే కాదు.. కొత్త ఆశకు సంకేతాలు కూడా.! పశ్చాత్తాపంతో కరిగిపోయే ఆ క్షణాల్లోనే మనసు తేలికపడుతుంది. ఈ ప్రార్థనల అనంతరం భక్తుల ముఖాల్లో కనిపించే ప్రశాంతత ప్రత్యేకమైనది. కన్నీళ్లతో భారమైన హృదయం క్రమంగా తేలికపడుతుంది. ఆ క్షణంలో వారు పొందేది కేవలం ఆధ్యాత్మిక సాంత్వన మాత్రమే కాదు, కొత్త ఆశ, కొత్త ధైర్యం కూడా. 'అల్లా కరుణ'పై విశ్వాసం ఉంచి, మరుసటి రోజు 'మంచి మనిషి'గా మారాలని ప్రతిజ్ఞ చేస్తూ విశ్వాసులు మసీదు నుంచి బయటకు వస్తారు. రంజాన్ మాసం చివరికి చేరేసరికి, మసీదులలో 'మౌనం'గా ఏడ్చిన ఆ మనసులు ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు 'రీ-ఛార్జ్' అయినట్టుగా బయటకు వస్తాయి.!

**ఇలా 'రంజాన్ మాసం' ప్రతి విశ్వాసికి ఒక 'ఆధ్యాత్మిక ప్రయాణం'గా మారుతుంది.! పాపక్షమాపణ కోసం ప్రార్థన, మనసు శుద్ధి కోసం ప్రయత్నం, జీవితాన్ని కొత్త ఆశతో మళ్లీ ప్రారంభించే సంకల్పం.!!**





KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

# పోషకాల పవర్‌హౌస్ ఉసిరి



ఉసిరి చిన్న పండు అయినప్పటికీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ ఆహారంగా భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. భారతీయ గూస్బెర్రీగా పిలువబడే ఈ పండు శతాబ్దాలుగా ఆయుర్వేద వైద్యంలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల ఇది ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఫుడ్‌గా గుర్తింపు పొందింది. రోజూ ఆహారంలో కొద్దిపాటి ఉసిరి చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన అనేక ముఖ్యమైన పోషకాలు అందుతాయి. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం, చర్మం మరియు జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపర చడం వంటి అనేక ప్రయోజనాలను ఉసిరి అందిస్తుంది.



**పోషకాలతో నిండిన సహజ వరం**

ఉసిరి పోషక విలువల పరంగా ఎంతో ప్రత్యేకమైన పండు. ఇందులో విటమిన్ సి అత్యధికంగా ఉండటం దీనికి ప్రధాన కారణం. 100 గ్రాముల ఉసిరిలో ఉండే విటమిన్ సి పరిమాణం అనేక ఇతర పండ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు ఇది 193 నుండి 720 మిల్లీగ్రాముల వరకు ఉండవచ్చు. ఈ కారణంగా శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఉసిరిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్ మరియు కొద్దిపాటి కొవ్వు కూడా ఉంటాయి. అదనంగా విటమిన్ ఎ, విటమిన్ బి సమూహం, విటమిన్ ఈ, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు కూడా ఇందులో లభిస్తాయి. ఇవన్నీ కలిసి శరీర ఆరోగ్యాన్ని సమతుల్యంగా నిలబెట్టడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఇందులో ఉండే ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు శరీరాన్ని వివిధ రకాల వ్యాధుల నుండి రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు**

రోజువారీ జీవితంలో ఉసిరి తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల శరీర రోగనిరోధక శక్తి బలపడుతుంది. దీనివల్ల జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉసిరి సహాయపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, ట్రైగ్లిజరైడ్స్‌ను నియంత్రించడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలో కూడా ఉసిరి పాత్ర ఉందని నిపుణులు చెబుతున్నారు. చర్మ ఆరోగ్యానికి కూడా ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. విటమిన్ సి కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం దృఢంగా ఉండటంతో పాటు వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపిస్తాయి. జుట్టు ఆరోగ్యానికి కూడా ఉసిరి ఉపయోగకరంగా భావిస్తారు. జుట్టు రాలడం తగ్గించడం, జుట్టు వేర్లను బలపరచడం, తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఉసిరి ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ ప్రేగుల కదలికలను సవ్యంగా ఉంచి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఇది సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.



ఉసిరి భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలలో కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండుగా గుర్తింపు పొందింది. ముఖ్యంగా శరీరాన్ని శుభ్రపరచే సహజ గుణాలు ఇందులో ఉండటం వల్ల దీనిని అనేక ఆయుర్వేద ఔషధాలలో ఉపయోగిస్తున్నారు. ఉదయం ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు త్వరగా అందుతాయి. దీనివల్ల శరీరానికి శక్తి పెరుగుతుంది మరియు రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది. అలాగే శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపించడంలో కూడా ఉసిరి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఉసిరిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కాలుష్యం, ఒత్తిడి మరియు అనారోగ్యకరమైన జీవనశైలి వల్ల శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించడంలో ఇవి సహాయపడతాయి. దీని వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపిస్తాయి. క్రమం తప్పకుండా ఉసిరి తీసుకోవడం వల్ల శరీరంలోని రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా సహాయపడుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఉసిరిని సహజ ఔషధంగా తరచుగా ఉపయోగిస్తారు. జలుబు, దగ్గు వంటి సమస్యలు వచ్చినప్పుడు ఉసిరి రసం లేదా ఉసిరి పొడి తేనెతో కలిపి తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందుతారని పెద్దలు చెబుతుంటారు. అలాగే గొంతు సమస్యలు తగ్గించడంలో కూడా ఉసిరి ఉపయోగపడుతుంది. కొందరు ఉసిరిని ఎండబెట్టి పొడి చేసి భద్రపరుచుకుని అవసరమైనప్పుడు ఉపయోగిస్తారు. ఇది చాలా కాలం పాటు నిల్వ ఉండే సహజ ఆరోగ్య పదార్థంగా భావిస్తారు.

ఉసిరి ఆధారిత ఉత్పత్తులకు కూడా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఉసిరి జ్యూస్, ఉసిరి క్యాండీలు, ఉసిరి పొడి, ఉసిరి ఆయిల్ వంటి అనేక ఉత్పత్తులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో సహజ ఆహారాలపై ప్రజలు మరింత ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉసిరి వంటి సంప్రదాయ పండ్లకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతోంది. నిపుణులు కూడా రోజువారీ ఆహారంలో సహజ పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

మొత్తానికి ఉసిరి చిన్న పండు అయినప్పటికీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ వరంగా చెప్పుకోవచ్చు. సక్రమమైన ఆహారపు అలవాట్లతో పాటు ఉసిరిని మితంగా తీసుకుంటే శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చు. మన సంప్రదాయంలో ఎంతోకాలంగా ఉపయోగిస్తున్న ఈ సహజ పండు నేటి ఆధునిక జీవనశైలిలో కూడా ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది.



**వాడకం, జాగ్రత్తలు కూడా అవసరం**

1. ఉసిరిని రోజువారీ ఆహారంలో అనేక విధాలుగా తీసుకోవచ్చు. పచ్చిగా తినడం, రసం రూపంలో తీసుకోవడం, ఊరగాయలు లేదా చట్నీలు తయారు చేయడం వంటి పద్ధతులు ఉన్నాయి. కొంతమంది దీనిని పప్పులు లేదా కూరల్లో కూడా ఉపయోగిస్తారు.
2. ఆయుర్వేద వైద్యంలో కూడా ఉసిరికి ఎంతో ప్రాధాన్యం ఉంది. చ్యవన్‌ప్రాష్ వంటి ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధాలలో ఇది ప్రధాన పదార్థంగా ఉపయోగిస్తారు.
3. అయితే ఏ ఆహారం మాదిరిగానే ఉసిరిని కూడా మితంగా తీసుకోవడం అవసరం. అధికంగా తీసుకుంటే కొన్ని దుష్ప్రభావాలు కలగవచ్చు. ఇందులో ఉండే అధిక ఫైబర్ కారణంగా కొందరికి కడుపు ఉబ్బరం, నొప్పి లేదా విరేచనాలు రావచ్చు.
4. అలాగే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే లక్షణం కలిగి ఉండటంతో మధుమేహం మందులు తీసుకునేవారు జాగ్రత్తగా ఉండాలి. తక్కువ రక్తపోటు ఉన్నవారు కూడా ఉసిరి ఎక్కువగా తీసుకోవడం నివారించాలి. సరైన మోతాదులో ఉసిరిని ఆహారంలో చేర్చుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.t

## ఐసీసీ టోర్నీల్లో

# భారత్ దూకుడు కొనసాగుతుంది : రోహిత్ శర్మ




అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు ఇటీవలి సంవత్సరాల్లో విశేష విజయాలను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ప్రదర్శనపై భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కు బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.ఇటీవలి కాలంలో ఐసీసీ టోర్నీల్లో భారత జట్టు ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోందని రోహిత్ పేర్కొన్నారు. ఆయన మాటల్లో, గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు నిరంతరం మంచి ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగుతోందన్నారు. త్రివర్ణ పతాకం ప్రపంచ వేదికలపై ఎగురుతుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.పురుషుల జట్టు ఐసీసీ టీ20 ప్రపంచకప్ ను వరుసగా రెండుసార్లు గెలుచుకోవడం గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. అలాగే హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత మహిళా జట్టు తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచకప్ ను సొంతం చేసుకోవడం చారిత్రాత్మక ఘట్టమని అభినందించారు. ముంబైలో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించడం తనకు ఎంతో ఆనందంగా అనిపించిందని రోహిత్ చెప్పారు.అయితే ఇది విజయాల ప్రారంభం మాత్రమేనని, ఇలాంటి స్థాయికి చేరుకున్న తర్వాత మరింత బాధ్యతతో ముందుకు సాగాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జట్టు సభ్యులందరూ ఇదే దూకుడును కొనసాగిస్తారని తాను నమ్ముతున్నానని తెలిపారు.యువ ఆటగాళ్లకు కూడా రోహిత్ శర్మ సూచనలు చేశారు. అవకాశం వచ్చినప్పుడల్లా దాన్ని వినియోగించుకోవాలని, ప్రతి సవాల్‌ను ధైర్యంగా స్వీకరించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయికి చేరాలంటే నిరంతర శ్రమ ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. మన దేశంలో క్రికెట్‌లో పోటీ చాలా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చిన్న వయసు నుంచే కష్టపడుతూ ముందుకు రావాల్సి ఉంటుందని రోహిత్ తెలిపారు. ప్రతిభతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా కలిసి రావాలని, సరైన సమయంలో మన ప్రతిభను గుర్తించే వ్యక్తి ఎదురవడం కూడా ముఖ్యమని అన్నారు. అయితే అదృష్టం కోసం ఎదురు చూడకుండా క్రమశిక్షణతో సాధన చేస్తూ ముందుకు సాగాలని యువ ఆటగాళ్లకు ఆయన సూచించారు.

## ముంబై జట్టు కూర్పుపై

# హర్భజన్ విశ్లేషణ

రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు జట్ల బలాబలాలపై మాజీ ఆటగాళ్లు తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక క్రీడా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ర్యాన్ రికెల్టన్ మరియు క్వింటన్ డికాక్ ఇద్దరూ ఒకేసారి అగ్ర క్రమంలో ఆడే అవకాశాలు తక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.తన అభిప్రాయం ప్రకారం ఈ ఇద్దరిలో ఒకరికి మాత్రమే తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉందని హర్భజన్ చెప్పారు. జట్టులో రోహిత్ శర్మ వంటి స్థానిక ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లను అగ్ర క్రమంలో ఒకేసారి ఆడించడం సులభం కాదని పేర్కొన్నారు. పరిస్థితులను బట్టి రోహిత్ శర్మ, రికెల్టన్ లేదా డికాక్‌లో ఒకరితో కలిసి ప్రారంభ బ్యాటింగ్ చేయాల్సి రావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో జట్టులో ప్రధాన స్పిన్నర్ ఎంపికపైనా హర్భజన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అల్లా గజన్‌ఫర్ మరియు మిచెల్ శాంట్నర్ మధ్య ఒకరిని మాత్రమే ప్రధాన స్పిన్నర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉందని చెప్పారు. గజన్‌ఫర్ బౌలింగ్‌లో వైవిధ్యం ఎక్కువగా ఉండటం అతనికి అనుకూలంగా మారవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా గజన్‌ఫర్ గురించి చాలా మంది బ్యాటర్లు పూర్తిగా అవగాహన కలిగి లేకపోవడం కూడా అతనికి ప్రయోజనంగా మారవచ్చని హర్భజన్ పేర్కొన్నారు. అయితే పరిస్థితులను బట్టి శాంట్నర్ కూడా కొన్ని మ్యాచ్‌ల్లో జట్టులోకి రావచ్చని ఆయన తెలిపారు.మొత్తానికి రాబోయే ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.








## అయ్యర్‌ను వదిలేయడం

# కోల్‌కతా తప్పు

## అనిల్ కుంబ్లే వ్యాఖ్య

రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో జట్ల వ్యూహాలపై చర్చలు సాగుతున్నాయి. గత సీజన్‌లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయిన కోల్‌కతా నైట్ రైడర్స్ ఈసారి బలంగా పుంజుకోవాలనే లక్ష్యంతో ఉంది. అయితే గత సీజన్‌కు ముందు ఆ జట్టు తీసుకున్న ఒక నిర్ణయం పెద్ద తప్పుగా మారిందని భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డారు. కుంబ్లే వ్యాఖ్యల ప్రకారం, జట్టుకు టైటిల్ అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ను వదులుకోవడం కోల్‌కతా చేసిన ప్రధాన పొరపాటుగా మారింది. రెండు సంవత్సరాల క్రితం ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సమయంలో అయ్యర్ నాయకత్వం జట్టుకు కీలకమైందని ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో ఓపెనర్ ఫిల్ సాల్ట్ కూడా జట్టు విజయాల్లో ముఖ్య పాత్ర పోషించాడని తెలిపారు. కానీ ఈ ఇద్దరినీ జట్టులో నిలబెట్టుకోకపోవడం సరైన నిర్ణయం కాదని కుంబ్లే వ్యాఖ్యానించారు.టైటిల్ గెలిచిన తర్వాత కూడా జట్టు రిటెన్షన్ విధానంలో స్థిరత్వం కనిపించలేదని ఆయన విమర్శించారు. కీలక ఆటగాళ్లను వదిలేయడం వల్లే తరువాతి సీజన్‌లో జట్టు బలహీనపడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇక 18వ సీజన్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన అజింక్యా రహానే అనుభవజ్ఞుడైన ఆటగాడేనని కుంబ్లే పేర్కొన్నారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబైకి, అలాగే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు సారథ్యం వహించిన అనుభవం ఉన్నప్పటికీ టైటిల్ సాధించలేకపోయాడని చెప్పారు. టైటిల్ గెలిపించిన కెప్టెన్‌ను కొనసాగించకపోవడం కోల్‌కతాకు నష్టంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ రికార్డు ధరకు పంజాబ్ కింగ్స్ జట్టులో చేరి తన నాయకత్వంతో ఆ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అయితే టైటిల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిపోవడంతో పంజాబ్ రన్నరప్‌గా సరిపెట్టుకోవాల్సి వచ్చింది.మొత్తానికి కీలక ఆటగాళ్లను వదులుకోవడం వల్లే కోల్‌కతా గత సీజన్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నదనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.





## అంతర్జాతీయ క్రికెట్‌కు సర్ఫరాజ్ అహ్మద్ వీడ్కోలు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. గత మూడు సంవత్సరాలుగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఆయన తన కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించడంతో దాదాపు రెండు దశాబ్దాల క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలికినట్లైంది.
పాకిస్థాన్ క్రికెట్‌లో విజయవంతమైన సారథులలో ఒకరిగా గుర్తింపు పొందిన సర్ఫరాజ్ అహ్మద్ అనేక కీలక మ్యాచ్‌లలో జట్టుకు నాయకత్వం వహించాడు. మొత్తం 100కి పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించిన ఆయన తన నాయకత్వంలో జట్టుకు కీలక విజయాలు అందించాడు.
సర్ఫరాజ్ నాయకత్వంలో పాకిస్థాన్ జట్టు 2017లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2017లో విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. అలాగే 2006లో జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ యువజట్టును కూడా విజేతగా నిలిపి ప్రత్యేక గుర్తింపు పొందాడు.
వీడ్కోలు సందర్భంగా సర్ఫరాజ్ మాట్లాడుతూ పాకిస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం తన జీవితంలో అత్యంత గౌరవకరమైన విషయం అని పేర్కొన్నారు. పాక్ జెర్సీ ధరించి ఆడిన ప్రతి క్షణం తనకు ఎంతో ప్రత్యేకమని ఆయన తెలిపారు.
ఇకపై క్రికెట్‌కు సంబంధించిన బాధ్యతలతోనే కొనసాగాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ జూనియర్ జట్టుకు కోచ్‌గా పనిచేసిన ఆయన భవిష్యత్తులో సీనియర్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## అభిషేక్‌తో మా జోడీ

# ‘ఫైర్–ఫైర్’

## సంజూ శాంసన్







పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్ తన ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ జోడీని చాలామంది ‘ఐస్–ఫైర్’గా అభివర్ణిస్తున్నప్పటికీ, నిజానికి తామిద్దరూ అగ్నిలా దూకుడుగా ఆడే బ్యాటర్లు అని సంజూ పేర్కొన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన చేశాడు. లీగ్ దశలో ఒకే మ్యాచ్ ఆడిన అతడు సూపర్–8 దశలో జట్టులో స్థానం సంపాదించి వరుస అర్ధశతకాలతో భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కీలక మ్యాచ్‌లలో అతడి దూకుడు బ్యాటింగ్ జట్టుకు బలాన్నిచ్చింది. అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించడం గురించి సంజూ మాట్లాడుతూ, “మా జోడీ ఐస్–ఫైర్ కాదు. మేమిద్దరం ఫైర్ ఆటగాళ్లమే. కొన్నిసార్లు అభిషేక్ దూకుడుగా ఆడతాడు, మరికొన్నిసార్లు నేను దాడి చేస్తాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. మైదానంలో కూడా, బయట కూడా అతడితో ఉండటం చాలా సౌకర్యంగా ఉంటుంది” అని చెప్పాడు.అభిషేక్ ధైర్యంగా అన్ని రకాల షాట్లు ఆడగల బ్యాటర్ అని సంజూ ప్రశంసించాడు. మ్యాచ్ సమయంలో కూడా ఇద్దరి మధ్య సరదా సంభాషణలు జరుగుతాయని, బంతి ఎలా వస్తుందో అడిగితే సిక్సర్ కొట్టమని చెప్పేంత సరళంగా తమ మధ్య మాటలు ఉంటాయని తెలిపాడు.ఈ టోర్నీలో కీలక మ్యాచ్‌లలో సంజూ అద్భుతంగా రాణించాడు. సూపర్–8 దశలో వెస్టిండీస్‌పై అజేయంగా 97 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై 89 పరుగులతో మెరిశాడు. ఫైనల్లో కూడా అతడు మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు బలమైన స్కోరు అందించాడు. ఫైనల్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో కలిసి తొలి వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన సంజూ అర్ధశతకంతో జట్టును ముందుకు నడిపించాడు. అనంతరం బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ రాణించడంతో ప్రత్యర్థి జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. దీంతో భారత జట్టు భారీ తేడాతో విజయం సాధించి పొట్టి ప్రపంచకప్‌ను మూడోసారి సొంతం చేసుకుంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

### గీత గోవిందం అవకాశం వదిలేసిన లావణ్య త్రిపాఠి

## విజయ్–రష్మికలపై

# ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్‌కు చెందిన నటి లావణ్య త్రిపాఠి తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట గురించి ఆమె చెప్పిన మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న లావణ్య త్రిపాఠి గీత గోవిందం సినిమా గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ చిత్రానికి మొదట తననే కథానాయికగా సంప్రదించారని, కానీ అప్పట్లో కథ వినకముందే తాను ఆ అవకాశాన్ని తిరస్కరించానని తెలిపారు.తర్వాత కథ విన్నాక మాత్రం ఆ సినిమాలో నటించాలని అనిపించిందని ఆమె చెప్పారు. అయితే అప్పటికే కొన్ని అపోరాల కారణంగా ఆ అవకాశం తన చేతుల నుంచి జారిపోయిందని వెల్లడించారు. అదే సందర్భంలో ఆమె మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఆ సినిమా తన దగ్గర నుంచి వెళ్లిపోవడం వల్లే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించే అవకాశం వచ్చిందేమో అనిపిస్తుందని అన్నారు. వాళ్లిద్దరూ నిజంగా చాలా అందమైన జంట అని కూడా ఆమె పేర్కొన్నారు.



గీత గోవిందం సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించగా, ఆ చిత్రం భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమా ద్వారానే ఈ జంటకు మంచి గుర్తింపు వచ్చింది. సినిమా సమయంలోనే ఇద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడిందని సినీ వర్గాల్లో అప్పట్లో ప్రచారం జరిగింది. తర్వాత ఈ జంట మరోసారి డియర్ కామ్రేడ్ సినిమాలో కలిసి నటించారు. ఆ సినిమా సమయంలో ఇద్దరి మధ్య మరింత దగ్గరయ్యారనే వార్తలు వినిపించాయి. కొన్నేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టినట్లు వార్తలు వెలువడుతున్నాయి.ఇప్పుడు లావణ్య త్రిపాఠి చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ఒక సినిమా అవకాశం ఎలా ఇద్దరి జీవితాలను కలిపిందన్న అంశంపై అభిమానుల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.



### రాయ్ లక్ష్మి తాజా చిత్రం

# నెట్టింట వైరల్

నటి రాయ్ లక్ష్మి మరోసారి తన తాజా చిత్రంతో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఆమె తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న ఫోటో ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.సముద్రతీరానికి సమీపంలో జరిగిన ఉత్సాహభరితమైన సాయంత్ర వేడుకలో తీసినట్లు కనిపించే ఈ చిత్రంలో రాయ్ లక్ష్మి ప్రకాశవంతమైన పసుపు రంగు దుస్తుల్లో కనిపించారు. చుట్టూ వెలుగులు, సంగీతం మధ్య ఆనందంగా గడుపుతున్న ప్రజల మధ్య ఆమె కెమెరా వైపు స్వల్ప చిరునవ్వుతో ధైర్యంగా నిలబడి కనిపించారు. ఈ ఫోటోకు ఆమె "నియమాలను ఉల్లంఘించడం నాకు ఇష్టం, హృదయాలను కాదు" అనే భావాన్ని వ్యక్తం చేస్తూ వ్యాఖ్యను జత చేశారు.సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ చురుకుగా ఉండే రాయ్ లక్ష్మి తరచుగా తన ప్రయాణాలు, చిత్రాలు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె ఖాతాకు పెద్ద సంఖ్యలో అనుచరులు ఉండగా, ఆమె అందం మాత్రమే కాకుండా ఆమె ధైర్యమైన వ్యక్తిత్వం కూడా అభిమానులను ఆకట్టుకుంటుంది.మలయాళ సినీ ప్రేక్షకులకు రాయ్ లక్ష్మి మంచి పరిచయమైన నటి. ఆమె మలయాళంలో పలు ప్రముఖ చిత్రాల్లో నటించారు. రాక్ అండ్ రోల్, అన్నన్ తంబి, టు హరిహర్ నగర్, చట్టంబినాడు, క్రిస్టియన్ బ్రదర్స్ వంటి చిత్రాల ద్వారా ఆమెకు కేరళలో మంచి గుర్తింపు లభించింది.మలయాళ సినిమాలతో పాటు తమిళ, తెలుగు, కన్నడ, హిందీ చిత్రరంగాల్లో కూడా రాయ్ లక్ష్మి నటించారు. పలు భాషల్లో పనిచేసిన నటిగా ఆమె ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇటీవల ఆమె మలయాళంలో కనిపించిన చిత్రం DNA.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో సినీ పరిశ్రమలో చర్చకు వచ్చే 'కాస్టింగ్ కౌచ్' అంశంపై కూడా రాయ్ లక్ష్మి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆర్.వి. ఉదయకుమార్ దర్శకత్వంలో తనకు మొదటి అవకాశం లభించిందని, ఆయనను తండ్రి వంటి వ్యక్తిగా భావిస్తానని తెలిపారు. ఆ ప్రారంభం వల్ల తన సినీ ప్రయాణం కొందరితో పోలిస్తే భిన్నంగా సాగిందని ఆమె చెప్పారు. కాస్టింగ్ కౌచ్ గురించి ఎన్నో చర్చలు జరిగినప్పటికీ, తాను వ్యక్తిగతంగా అలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని రాయ్ లక్ష్మి స్పష్టం చేశారు. కొన్నిసార్లు పరిశ్రమలోని ప్రతికూల కథనాలపై ఎక్కువ దృష్టి పడుతుందని, కానీ సినిమా రంగంలో ఎన్నో మంచి అవకాశాలు కూడా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఎక్కువ మంది సినీ రంగంలో పనిచేసే వారు తమ పనిపై ఆసక్తితో పనిచేస్తారని, కొద్ది ప్రతికూల అనుభవాల ఆధారంగా మొత్తం పరిశ్రమను అంచనా వేయకూడదని ఆమె అభిప్రాయపడ్డారు




### బాలీవుడ్‌లో కీర్తి సురేష్ కొత్త చిత్రం

# విడుదలకు సిద్ధం

దక్షిణ భారత చిత్రరంగంలో ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పుడు హిందీ చిత్రరంగంలో కూడా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఆమెకు బాలీవుడ్‌లో కూడా వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె నటించిన తాజా హిందీ చిత్రం రఫ్తార్ విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావుతో కలిసి కీర్తి సురేష్ నటిస్తున్నారు. వీరిద్దరూ ఒకే చిత్రంలో కలిసి నటించడం ఇదే మొదటిసారి కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. నటనలో ప్రత్యేక గుర్తింపు పొందిన రాజ్‌కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ ఎలా ఉండబోతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం రఫ్తార్ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. యాక్షన్, భావోద్వేగాలు కలగలిపిన కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ఆదిత్య నింబల్కర్ దర్శకత్వం వహిస్తున్నారు.ఈ చిత్ర నిర్మాణంలో పత్రలేఖ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కథకు అనుగుణంగా రాజ్‌కుమార్ రావు యువకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అతనికి సమానంగా బలమైన పాత్రలో కీర్తి సురేష్ కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావు, కీర్తి సురేష్‌తో పాటు అనురాగ్ ఠాకూర్, రోహన్ వర్మ, తన్యా మానిక్తలా, రజత్ కపూర్ వంటి నటీనటులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథకు అనుగుణంగా విభిన్నమైన పాత్రలు ఈ సినిమాలో ఉండనున్నట్లు తెలుస్తోంది.ఇక మరోవైపు రాజ్‌కుమార్ రావు ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే ఆయన టోస్టర్ అనే చిత్రంలో కనిపించనున్నారు. ఆ చిత్రంలో ఆయన సరసన సన్యా మల్హోత్రా కథానాయికగా నటిస్తున్నారు.మొత్తానికి రఫ్తార్ చిత్రం ద్వారా కీర్తి సురేష్ మరోసారి బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ఆమెకు హిందీ చిత్రరంగంలో మరింత గుర్తింపు తీసుకువస్తుందా అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.





CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861